
జ్యోతి
జూన్ '64/60 N.P.
June '64

DBN PRODUCTIONS

డి.బి.ఎన్. వారి

దాగుడు మూతలు

నిర్మాత డి.బి. నారాయణ

దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు

మాటలు. ముళ్లపూడి వెంకటరమణ

సంగీతం. కె.వి.మహదేవన్



శ్రీ ఫిలింస్ విడుదల

June '64



తొలిమాట

భారత చరిత్రలో జనవరి 30 వ తేదీ వలెనే మే 27 వ తేదీకూడా దుర్దినం. అది మన మహా నాయకుడు జవహర్లాల్ నెహ్రూ అస్తమించిన రోజు.

ఆయన అద్భుత జీవితంలో కొన్ని ఘట్టాలను స్మృతి పథానికి తేగల కొన్ని ఛాయాచిత్రాలను ఈ సంచికలో ముద్రిస్తున్నాము.

• • •

ఈనెల రాజకీయ వాతావరణం శ్రీ నెహ్రూ నిర్యాణానికి ముందు వ్రాయబడినదిగా గ్రహింప ప్రార్థన.

• • •

హాస్యబ్రహ్మ కీర్తిశేషులు భమిడిపాటి కామేశ్వరరావుగారికి శ్రీతంబు ఘటించిన వ్యాసాంజలిని ఇటీవలే జరిగిన వారి వర్ధంతి సందర్భంలో ప్రచురిస్తున్నాము.

ఈ సంచికలో ప్రత్యేకాకర్షణ "దృక్పథం" కథానిక.

సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య
విడిప్రతి వెల : 60 న.పై. — ఏడాది చందా : ఏడు రూపాయలు
సంపుటి 2 జూన్ 1964 సంచిక 6

పాఠక మహాశయా! ఈ నెల

[illegible]


ఉత్తరాయణం	...	9
రాజకీయ వార్తావరణం	...	14
అంతరించిన శకం	...	20
సెక్రటరీ – యద్దనపూడి సులోచనారాణి	...	25
దృక్పథం – ఆచంట శారదాదేవి	...	41
మనసుచాలని మంచిబ్రతుకు – కె. వివేకానందమూర్తి	...	54
శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు – తంబు	...	65
కంపార్టుమెంటాలిటీ – రావి కొండలరావు	...	78
నీమీద ఒట్టు – కొమ్మూరి పద్మావతీదేవి	...	86
పన్‌చాంగము – పకాభి	...	93
స్వరలహరి – పి. బి. శ్రీనివాస్	...	95
చైత్రయాత్ర –	...	105

ముఖచిత్రం:
అన్నపూర్ణావారి "డాక్టర్ చక్రవర్తి"లో సావిత్రి.

సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
బాపు, వి. ఎ. కె. రంగారావు, [illegible]

Edited and Published by V. V. Raghavaiah for Jyoti Publications
and Printed by him at Thrinadh Art Printers
Buckinghampet post, Vijayawada-2






నేలరాలిన ఎర్రగులాబీ



చిన్నారి పాపతో



మేధావి ఐన్‌స్టీన్‌తో

ఉత్తరాయణం

అందముగా నున్న బి. సరోజాదేవి ముఖచిత్రం, ఈ నెల "జ్యోతి" ఆకర్షణను ద్విగుణీకృతము చేయుచున్నది. "మనసు లోని కోరిక" వేసిన కథలన్నింటిలోకి మరీ బాగుంది. ఆరుద్రగారి కూనలమ్మపదాలు ఆహ్లాదముగా వున్నవి.

గుండుమళ్ళ వెంకటరామారావు,
శ్రీకాకుళం

ముఖచిత్రం "బి. సరోజాదేవి" చాల బాగుంది. నా అభిమాన రచయిత్రులు యద్దనపూడి సులోచనారాణిగారు, ముప్పాళ రంగనాయకమ్మగారు రచించిన "సెక్రటరీ" "నవ్వింది జాబిల్లి" చాల బాగుగానున్నవి. "స్నేహము" కరుణామయులుకూడాచక్కని కథలే. "జ్యోతి"కి యిట్టి ఒక ఆకర్షణ. జ్యోతి చదువుటకు చాల సంతోషముగా నుండును. ఇకముందు యింకా మంచికథలు వేస్తారని ఆశిస్తున్నాను.

కుమారి కాకర్లపూడి అనంతలక్ష్మి
సత్యవతీదేవి, రాజవొమ్మంగి.

"జ్యోతి"లో ఎక్కువగా కార్టూనులు, హాస్యకథలు ప్రచురించితే బాగుంటుంది.

"స్నేహం", "కరుణామయులు" అను కథలు బాగున్నాయి. రచయితలకు నా ధన్య వాదాలు.

యం. మంజూర్. నెల్లూరు

మే నెల సంచికలో ముప్పాళ రంగ నాయకమ్మగారు రాసిన "నవ్వింది జాబిల్లి" అనే కథ వాస్తవానికి దూరాదూరంగావున్నట్లు నిపించింది. రచయిత్రి హేమ పాత్రలో చంచలతని యెందుకు చిత్రీకరించారో అర్థము కావటంలేదు. సినిమా థియేటరులో యెవరో తెలియని ఒకానొక అందగాడిని చూచి అతనిపై మరులు గొనడము అస హజముగా కనిపిస్తుంది. అతని గురించి కొంతసమాచారమైనా హేమకు తెలిసినట్లుగా చిత్రించివుంటే బాగుండేది. కనీసం లేత వయసులో మనస్సు అర్పించిన స్నేహితు నిగా గుర్తింపబడేటట్లు చేసివుంటే కథ ఇంకా రాణించేది.

జి.వి.ఆర్. ఆచారి, భువనేశ్వరం.

మే సంచికకు నా అభిమాననటి బి. సరోజాదేవిగారి ముఖచిత్రము ఎంతో వన్నె తెచ్చినది. సీరియల్ "సెక్రటరీ" చాలా బాగుంది. రచయిత్రి యద్దనపూడి సులోచనా రాణి అభినందనీయులు.

"మనసులోని కోరిక" "నవ్వింది జాబిల్లి" కథలు బాగుగానే ఉన్నాయి. "జ్యోతి"లో ప్రశ్నలు-సమాధానములు అను శీర్షికకూడ ప్రవేశపెట్టిన బాగుండును.

కె. శివభాస్కర్, హైదరాబాదు.

"సెక్రటరీ" సీరియల్ ముందుముందు బాగుండవచ్చేమోగాని ఇప్పటికి ఏమంత గొప్పగాలేదు. "నవ్వింది జాబిల్లి" రచయిత్రి స్టాండర్డ్‌లోవుంది. ఈ మధ్య "జ్యోతి" ప్రచురిస్తున్న కథలలో కల్లా గొప్పది "మనసులోని కోరిక".

కె. రమణమూర్తి, శ్రీకాకుళం.

వాస్తవ కథ

విజయనగరం,

ప్రియమైన రఘూ,　　　　5—5—1963.

నిన్న వ్రాసిన ఉత్తరం నిన్ననే చేరింది. చాలా బాధపడ్డాను. నీవు వేళకు యింటికే రావట. స్కూలుకని చెప్పి సినిమాలకు వెళతావట. ప్రొద్దెక్కిన తరువాత గాని నిద్రలేవవట. అమ్మా, నాన్నలపైన యేమాత్రం గౌరవంలేదట. చూడు, రఘూ! నీవు పెద్దవాడివి. ఒకప్పుడు యే డాక్టరో, ఇంజనీరో కావాలని విదేశాలకు వెళ్ళిరావాలని యెన్నో చెప్పేవాడివి. ఇప్పుడు యిలా ఎందుకు మారిపోయావో అర్థం కావటంలేదు. డబ్బు దుబారాచేసి, మంచివేషం వేసుకొని, వేళకు తిండి, నిద్రలేక, ఆరోగ్యం, అర్థం, విలువైన కాలాన్ని వృధాచేసుకుంటే ఎలా? తరువాత తల్లి తండ్రుల గతియేమిటి? ఆలోచించు. కాలం గడచిన తర్వాత, వయసు మళ్ళినతరువాత, తలితండ్రులు దిక్కులేనివారైన తర్వాత ఆలోచించి, పశ్చాత్తాపపడి ప్రయోజనం యేమిటి? ఇప్పుడే ఒకసారి ఆలోచించు. నీకు నచ్చితే నాది ఒక సలహా. నీవు గుంటూరువెళ్ళి రవి ట్యుటోరియల్ కాలేజీలోను, హాస్టలులోను చేరు. ఇక్కడ మా యింటిప్రక్కనవున్న వారబ్బాయి నీలాగా తిరుగుతుంటే అక్కడకువెళ్ళి ఒక్క యేడాదిలోనే మెట్రిక్ ప్యాసయినాడు. కనుక నీవుగూడ అలాగే చేయగలవని ఆశిస్తాను.

ఇట్లు,
నీ అక్క.

• • •

వివేకపురం,

ప్రియమైన సోదరికి,　　　　20—5—64.

నమస్కారములు. అంతా కులాసాగా యున్నాము. నీ సలహా యెంత అమూల్యమైనదో అనుభవంలో గ్రహించాను. "రవి"లో చేరిన మొదట్లో యేదో కష్టమనిపించింది. ఎందుకో తెలిసేదికాదు. ఏ పని చేసినా, మాస్టార్లేమనుకుంటారో అనే బాధ. వారుమాత్రం యేమనేవారుకారు. వ్యక్తి స్వాతంత్ర్యం, ఆత్మగౌరవం అంటే చెప్పకుండానే నేర్చుకొన్నాను. అక్కడి వాతావరణం అటువంటిది. ప్రతి నెలా పెట్టిన పరీక్షలలోని మార్కుల పట్టిక నీ కందేవుంటుంది. దానినిబట్టి నా విద్యాభివృద్ధిని నీవు గ్రహించివుండవచ్చు. అందుకు, అక్కడి అధ్యాపకుల సామర్థ్యం, లాబొరేటరీ వసతులు, క్రమశిక్షణే కారణమని వేరే చెప్పనక్కరలేదు. నన్ను చూచినతరువాత మన గ్రామంలోని వారెందరో చేరాలనుకుంటున్నారు. రిజల్ట్సు వచ్చినతరువాత గుంటూరువెళ్ళి మా స్నేహితులను అధ్యాపకులను కలుసుకొన్నాను. గుంటూరువెళ్ళినతరువాత రవి ట్యుటోరియల్ కాలేజికి వెళ్ళకుండా రావడం యెలా? దీని కంతకూ కారణం నీసలహాయేకదా. నమస్కారం, అక్కా!

ఇట్లు,
నీ తమ్ముడు.

"జ్యోతి" మాసపత్రిక మా గ్రామానికి రెండు నెలలుగా వస్తూయున్నది. నేను మాత్రం యిదే మొట్టమొదటిసారిగా చూశాను. బి. సరోజ ముఖచిత్రంతో వెలువడిన మేనెల సంచిక చాల అందంగా ఆకర్షణీయంగా వుంది. ముఖ్యంగా "పతాభిగారి వన్‌డాంగం," ముప్పాళ రంగనాయకమ్మగారి "నవ్వింది జాబిల్లి" నన్నెంతో ఆకర్షించాయి. అందుకు నా కృతజ్ఞత తెలియచేయుచున్నాను.

యస్. నాగరాజు, యలమంచిలి

మా విద్యార్థి సంఘానికి 'జ్యోతి' గత రెండు నెలలుగా తెప్పిస్తున్నాము.

ఈనెల సంచికలో రాజకీయ వార్తావరణం, కార్టూనులు కొన్ని యెంతో బాగున్నాయి. రచయితల పేర్లనుబట్టి యెంతో ఆతురతగా చదివిన కొన్ని కథలు అసహజంగా, వాస్తవానికి దూరంగా వున్నాయి.

అనుభవజ్ఞులైన సంపాదకుల సారథ్యంలో 'జ్యోతి' స్థాయితప్పక త్వరలో పెరుగగలదని ఆశిస్తూ.

పెండేకంటి రామమోహన్‌రావ్
ఢిల్లీ — 1

ఏమండోయ్! జ్యోతిగారూ! మిమ్మల్నే. మా టాగూర్ లైబ్రరీ సభ్యులు మెచ్చుకున్నారు.

"సెక్రటరీ" కథ బాగారాశారు.

బాపుగారు కొంచెం రెష్టు తీసుకుంటున్నట్టున్నారు.

శ్రీ టాగోర్ లైబ్రరీ, విశాఖపట్టణం

యం. సీతాగోపాల్‌గారు వ్రాసిన "కరుణామయుడు", రత్నామహీధర్‌గారి "ఖామా కలాపం" చాలా బాగావున్నవి. శ్రీధర్‌గారి కార్టూనులు చాలాబాగావున్నవి. ఏప్రిల్ నెలలోవలె మే నెలలో నిత్యానందంగారి జీవితంలోని యేదయినా వక కథ వుంటుందేమోనని చాలా సంబరపడినాను. తీరా పుస్తకం మొత్తం తిప్పినా కనిపించలేదు. వీలయినంతవరకు ప్రతినెల నిత్యానందంగారి జీవిత ఘట్టాలను ప్రచురిస్తుంటే బాగావుంటుంది.

ఎ. ఆర్. నాథ్. సూళ్ళూరుపేట.

మే నెల సంచిక అత్యంతాకర్షణీయంగా వుంది.

ఆరుద్రగారి "కూనలమ్మ పదాలు" బాలగంగాధరతిలక్‌గారి "చిన్నారికి చిన్నమాట" కథలకు ముప్పాళ రంగనాయకమ్మగారి "నవ్వింది జాబిల్లి." బలరామగారి "స్నేహం" చాలా బాగున్నవి. యద్దనపూడివారి "సెక్రటరీ" సీరియల్ చాలా బాగుంది. ప్రారంభంలోనే యింత బిగిగా నడుస్తున్న కథ యింకా యెంతబాగా వుంటుందోననే కుతూహలం కలుగుతున్నది.

శ్రీమతి జి. తోయాజాక్షీ ఈశ్వరరావు,
నౌరోజాబాద్ (మ.ప్ర)

ఈ మాసం "జ్యోతి"లో "మనసులోని కోరిక" చాలాబాగున్నది. కథరాసినవారికి, ప్రచురించిన మీకు మా కృతజ్ఞతాభినందనలు.

ఆళ్ళవెర్రి అన్నపూర్ణ,
ఎ. వి. రంగయ్య, గుంతకల్లు.

బి. యస్. రోజా ముఖచిత్రం చాలా బాగుంది. "విట్సు" ఇంకా యెక్కువగా వేయాలని కోరుతున్నాను. "కూనలమ్మ వదాలు" పునర్దర్శనం హాయినికలిగించింది.

యద్దనపూడి సులోచనరాణిగారి "సెక్రటరీ" సీరియల్ కథ చాలా బాగుంది.

ముప్పాళ రంగనాయకమ్మగారి "నవ్వింది జాబిల్లి" జ్యోతికి ప్రత్యేక ఆకర్షణ.

"మనసులోని కోరిక." "స్నేహం." "కరుణామయులు" కథలు బాగున్నాయి.

ఇంకా మంచికథలు వేస్తారని ఆశిస్తాను.

వావిలపల్లి కృష్ణమూర్తి, పారాపురం
(శ్రీకాకుళం జిల్లా)

"సెక్రటరీ" సీరియల్ బాగానేఉంది. పోనీ....బాగుంది. ఈ కథలో పాత్రలు శ్రీమతి సులోచనారాణి కేవలం కల్పించినా, మనకు నిత్య జీవితంలో ఎక్కడో అక్కడ ఎదురౌతూఉంటాయి. ఆవిడ ఎప్పుడూ ఒకే వాతావరణంలో ఆలోచించి కథలు రాస్తారు. రచయిత్రి కథలు చాల చదివాక ఈ అభిప్రాయానికి వచ్చాను. మొత్తానికి "పరవా లేదు" "ఒక మోస్తరుగాఉంది" "ఎబ్బెట్టుగా లేదు" లాంటి వ్యాఖ్యలకు బదులు, రచయిత్రి కథలకు "మంచికథ" అన్న మొక్క వాడవచ్చు.

గరిమెళ్ళ మోతీలాల్, భువనేశ్వరం.

"జ్యోతి"లో ఎదురుచూసిన సీరియల్ నేటికి మొదలైంది. అది సులోచనారాణిగారి రచనే అవడం ఎంతో ఆనందదాయకం. ఆమె రచనలు పాఠకులకు ఉత్సాహాన్ని కల్గించి, మరుగుపడిన సత్యాలను పైకి చాటుతాయని నా అభిప్రాయం. "సెక్రటరీ" కథ ప్రారంభంలోనే నా అభిప్రాయాన్ని బలపరచింది. దయచేసి ఎక్కువపేజీలు సీరియల్‌కి కేటాయించగలరనుకుంటున్నా. ఇదే సంచికలోని ముప్పాళ రంగనాయకమ్మగారి "నవ్వింది జాబిల్లి" పాఠకలోకానికి కథావస్తువులో క్రొత్తదనాన్ని అందించింది. ఈ ఇరువురు రచయిత్రులకూ, మీకూ అభివందనలు.

వేమూరి సూర్యప్రకాశరావు.
ఉమ్మలాడ

ఏదైనా పత్రికలో ఏదైనా సీరియల్ మొదలుపెట్టడం తరువాయి, కొందరుపాఠక సోదరులు మొదటి సంచికను చదివీ చదవగానే "అద్భుత" మనో, "అసహ్య"మనో అభిప్రాయం ప్రకటిస్తారు. మరీ అద్భుతంగానో, మరీ అసహ్యంగానో వుంటే తప్ప, సాధారణంగా ఏ నవల మీదైనా కొద్ది పేజీలు చదివి అంత తొందరగా ఖచ్చితమైన అభిప్రాయానికి రావడం కష్టమనుకుంటాను. అందుచేత సులోచనారాణిగారి సీరియల్ "సెక్రటరీ"ని పూర్తిగా చదివి గాని, నా అభిప్రాయం మీకు తెలియజేయలేను.

కె. రామారావు, విశాఖ పట్టణం.

సీతా గోపాల్‌గారి "కరుణామయులు" కథ చదివిన తరువాత తెలిసింది - ఈ సంచికలో చిన్నపిల్లలకు ప్రత్యేకంగా కథలకోటి ప్రవేశపెట్టారని.

ఆర్. శ్రీరామం, శ్రీకాకుళం.

"జ్యోతి" రెండు నెలలనుంచి బాగుంది. మేనెలలో ప్రచురించిన సీరియల్ కథ (సాంఘిక నవల) "సెక్రటరీ" చాలా బాగుంది. రచయిత్రిగారికి, మీకు నా అభివందనములు.

ఎం. ఆర్. రాణి, విశాఖపట్టణం.

వచ్చే సంచికలో

అందాలు అసూయలు
కథ; రచన :
అరవింద.

• • •

ఊసరవెల్లి
కథ; రచన :
కె. వి. ఎస్. అచ్యుతవల్లి.

రాజకీయ వాతావరణం

షేక్ అబ్దుల్లా రాజకీయాలు

భారతదేశంలో వున్న ఆరు కోట్ల ముస్లింలు, కాశ్మీర్‌ను పాకిస్తాన్‌కు అప్ప చెప్పాలా, ఇండియాలోనే అట్టేపెట్టుకోవాలా అని అడిగితే, రహస్యంగా అయినా కూడా రెండోమాటకే ఓటు వేస్తారు.

కారణం, వారికి తెలుసు – మతోన్మాదం అనేది రగుల్కొవటం మొదలుపెడితే, తరువాత తరువాత ఆపటానికి ప్రయత్నించినా ఆగదని, విలయతాండవం చేస్తూ వెఱ్ఱిపోగలు కక్కుతుందని.

రాజ్యాల అస్తిత్వం మతాల ప్రాతిపదిక మీద లేదని యిప్పటికే చాలామందికి అర్థమయింది.

అందుకే కాశ్మీర్‌లో జైలునుంచి విడుదల అయిన వెంటనే షేక్ అబ్దుల్లా మాట్లాడిన తీరుకు, ఢిల్లీవచ్చి అక్కడి నాయకులతో మాట్లాడిన తరువాత చేసిన ప్రసంగం తీరుకు, ఒకవిధమైన వ్యత్యాసం కనిపించింది. కాస్తంత నిభాయింపు, ఆలోచనలలో శాలీతనం, కాస్త నమ్రత ఢిల్లీలో ఆయన చేసిన ప్రసంగాలలో క్రమ క్రమంగా అందుకే ద్యోతకమైనాయి. శ్రీనగర్‌కు తిరిగి వెళ్ళేసరికి, అసలే ఆవేశాన్ని అణచి వేసుకున్నారు తన ధోరణిలో ఆయన.

ఢిల్లీలోను, వార్ధాలోను, దక్షిణాన మదరాసులో రాజాజీతోను – యెందరితోనో ఆయన సంప్రతించారు. పదకొండేండ్ల తరువాత భారతదేశాన్ని మళ్ళీ చూచారు. హిందువులను, మహమ్మదీయులను ఒక సమరస్వభావంతో వుండగా చూడటం షేక్ అబ్దుల్లా ధోరణిలో ఒకమార్పుకు దోహదం కలిగించింది.

ఆయన యిప్పుడనే మాటలు యివి – భారతదేశంలో మతాలతో నిమిత్తంలేని లౌకిక రాజ్యాంగనీతి యెప్పుడూ కొనసాగేందుకు వీలుగా కాశ్మీర్ సమస్య పరిష్కారం కావాలి.

భారత, పాకిస్తాన్‌ల మధ్య సుహృద్భావం పెంపొందాలి. కాశ్మీర్‌ను గురించి యేమి ఆలోచించినా, పాకిస్తాన్ భారతదేశాలలోని అల్పసంఖ్యాకుల శ్రేయస్సుకు, ప్రాణ రక్షణకు హాని కలిగేవిధంగా వుండకూడదు. కాశ్మీర్ భవిష్యత్తును గురించిన అయోమయస్థితి ఇప్పటికైనా అంతమైపోవాలి – ఇవి శ్రీ అబ్దుల్లా ఈనాడు అనేమాటలు.

కాశ్మీర్‌వాసులకు 'ప్లెబిసైట్' హక్కు ఇవ్వాలి అనే విషయం ఆయన ప్రస్తావించకపోవటం గమనించదగిన విషయం.

షేక్ అబ్దుల్లాను విడుదల చెయ్యగానే పాకిస్తాన్ విదేశాంగమంత్రి శ్రీ భుట్టో, అధ్యక్షుడు ఫీల్డుమార్షల్ అయూబ్‌ఖాన్ అతి ఆప్యాయతతో అబ్దుల్లాను తమదేశానికి ఆహ్వానించారు. అంతకుముందు ఆయన జైలులోవున్న 11 యేండ్లలోను, అబ్దుల్లా పట్ల పాకిస్తానీయులు చూపించిన సానుభూతి అంతఇంతాకాదు. "కాశ్మీర్ పీడిత ప్రజకు" అబ్దుల్లా ఏకైక నాయకుడు అనేవారు.



షేక్ అబ్దుల్లా

అబ్దుల్లా విడుదల అయిన తరువాత ముందుగా ప్రధాని నెహ్రూను కలుసుకొనటానికి సంకల్పించటం, భారత రాజధానిలో అయన జరిపిన సమాలోచనల ధోరణి, తదనంతరం చూచాయగా తన అభిప్రాయాలను గురించి వ్యక్తంచేసిన ధోరణి, పాకిస్తాన్ ప్రభుత్వాన్ని, అందులో శ్రీ భుట్టోను కొంతవరకు నిరుత్సాహపరిచినమాట వాస్తవం.

పాకిస్తాన్ భారత దేశాల మధ్య సుహృద్భావాన్ని పెంపొందించే రాయబారిగా బయలుదేరాడు షేక్ అబ్దుల్లా. ఉభయ దేశాలలోని అల్పసంఖ్యాకుల భవిష్యత్తును భద్రపరచటానికి ఆయన ప్రయత్నం. అంతేకాదు, పాకిస్తాన్‌లోని హిందువుల స్థితిగతులను స్వయంగా పరిశీలించాలంటున్నాడు. సరిహద్దు గాంధీనికూడా కలుసుకుని రాజకీయ పరిస్థితులనుగురించి చర్చించాలంటున్నాడు – ఇదంతా అసందర్భపు జోక్యంగా అనిపిస్తోంది పాకిస్తాన్ ప్రభుత్వానికి ఈనాడు.

ఇప్పుడు ఒక్కటి మనం గమనించాలి. అబ్దుల్లాను జైలునుంచి విడుదలచెయ్యటమే అంత మంచిదికాదని మనలో చాలామంది అనుకుంటూవున్నాం. పైగా దానికితోడు ఆ అబ్దుల్లాను పాకిస్తాన్‌కు వెళ్ళటానికికూడా పండిట్ నెహ్రూ వొప్పుకోవటం, మనలో చాలామందికి చికాకుకలిగించటంకూడా వాస్తవమే.

—కాని, కొంతమంది రాజకీయ పరిశీలకులుమాత్రం షేక్ అబ్దుల్లాకు సంబంధించి జరుగుతున్న ఈ ముచ్చటంతా రాజకీయపు యెత్తుగడల్లో ఒక ముఖ్య సందర్భం అని వ్యాఖ్యానిస్తున్నారు.

కాశ్మీర్ పరిస్థితే తీసుకుందాం. బక్షి గులాం మహమ్మద్ పలుకుబడి సన్నగిల్లిపోవటం. అవినీతి విచ్చలవిడిగా ఆయన పాలనతో చెలరేగటం.బక్షి అంటే ప్రజలలో విముఖత. అపఖ్యాతి బయలుదేరినాయి. ఏమైతేనేం ఆయన తప్పుకున్నారు. కాని ఆ దేశంలో రాజకీయంగా ఒక 'వాక్యూం' యేర్పడింది. నాయకత్వం గురించినదది.

సరిగ్గా ఆ సమయంలోనే కనక భారత ప్రభుత్వం అప్రమత్తత'తో వ్యవహరించి వుండి వుండకపోతే కాశ్మీర్ అంతా తప్పుల తక్కెడ వ్యవహారం అయివుండేది.

షేక్ అబ్దుల్లా అప్పుడు జైలులో వున్నారు. ఆయనను అడ్డం పెట్టుకుని, ఆయన జైలులో వుండటాన్ని ఒక ప్రచార సాధనంగా చేసుకుని మౌలానా మసూదీ లాంటివారు భారత్ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరంగా సాగించారు.

రెండో వైపు చూస్తే భారత్‌లో కాశ్మీర్ విలీనీకరణను సమర్థిస్తున్న బక్షిలాంటి నాయకుడు ప్రజల దృష్టిలో పతనం పొందారు మరి.

సరిగ్గా ఆ తరుణంలో రెండు సంఘటనలు జరగాలి.

భారత్‌లో కాశ్మీర్ విలీనాన్ని బలపరచే నాయకత్వం కాశ్మీరులో పటుతరం కావాలి. భారత్ వ్యతిరేకవర్గాల ఆలజడిని కూడా అదే సమయంలో చాకచక్యంగా అణచి వెయ్యాలి. ఇందుకే రెండు సంఘటనలు జరగాలి.

సాదిక్‌లాంటి ప్రజాహితుడిని ప్రధానిని చెయ్యటం ఒకటి. అబ్దుల్లాను విడుదల చేసి, ఆయనమీద అభియోగాన్ని కూడా పూర్తిగా ఉపసంహరించుకుంటే - అంత వరకు "కటకటాల వెనుకనున్న అబ్దుల్లా" అన్న ప్రచారపు తురుపు మౌలానాలాంటి వారి చేతిలోంచి ఒక్కమాటు మాయమవుతుంది.

అంతకంటేకూడా ముఖ్యమైన యెత్తుగడ మరొకటివుంది -

షేక్ అబ్దుల్లాకు వాస్తవిక పరిస్థితులు ఆకళింపుకు వచ్చేటట్లు చెయ్యాలి. పూర్వాపరాలు సంపూర్తిగా ఆయన తెలుసుకోవాలి.

మరొకవైపునుంచి ప్రధాని సాదిక్ బలం పటిష్ఠం అయేందుకు త్రోవలు కల్పించాలి.

అబ్దుల్లాను దేశం నలుమూలలలోతిప్పాలి. ప్లెబిసైట్ నాయకుల మూకలమధ్యనుంచి అబ్దుల్లాను తప్పించాలి.

అబ్దుల్లాను కాశ్మీర్ రంగంనుంచి కొంత కాలం తప్పిస్తేనే ఆ రాష్ట్రంలో కొంత ప్రశాంతత. శ్రీ సాదిక్ అన్నింటినీ కూడ కట్టుకుని పటిష్ఠంకావటానికితగిన అవకాశం లభిస్తాయి. కాశ్మీర్ ప్రజల శ్రేయస్సు దృష్ట్యా. 'భారతదేశంలో కాశ్మీర్ విలీనం' అనే విషయం దృష్ట్యాకూడా. ప్రధాని సాధిక్ పాలన పటిష్ఠం కావటం యెంతో అవసరం.

అందుకే అబ్దుల్లాను ఢిల్లీ రమ్మన్నారు. పాకిస్తాన్‌కూడా వెళ్ళమన్నారు.

ఏనాటికైనా యేదో విధంగా ప్రధాని సాదిక్‌కు షేక్ అబ్దుల్లాకు మధ్య పూర్తి సమరసభావం యేర్పడటం చాలా అవసరం.

దీనికంటె ముందుగా జరగ వలసినది షేక్ అబ్దుల్లాకు ఒక విధమైన 'గీతోపదేశం' - తను. తను అనుకోవటం కొంత వరకు ఆయన చేత మాన్పించాలి. తన కంటె బలవత్తరమైన శక్తులు, వ్యక్తులు ప్రజా జీవితాన్ని దేశభవిష్యత్తునూ తీర్చి దిద్దుతున్నారనేది ఆయనకు బోధపడాలి.

దగ్గరే పక్కగావున్న పాకిస్తాన్ యెందుకింత దూరంగా పోతోంది - యెందుకింత వైషమ్యాలకు, కార్పణ్యాలకు కాలు దువ్వుతోంది అనేది ఆయనంతట ఆయన స్వయంగా గ్రహించాలి.

క్రిందటి నెలే ప్రస్తావించి నట్టు అబ్దుల్లా మతోన్మాది కాదు. నెహ్రూగారి యెఱ్ఱ గులాబీ అంటే ఆయనకు యెంతో ఇష్టం. తానూ ఆ గులాబీనే పెట్టుకుంటూ నెహ్రూ గారి లాగానే ఉన్నతంగా ఆలోచించాలనుకుంటాడు. అందుకే మొన్న అన్నాళ్ళు ఢిల్లీలో నెహ్రూగారితో ఆయన మాట్లాడిన నీకాశ్మీర్ సమస్య లాంటి చిన్న విషయాల గొడవవారు అంతగా పట్టించుకోలేదు. ప్రపంచ శాంతి. భారత ఖండాంతరంలో సౌమ్యత. భారత్ పాకిస్తాన్‌ల మధ్య విశాలమైన ప్రేమ భావం వగైరా విషయాలను హాయిగా మాట్లాడుకున్నారు.

ఇప్పుడు షేక్ అబ్దుల్లా పాకిస్తాన వెళుతున్నారు. అక్కడ ఆయనకు గాంధేయులు కనిపించరు. సరిహద్దు గాంధీతో అద్దులు అంతులు లేకుండా ఎంతవరకు మాట్లాడగలరు అనేది ఒక పెద్ద సందేహం.

ఆయనకు పాకిస్తాన్‌లో ప్రభుత్వంలో కనిపించేవారు - కరుకు బారిన. మొరటుదేలిన "భుట్టో" త్రోటో షైపులు" తప్పితే అయూబ్ ఖానులు. సంఘర్షణలోనే అభివృద్ధి అనేది వారి మతం. చైనా వారితో పొత్తు కలిపారు అందుకే.

అయితే గియితే ఎన్నికలు జరిగితే ప్రెసిడెంట్ అయూబ్‌తో పోటీ వెయ్యటానికి జిన్నా సోదరి ఫతీమాను నిలబెడుతున్నారుట అక్కడి ప్రతిపక్షంవారు.

పాకిస్తాన్ నుంచి కొందరు ముస్లింలు మన దేశానికి వలసవస్తే మళ్లీ వాళ్ళు మాకెందుకు అనేతత్వం ఆ ప్రభుత్వానిది.

అన్నేళ్ళ జైలు జీవితాన్ని అనుభవించి విడుదల అయిన గఫర్‌ఖాన్ జబ్బుచేసి ఆస్పత్రిలో పడివుంటే చుట్టూరా పద్నాలుగు మంది పోలీసులు కావలా....

ఇదీ అక్కడి వరుస.

షేక్ అబ్దుల్లా అక్కడికి వెళ్ళి ఇదంతా చూసి. తిరిగివచ్చి యేంచేస్తారనేది చూడాల్సిన విషయం.

అయినా ఒక్కటిమాత్రం యథార్థం

అబ్దుల్లా అనుకున్నట్టే భారత్ పాకిస్తాన్‌లమధ్య సుహృద్భావమే కనక పెరిగితే లేనిదేమీలేదు.



ఆంధ్రప్రదేశ్ కొత్త గవర్నరు శ్రీ పట్టం థాను పిళ్లై.

కాకపోయినా బాధలేదు. (మనకు)

షేక్ సాహెబ్‌కు మాత్రం బాధకలుగుతుంది. 'గీత' బోధపడుతుంది.

ప్రధాని నెహ్రూతో కుదిర్చిని. లేకపోతే వినోబాజీతోనైనా సరే.–"భజగోవింద" శ్లోక పఠనం తప్పకుండా చేస్తారు.

ఈలోపల మాత్రం —

కాశ్మీర్‌లో సాదిక్ నాయకత్వం సుస్థిరం కావాలి. లాల్ బహదూర్, నందాగారు వీటిల్లో యెప్పుడూ అప్రమత్తులుగానే వుంటున్నారు.

[ఇది శ్రీ నెహ్రూ నిర్యాణానికి ముందు వ్రాసినది]

● ● ●

రాష్ట్రంలో....

మొన్న 18 వ తేదీ ఉదయం విమానం దిగివచ్చిన ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి "మరికొందరు కొత్తమంత్రులను" వేస్తానని పత్రికలవాళ్ళతో అన్నారు.

మళ్ళీ తెల్లవారేసరికి ఇంచుమించు అదే ఘడియల్లో ఆదరాబాదరా పత్రికలవాళ్ళను పిలిపించి నిన్న చెప్పిన "కొత్త మంత్రులు" వార్తలో "లు" కొట్టేసుకోమన్నారు. "ప్రస్తుతానికి" ఒకటితప్ప మిగిలిందంతా ఉత్తమే అన్నారు. ఈయనొక్కడే కొత్తమంత్రి అని శ్రీ రామస్వామిగారి పేరును ప్రకటించారు.

ఇదీ వార్త—

వార్త వెనుకగా, గోడలవెనుకగా రాజకీయంగా, గుసగుసల్లో అశాంతి, ఆశాభంగం, ఆవేశం చెల్లాచెదరై చెంరేగుతున్నాయి.

—కాని అంతా "మూసిన కుండలో" గుడగుడే.

ఇద్దరు అవుదామనుకున్న, అవుతారనుకున్న, కొన్ని పత్రికల్లో అయారనికూడా అన్న "ఇద్దరు మంత్రులు" మరునాడు వీధిలోకపిపించి ఇలవంతాన నవ్వుకున్నారు.

ఏమైనా మూడు, నాలుగు నెలలతరువాత "కుండలో గుడగుడ" బయటికిరాక తప్పదని ఆ ఇద్దరు అవాల్సిన మంత్రులు గట్టిగానే అంటున్నారు.

సంజీవయ్యగారు కొత్తగా ముఖ్యమంత్రి అయినరోజుల్లో, ఇట్లాగే ఇద్దరువ్యక్తులు గాంధీభవన్ కారిడార్లలో సవాలు చేస్తే "యూనిటీఫ్రంట్" పుట్టింది. అదంతా అప్పటికథ.

కాని ఇప్పటి కథ —

సైకిలుసీటుమీద ఒక 'చిన్నవాడు' కూర్చుంటే, వెనకాలగా కారియర్‌మీద మరో 'మహానాయకుడు' కూర్చుని, పెడల్ తొక్కటం, హాండిల్ తిప్పటం, ఇవన్నీ చెయ్యటం ఆ మహానాయకుడు ప్రారంభిస్తే యెంతటివాడైనా మైనారిటీ వెళ్ళిన సీటు మీద చిన్నవాడికి మహా తిక్కరేగుతుంది.

— ఇదీ యిప్పటి యిక్కడి కథ.

కథకాని కథ, అవాలనుకున్న అయారనుకున్న ఆ యిద్దరు మంత్రులకు తీరని వ్యథ —

మూడు నెలల్లో ఈ ఇద్దరుకలిసి, మరో కొందరిని వెంబడేసుకుని, ఆ కారియర్ మీద "కంట్రోల్" చెయ్యాలనుకుంటున్న పెద్దమనిషికి పాఠం చెబుదామనుకుంటున్నారుట. సీటుమీద కూర్చున్న మైనారిటీవెళ్ళిన చిన్నవాడికి కూడా యిది యిష్టమేనట.

— 'మూతేసినకుండ'లోని గుడగుడల గూఢార్థం ఇదేట.... ◻◻◻

— అనంతం



1906 లో హారో పబ్లిక్ స్కూల్ విద్యార్థిగా నెహ్రూ.

అంతరించిన మహాశకం

మే నెల 27 వ తేదీ మధ్యాహ్నం రెండుగంటలకు భారత చరిత్రలో ఒకశకం అంతరించింది. అది 1947 ఆగస్టు 15 వ తేదీన భారత స్వాతంత్ర్య సిద్ధితో ప్రారంభమైంది. ఈ రెండు తేదీలమధ్య 17 ఏళ్ళకాలం చరిత్రలో నెహ్రూ శకంగా సువర్ణాక్షరాలతో లిఖితమవుతుంది. ఆ పదిహేడేళ్ళ కాలంలో సంఘటనలపై తన ప్రభావాన్ని, తన వ్యక్తిత్వాన్ని, తన ఆశావాదాన్ని, తన నిత్య నూతనోత్సాహాన్ని ముద్రించిన మహాపురుషుడు శ్రీ జవహర్లాల్ నెహ్రూ అస్తమించారు.

1917 నుంచి 1947 వరకు భారత రథాశ్వాల పగ్గాలను తన గుప్పిటలో పట్టుకుని నడిపించిన యుగకర్త గాంధీజీకాగా, ఆ తరువాత అవి సంక్రమించినవి నెహ్రూకే. దాదాపొక అర్ధశతాబ్దంపాటు ఈ యిద్దరు నాయకులనుతప్ప మరొకరిని భారత జాతి ఎరుగదు. వారి నిష్క్రమణ తరవాత ఏర్పడిన మహాశూన్యం మరికొన్ని తరాలవరకు పూరించరానిది.

పదిహేడేళ్ళపాటు భారత జాతి తన ఆశలను, ఆశయాలను, వర్తమానాన్ని, భవిష్యత్తును, మొత్తం తన హృదయాన్నే ప్రధాని నెహ్రూ చేతులకప్పగించి నిశ్చింత వహించింది. సామాన్య మానవులకు సహజమైన లోపాలకు, పొరపాట్లకు, బలహీనతలకు ఆయన అతీతుడని భావించింది. ఆయనచేతిలో తాను సురక్షితమని భావించింది. ఆ ఆశలను శ్రీ నెహ్రూ ఎన్నడూ వమ్ముచేయలేదు.


సామాన్యులకు సహజమైన జరామరణాలకుకూడా అతీతుడుగా ఆయనను భారతజాతి భ్రమించింది. ఆయన 70 ఏళ్ళు దాటిన వార్ధక్యంలోసైతం నిత్యయౌవనోత్సాహంతో, అపారమైన ఆశావాదంతో, విరామమెరుగని దేశసేవా పరిశ్రమతో దేశం నలుమూలలా సంచరించేవారు. ఆయన మృత్యుంజయుడని, కనీసం మరికొన్ని సంవత్సరాలపాటు దేశానికి ఆయన నేతృత్వం లభించ



1908 లో కేంబ్రిడ్జి విద్యార్థిగా నెహ్రూ.

గలదని భారతీయులు భావించారు. ఈ ఆశలనుమాత్రం నెహ్రూ అడియాసలుచేసి వెళ్ళిపోయారు.

నెహ్రూ వంటి మరొక మనీషి మనకు తిరిగి లభించకపోవడమే కాదు; ఆయన మార్గదర్శిత్వం మన కత్యవసరమైన ఘట్టంలో ఆయన గతించడమే మనకు మరింత దుస్సహమైన దుఃఖకారణం. ఎటుచూసినా ఆర్థిక, రాజకీయ సమస్యల పద్మవ్యూహం! ఈ వ్యూహాన్ని ఛేదించడానికి ఆయన జీవితంలో తుదిఘడియలవరకు



సర్దార్ పటేల్‌తో నెహ్రూ.

పోరాడారు. ఎన్నో సమస్యలు పరిష్కారమైనా, మరెన్నో సమస్యలు మనలను శాత్రవసమూహంలా చుట్టుముట్టిన విషమ సమయంలో ఆయన కురుక్షేత్రంలో అభిమన్యు కుమారుడివలె ఒరిగిపోయారు.

ఇదే అన్నిటికంటె మనకు విచారకరమైనది. అనేక సమస్యలతో ఆయన ప్రారంభించిన పోరాటం ఇంకా ప్రారంభదశలోనే వుంది. అనంతమైన దారిద్ర్యం, అజ్ఞానం, అనారోగ్యం వివిధ రూపాలలో దేశంలో తాండవిస్తుండగా, దేశం వెలుపల శత్రు నివహం కాటువేయడానికి పొంచిచూస్తుండగా, నెహ్రూ ప్రారంభించిన పోరాటాన్ని అందుకొనడానికి ఎవరు ముందుకువస్తారో తెలియదు.



కుమార్తె శ్రీమతి ఇందిర, మనుమలతో నెహ్రూ.

అయినా, మన కృషి కొనసాగక తప్పదు. నెహ్రూ ఏర్పరచిన ప్రాతిపదికలపై మన పోరాటం చివరవరకు జరగక తప్పదు. నెహ్రూ మనకిచ్చి పోయిన ప్రజాస్వామ్యం, ప్రగతి పథకాలు, కుల, మతాతీత సాంఘిక వ్యవస్థ, ఐకమత్యం, ప్రపంచ శాంతి, విశ్వమానవ వాదం – ఈ మహాదర్శాల సాఫల్యానికై మనం నిరంతర యత్నం జరుపక తప్పదు.

శ్రీ జవహర్లాల్ మన కిచ్చిపోయిన మరొక అమూల్యమైన కానుక ఆధునిక దృక్పథం. సాధారణ మత వ్యవస్థలలో ఆయనకు నమ్మకంలేదు. మానవ వాదమే ఆయన మతం. ఏ దేశం వారైనా, ఏ జాతి, ఏరంగు వారైనా మానవులందరూ సమానులేనని ఆయన విశ్వసించారు. ఆయన కలలు కన్న సుదూర లక్ష్యాలలో వసుధైక వ్యవస్థ ఒకటి.



గాంధీజీ, మౌలానా ఆజాద్‌లతో నెహ్రూ.

అంధ విశ్వాసాలకు ఆయన ప్రబల శత్రువు. మానవ సమూహం భవితవ్యం దాని చేతులలోనే వున్నదని, ఏదో అలౌకిక శక్తిపై ఆధారపడరాదని ఆయన ఉద్బోధించారు. మానవుని మనుగడకు, ప్రవర్తనకు, ప్రగతికి శాస్త్రీయ దృక్పథమే ఆధారం కావాలని, ఆ దృక్పథానికి మానవుల పరస్పర సహనం, సౌజన్యం, సౌభ్రాత్రం దోహదం చేయాలని ఆయన ఉపదేశించారు.

ఆయన ఆశయాలను, ఉపదేశాలను ఆచరణలో పెట్టడం కంటె ఆయనకు మనం ఘటించగల శ్రద్ధాంజలి మరొకటిలేదు.

సెక్రటరీ

యద్దనపూడి సులోచనారాణి

[గత సంచిక తరువాయి]

"నిన్న మిసెస్ కమలాకరం నిన్నో సారి పంపించమని అడిగింది. వెళ్లావా!" టైప్ చేసిన కాగితాలు చూస్తూ అడిగింది సుమిత్రాదేవి.

"లేదు. వెళ్ళలేదు." సమాధానం చెప్పింది జయంతి. ఈ మధ్య యేది తన డ్యూటీయో, యేది తనదికాదో తెలుస్తోంది. తన డ్యూటీ కాదని తెలిసినదానికి వెళ్ళనక్కర్లేదని మనసు చెబుతోంది. వనితా విహార్‌కి తను సెక్రటరీగావచ్చు. అందులో మెంబర్స్ అందరికీ పర్సనల్ సెక్రటరీ గాదు. ఏదో పనిమీద ఇంటికి పిలిపించటం స్వంతపనులు నెత్తిన రుద్దటం వీళ్ళ కలవాటులావుంది. కాదు అంటే, వుద్యోగానికే యెసరు పెట్టించగల సమర్థులు. అహంకారం అని, తలపొగరు అని ప్రచారం చెయ్యగల అతిరథులు. వాళ్ళు మాట్లాడే ప్రతి మాటలో, అందులో ప్రతి అక్షరంలో వాళ్ళ అధికృత వెల్లడించుకుంటూ వుంటారు. వాళ్ళసమర్థతనిగుర్తించిభయంతో వాళ్ళు చెప్పినట్టు చెయ్యాలనే అహంకారం కన్పిస్తూంటుంది. జయంతికిది చాలా అసహ్యం అన్పించసాగింది.

"ఇవాళయినా వెళ్ళు. ఎలాగూ సంతకాలు తీసుకోవాలిగా" ఆ నెలలో ప్రోగ్రాం చేతికిస్తూ సుమిత్రాదేవి వెళ్ళిపోయింది. జయంతి కుర్చీలో కూలబడిపోయింది. వెళ్ళటానికిష్టంలేదు. వెళ్ళక తప్పదు. వెళ్ళను అని చెప్పగలిగే ధైర్యంలేదు. వెళితేయెలా 'ట్రీట్' చేస్తారో గుర్తుకొచ్చిన మనసు వెళ్ళాలంటే అసహ్యించుకుంటోంది. సుమిత్రాదేవి చెప్పింతర్వాత వెళ్ళకుండా వుండటానికి వీల్లేదు. ఈ లెక్కన తనింకయెన్నిరోజులో వుద్యోగం చెయ్యలేదు. రాజశేఖరం జోస్యం త్వరలో ఫలించేటట్టే వుంది.

రాజశేఖరం గుర్తుకువచ్చేసరికి జయంతికి రోషంవచ్చింది. తనీ వుద్యోగం చెయ్యలేదని చెప్పాడు. చేసి చూపించాలని తను. ఈసారి యెప్పుడైనా కన్పిస్తే "చూశావా? నీమాట అబద్ధం. నేనీ వుద్యోగం చేస్తున్నాను" అన్నట్టు ఠీవిగా చూడాలి. ఆ

రోజు కన్పించిన రాజశేఖరం యింతవరకూ మళ్ళీ కన్పించలేదు. ఆ రాత్రి పరిచయం కొద్దిఅయినా, సంభాషణ చాలా క్లుప్తం అయినా ప్రతి నిమిషం అతను చెప్పిన ప్రతి మాటా జయంతికి క్షుణ్ణంగాగుర్తుంది. వెన్నెట్లో నిగనిగలాడే కారు, తనవెనక నిలబడిన అతని పొడుగాటి విగ్రహం, కుర్చీలో వెనక్కు వాలి నిద్రపోతుంటే లేపబోతే తను అతని చేతిని పట్టుకోవటం, ఆ స్పర్శ, అన్నీ గుర్తున్నాయి. రాజశేఖరం గుర్తుకొస్తేనే అదోలా అన్పిస్తుంది.

ఆరోజు పనిపూర్తి చేసుకున్న తర్వాత సాయంత్రం జయంతి మిసెస్ కరుణాకరం యింటికి వెళ్ళింది. కరుణాకరం హైద్రాబాద్‌లో లీడింగ్‌లాయర్. ఆంధ్రప్రదేశ్ రాకముందే చాలారోజులక్రితం అతను హైద్రాబాద్‌వచ్చి స్థిరపడిపోయాడు. సంపాదన బాగావుంది. దానికి తోడు పిల్లలులేరు. భార్యాభర్తలు ఖర్చుంటేఆసలు గిట్టే మనస్తత్వంకాని వాళ్ళు అవటంవల్ల ఆర్జించినధనం ఆర్జించినట్టేవుండిపోయింది.

గేటుదాటి లోపల ఆవరణలో అడుగు పెట్టినప్పటినుంచి ఐశ్వర్య చిహ్నాలు కన్పిస్తాయి. పెద్దయిల్లు. ఇంటిముందుతోట. జయంతి వెళ్ళేసరికి మిసెస్ కరుణాకరం యింట్లోనేవుంది. జయంతిని వాకిట్లో వరాండాలోవున్న కుర్చీలో కూర్చోపెట్టి నౌకరు లోపలికి వెళ్ళాడు. అయిదునిమిషాలు అయింతర్వాత తిరిగివచ్చి అమ్మగారు స్నానం చేస్తున్నారని కూర్చోమని చెప్పాడు. కాగితంమీద కాస్త సంతకం కోసం యింతసేపు పడిగాపులు. ఆంధ్ర వనితా విహార్ సెక్రటరీగా పెద్ద పెద్ద వాళ్ళతో పరిచయం యెలావున్నా, మనుష్యుల్లో యెంత దర్పంవుంటుందో. యెదుటి వాళ్ళని యెంత చిన్న చూపు చూడగలరో అర్థమైంది. వాకిట్లో వరండాలో కూర్చున్న జయంతికి. తనకికూడా యిలాంటి పెద్దయిల్లు, యింటినిండా నౌకర్లు, యెందుకుండగూడదు అన్పించింది. ఉంటే అప్పుడు తనెలా వుండేదో! చస్తేయిలావుండేదిగాదు. ఉండదు. వ్యక్తులకి హోదానుబట్టి సంస్కారంరాదు. అది రక్తంలో వుండాలి.

అయినా, ప్రపంచంలోమనుష్యులు యిలా ఒకళ్ళకెక్కువ తక్కువ యెందుకుంటారు? అసలు యీమధ్య తరచు తన ఆలోచనలు యిలాగే పోతున్నాయి. అడుగడుక్కి తనలో వున్న అర్హతలు మర్చిపోయి లేనిహోదాలు గుర్తొస్తున్నాయి. మానసికంగా యిలాటి ఆలోచన్లు అంత ఆరోగ్యంకావు అని గుర్తువచ్చిన జయంతి నిశ్శబ్దంగా పూల మొక్కలవైపు చూస్తూ కూర్చుండిపోయింది ఇంతలో నౌకరువచ్చి లోపలకు రమ్మనమని దారి చూపించాడు. మిసెస్ కరుణాకరంయిల్లు తనకు తెలియందిగాదు. ఇంతకు ముందు నాలుగైదుసార్లు వచ్చింది. అయినా ప్రతిసారి నౌకరు దారిచూపిస్తూ లోపలికి తీసుకు వెడతాడు" సరిగ్గా ఒక్కయింగ్లీషు ముక్కకూడా నోటవతకలేని మిసెస్‌కరుణాకరానికి ఈ ఆడంబరాలమీద యెంత అభిమానం?

జయంతి లోపలికెళ్ళేసరికి మిసెస్ కరుణాకరం కాఫీ తాగుతోంది. ప్రక్కన ఆవిడ మేనకోడలు ప్రమీల కూర్చునివుంది. ప్రమీల వళ్ళో పెద్ద బొమ్మలపుస్తకం వుంది. ఓచెయ్యిప్రక్కనే సోఫాలోవున్న

తెల్లటి బొచ్చుకుక్కమీదవుంది. లోపలికి వచ్చిన జయంతిని ముఖంమీద అడ్డంగా కావాలనివదేసుకున్న వెంట్రుకల్లోంచి అలా ఒకసారి తలెత్తిచూసి మళ్ళీ పుస్తకం చూడటంలో మునిగిపోయింది. ఆచూపుల్లో యెంత నిర్లక్ష్యం? జయంతికి తనకి తనే అల్పురాలనిపించింది.

"నిన్నరమ్మని ఫోన్‌చేస్తే రాలేదేం?" జయంతి యిచ్చిన కాగితం తీసుకుని సంతకం పెడుతూ అంది మిసెస్ కరుణాకరం.

"వీలుకాలేదు."

"వీలుకాలేదు అంటేయెలా? మీలాటి వాళ్ళకి వీలుకాదంటే...." ఆవిడ నవ్వింది. నవ్వుగాదది, హేళన, వెక్కిరింత.

నిలబడేవున్న జయంతి సంతకంచేసి యిచ్చిన కాగితాన్ని తీసుకుని మడిచి బాగ్‌లో పెట్టుకుంది. సభ్యతకన్నా ఆవిడ కూర్చోమనలేదు. అంటే, ఆవిడెదుట తనకి కూర్చునే అర్హతలేదనా? ఈకాస్త సంతకం కోసం తను యిన్నిగంటలు వృధాచేసుకోవాలి - తనకిహ యేం పనిలేనట్టు.

బైటకొచ్చేసిన జయంతికి బుగ్గల్లోకి వెచ్చటి ఆవిరి వచ్చింది. ఏం మనుషులు! ఏం ఉద్యోగం! నిమిష నిమిషానికి తనెంత అల్పురాలో గుర్తు చెయ్యబడుతోంది. మిగతా వుద్యోగాల్లో యీబాధలేదు. తనెంత మోసపోయింది! దూరంగా యెక్కడో మినుకు మినుకుమంటున్న లైట్లుచూసి నక్షత్రాలని పరుగెత్తుకొచ్చింది. తీరా దగ్గరకి వచ్చింతర్వాత తెలిసింది అవి ఆకాశంలో నక్షత్రాలుగాదని భూమ్మీద లైట్లేనని. ఉదయం పది గంటలకి చేసిన భోజనం. మళ్ళీ కాఫీ గూడాలేదు. ఈనెల ప్రధాని ఫండ్‌కి విరాళాలు పోగుచెయ్యాలి. ఇదివరకు తనలో వుండే హుషారు క్రమంగా హారతికర్పూరంలా హరించిపోతోంది అనడానికి వుసూరుమంటున్న యీ మనసే సాక్ష్యం.

గంటన్నరసేపు కాళ్ళు పీక్కుపోయేలా నిలబడితేగాని జయంతికి యింటికెళ్ళేందుకు బస్సు దొరకలేదు.

• • •

ఆరోజు జయంతి పని త్వరత్వరగా ముగించుకుని యింటికి బైలుదేరింది. రాత్రి బొమ్మకి మళ్ళీ గుండెదడ వచ్చింది. ఉదయంగూడా అలాగే నీరసంగావుంది. గబగబా అన్నీ సర్దేసి హడావుడిగా యింటికి బైలుదేరేముందు మిసెస్ వర్మ గుర్తుకొచ్చింది. ఆవిడదగ్గర సంతకం తీసుకోలేదు. సాధారణంగా ఆవిడే వనితావిహార్‌కి వస్తుంది. ఆవిడేదో పనిమీద మద్రాసు వెళ్ళాల్సివచ్చేట్టుందిట. వచ్చి సంతకం చేయించుకెళ్ళమని ఫోన్ చేసింది. ఇలా యిళ్ళకి వెళ్ళాలంటేనే వంట్లో రక్తం నీళ్ళుగా మారుతోంది. అయినా తప్పదు. అవసరం అయితే మెంబర్ల యింటికి వెడతానని, దానికి తన అభ్యంతరం లేదని తను రాసియిచ్చింది. బైటకొచ్చిన జయంతి మిసెస్ వర్మయింటి ముఖం పట్టింది మహానగరాల్లో యిదో గొడవ. ఉత్తరానొకళ్ళు దక్షిణానొకళ్ళు.

అందరిలోకి కఠినంగా, పొగరుగా కన్పించినా మిసెస్ వర్మే కాస్తనయం. సాధారణంగా ఇంటికి రమ్మనమని అడగదు. ఒకవేళ వచ్చినా సాదరంగా ఆహ్వానించి

కూర్చోమని వెంటనే పని పూర్తిచేసి పంపి స్తుంది. వెళ్ళింది యెలాటి సమయమైనా సరే కాఫీగాని. టిఫిన్‌గాని యివ్వకుండా పంపదు.

మిసెస్‌వర్మ వున్నయిల్లు కట్టుకున్నది కూడా కాదు. హౌసింగ్ బోర్డుతో వాయిదాల పద్ధతిమీద తీర్చేట్టు అప్పుతీసుకుని కొన్న యిల్లు. చిన్నదైనా అందంగా పొందికగా వుంటుంది. భర్తగూడా యేదో ఆఫీసులో మేనేజర్‌గా చేస్తున్నాడు. ఇంత సామాన్యంగా కన్పించే మిసెస్ వర్మకి రేఖారాణి లాటి వాళ్ళని సూటిగా మొహంమీద మాటలు విసిరెయ్యగల ధైర్యం యెక్కడిదో! బహుశా మంత్రిగారి భార్యకి చుట్టం అవటంవల్ల గావచ్చు. జయంతిమనసు అదే నిజం అనిచెప్పింది.

జయంతి వెళ్ళేసరికి మిసెస్ వర్మ యింట్లోలేదు. ముందుగదిలో యెదురైన మిస్టర్ వర్మ జయంతినిచూసి ఇంతమొహం చేసుకుని. అతి మర్యాద వుట్టిపడుతున్న స్వరంతో "రండి రండి" అంటూ లోపలికి పిల్చాడు.

మిస్టర్ వర్మని చూడటం జయంతికిది మొదటిసారిగాదు. ఇదివరకు రెండు మూడుసార్లు చూసింది. చాలా నమ్రతగా మాట్లాడతాడు. ఎదుటవాళ్ళకి గౌరవం యిస్తాడు. నలభైయేళ్ళు పైబడిన మనిషి. నడినెత్తిమీద. నుదుటిమీద జుట్టు వూడిపోయి బట్టతల అయిపోయింది.

"ఇప్పుడే వస్తుందిలెండి. బజారుకి పనుందని వెళ్ళింది."

"మద్రాసు వెళుతున్నానని చెప్పారు."

"లేదు. క్యాన్సిలయింది. వెళ్ళటంలేదు."

"అయితే రేపు వస్తాను." జయంతిలేవబోయింది.

"నో. నో. కాఫీ తీసుకుని వెడుదురు గాని ఈ లోపల ఆమె వచ్చెయ్యొచ్చు."

జయంతి మళ్ళీ కుర్చీలో కూలబడింది. మిస్టర్ వర్మ ఒకసారి లోపలకి వెళ్ళి తిరిగి వచ్చాడు.

"ఈ మధ్య ఢిల్లీనుంచి నేను ఒక పెయింటింగ్ తీసుకొచ్చాను. చూస్తారా? ఆర్టంటే మీకు యిష్టమేనా?" వర్మ అడిగాడు.


జయంతి ఏం చెప్పాలో తోచక యిష్టమే నన్నట్టు తలూపేసింది.

"రండి. చాలా బాగుంది. బెడ్‌రూమ్‌లో పెట్టించాం." ఇష్టంలేకపోయినా మర్యాద కోసం తిరస్కరించలేక లోపలికి వెళ్ళింది జయంతి. గదిలో గోడకు తగిలించి వుంది ఆచిత్రం. నదినీళ్ళమీద సూర్యాస్తమయం. నదిలో పడవ పెయింటింగ్ చాలాబాగుంది. "అదుగో కాఫీ వచ్చింది. ఏయ్ రామూ! ఇక్కడికి తీసుకురా" జయంతి వెనక నిలబడ్డ వర్మ కేకవేసి పిలిచాడు.

"కూర్చోండి. కాఫీ తాగుదురుగాని."

"ఇక్కడా?" జయంతి చుట్టూచూస్తూ అంది. మిసెస్ వర్మ యింట్లోలేదు. వర్మ మర్యాదస్తుడే కావచ్చు. తనమనసు మంచిదే కావచ్చు. కాని యిలా పడగ్గదిలో కూర్చుని కాఫీ తాగటం అనేది జయంతి కెందుకో నచ్చలేదు.

"కూర్చోండి" మంచం ప్రక్కగా వున్న కుర్చీ చూపిస్తూ అన్నాడు.



"థ్యాంక్స్" జయంతి కూర్చోకుండానే వర్మ అందిచ్చిన కప్పు తీసుకుంది.

"ఇదుగో రామూ!" క్షణంసేపు యేదో ఆలోచించిన వర్మ కేకవేసి పిలిచాడు. నౌకరుకాబోలు. 18 సంవత్సరాల కుర్రాడు- ఇందాక కాఫీతెచ్చిన అతను వచ్చాడు.

"వెళ్ళి రెండు పాన్‌లు తీసుకురా!" జేబులోంచి డబ్బులు తీసియిచ్చాడు వర్మ.

"వద్దండీ. వద్దు వద్దు." కాఫీతాగుతున్న జయంతి తాగటం ఆపేసి వారించింది.

"ఫర్వాలేదు. నా కెలాగూ సిగరెట్‌లు కూడా కావాలి వెళ్ళు. ఒక సిగరెట్ పాకెట్‌గూడా తీసుకురా."

రాము కళ్ళెత్తి యెటూ చూడకుండానే డబ్బులుతీసుకుని వెళ్ళిపోయాడు. ఇల్లంతా నిశ్శబ్దంగావుంది. వర్మ రామూ వెనకాలే యెందుకో బైటకివెళ్ళి మళ్ళీ లోపలికి వచ్చాడు.

"నేను వెడ్తానండి. మళ్ళీ రేపువస్తాను." జయంతి లేచి నిలబడింది.

"కూర్చోండి పర్వాలేదు. ఏమిటంత తొందర? ఏదీ యీ బ్యాగ్‌యెంతయింది?" జయంతి దగ్గరగా వచ్చిచేతుల్లోంచి బ్యాగ్ తీసుకుంటూ అన్నాడు. జయంతి వులిక్కిపడింది. తలెత్తి చూసింది. అతను పర్సు చూడటంలేదు. జయంతివైపు చూస్తూ నవ్వుతున్నాడు. గుండెల్ని యెవరో యినప పిడికిలితో నొక్కినట్టు అన్పించింది జయంతికి.

"అలా ఖంగారుపడటందేనికి? భయమా?" వర్మచేతులు బ్యాగ్‌ని ప్రక్క కుర్చీలో పడేసి జయంతి భుజాలమీద పడినాయి. క్షణంసేపు జయంతి వంట్లో రక్తమంతులా గడ్డ కట్టినట్టయిపోయింది.

"నీమనసులో యేముందో నీకళ్ళలో ప్రతిఫలిస్తుంది. ఆ కళ్ళంటే నా కెంతో యిష్టం -" జయంతి బుగ్గల్ని రాస్తూ వాటి నునుపుని అనుభూతి పొందుతూ "వాటిని - వాటిని -" అంటూ ముందుకు వంగాడు. అంతేవర్మ చెంప చెడీలుమంది. జయంతి కళ్ళు యెర్రబడ్డాయి. అనుకోకుండా లభించిన యీ తిరస్కారానికి వర్మ తెల్లబోయాడు. ఆ వెంటనే నవ్వేస్తూ యింకో చెంప చూపించి.

"ఏదీ - యిటుగూడా -" అన్నాడు.

"వదులు" విదిలించుకుంటూ అంది జయంతి.

"వూరికే యెలా వదులుతాను? ఇంత మంచి అవకాశం నాకు మళ్ళీ దొరకాలంటే ఎప్పుడో -" బలవంతంగా జయంతిని దగ్గరకు లాక్కోబోతూ అంటుండగానే. "వదులు. వదులు. అరుస్తాను లేకపోతే." అంది జయంతి.

"నీయిష్టం వచ్చినంత బిగ్గరగా అరువు. అభ్యంతరంలేదు. రాము యిప్పుడు రాడు. వీధి తలుపువేసే వచ్చాను." వర్మచేతులకి మరింత బలంవచ్చింది.

"వదులు. వదలకపోయావంటే చంపేస్తాను." బలంగావిదిలించుకుంటున్న జయంతి హఠాత్తుగా వంగి వర్మ చేతిని గట్టిగా బలం అంతా వుపయోగించి కొరికింది.

"అబ్బా. రాక్షసి!" వర్మ జయంతిని వదిలేసి చేతిని చూసుకున్నాడు.

"మర్యాదగా తలుపు తెరు." జయంతికి తనే క్షణంలో నైనా ప్రవ్రహతప్పి పడిపో వచ్చుననిపించింది. కాని ఒంట్లో ప్రతి నరంలోని శక్తిని కూడగట్టుకుని నిగ్రహించు కుంది.

"తెరవను. నీలాటివాళ్ళని లొంగతీసు కోవటం నాకు సరదా" జయంతివైపు అడుగువేస్తూ అన్నాడు వర్మ.

జయంతి కదిలి మంచానికటువైపు వెళ్ళింది. ఇంతలో యెవరో వీధితలుపు తట్టారు. నౌకరు వచ్చివుంటాడు. జయంతి కళ్ళుమూసుకుని మనసులో "భగవంతుడా. రక్షించు" అనుకుంది.

"వెధవ! ఇప్పుడప్పుడే రావద్దన్నా వచ్చాడు. అయినా నిన్ను వదలను. ఒక్క సారయినా-" జయంతివైపు అడుగువేస్తూ అన్నాడు. వర్మ దగ్గరకొచ్చేస్తున్నాడు. అవతల వెళ్ళటానికి వీల్లేదు. గోడ అడ్డు వచ్చేసింది. జయంతి గోడనానుకుని నిలబడి పోయింది. "ఒక్కసారిమర్యాదగా-" వర్మ దగ్గరకు రాబోయాడు.

వీధి తలుపు యింకోసారి విన్పించింది.

బలం అంతా కూడగట్టుకున్న జయంతి వర్మని తప్పించుకుని ఎలా బైటకు పారి పోయి తలుపు తీయాలా అని ఆలో చిస్తోంది. "యెవరూ! రామూ!" బైటనుంచి మిసెస్ వర్మగొంతు విసుగ్గా తలుపు శబ్దంతో విన్పించింది.

ఇద్దరూ వులిక్కి పడ్డారు. జయంతి రెప్పవాల్చకుండా గోడకి అంటుకుపోయి వర్మవైపు చూస్తోంది. జయంతివైపు ఒక సారి చూసిన వర్మ ఏమనుకున్నాడో ఏమో వెనక్కితిరిగి వెళ్ళబోయి గుమ్మం దగ్గిర ఆగి రెండడుగులు మళ్ళీ జయంతి వైపువేసి "నా దృష్టిలో పడ్డ ఏ ఆడదీ యింతవరకూ తప్పించుకుపోలేదు. నువ్వు అతీతురాలివేంగాదు. అలా నిలబడకు. వచ్చి కుర్చీలో కూర్చో-" అంటూ వెళ్ళి పోయాడు. ఈ లోపల తలుపు మరీ గట్టిగా రెండుసార్లు మోగింది. జయంతితూలుతూ వచ్చి కుర్చీలో కూలబడింది.

థ్యాంక్‌గాడ్! మిసెస్ వర్మ దేవుడిలా వచ్చి కాపాడింది. లేకపోతే యివాళ తన గతేమయ్యేది?

"మీరుండేనా, పలకండి! రాము ఎక్క డికి పోయాడు." మిసెస్ వర్మ లోపలికి వస్తూ అంది.

అడుగుల చప్పుడు దగ్గిరపడుతూనే జయంతి లేచి నిలబడింది.

"నువ్వా!" రెండుచేతుల్నిండా పాకె ట్లతో వచ్చిన మిసెస్ వర్మ గుమ్మంలో ఆగిపోతూ అంది.

మిసెస్ వర్మ వంటరిగా రాలేదు. వెంట మిసెస్ కరుణాకరంగూడావుంది. ఇద్దరూ కళ్ళువెడల్పు చేసుకుని జయంతిని వింత మృగాన్ని చూసినట్టు చూశారు.

"నేను - నేను --" జయంతి యేదో చెప్పాలని ప్రయత్నం చేసింది. కాని అంత కంటే యెక్కువ పెగల్లేదు.

కరుణాకరం. మిసెస్ వర్మ యిద్దరూ మొహాలు చూసుకున్నారు.

"నేను. నేను-సంతకంకోసం వచ్చాను. యేం ...యేం కాలేదు. మీరు పొరబడుతు న్నారు" జయంతి హఠాత్తుగా కుర్చీలో కూలబడి రెండుచేతుల్తోనూ మొహం దాచుకుని వెక్కివెక్కి యేడవసాగింది.



"రాము! రాము!" గదిలోనుంచి వెళ్ళిపోయిన మిసెస్ వర్మ కోపంగా పిల్చింది. "రాములేడు. సిగరెట్లకోసం వెళ్ళాడు. ఇదుగో తలుపువేసుకో. నాకు పనుంది వెళుతున్నాను." వర్మ కంఠం, దానితోపాటు గబగబా చెప్పులచప్పుడు వినిపించింది జయంతికి.

ఎలాగో శక్తితెచ్చుకుని యేడుపు నిగ్రహించుకుంది జయంతి. చాలాసేపయిం తర్వాత మిసెస్ వర్మ లోపలికివచ్చింది. మిసెస్ వర్మని చూస్తూనే లేచి నిలబడిన జయంతి బాగ్‌లో కాగితాలుతీస్తూ యెర్రబడిన కళ్ళతో.

"నా తప్పేంలేదు-ఆయన-ఆయన-"

"నువ్వు నాకేం చెప్పక్కర్లేదు. వెళ్ళు. రేపు కమిటీలో నేను తేల్చుకోగలను." కాగితాలు సంతకంచేసి యిచ్చేస్తూ అంది.

"అంటే?"

"అంటే ఏమిటో నీకే తెలుస్తుంది" విసురుగా అంది మిసెస్ వర్మ.

జయంతి ఆ ఇంట్లోంచి బైటకెలావచ్చిందో, బస్సుకోసం యెలా నిలబడిందో, యెలా యెక్కిందో, యెలా యింటికి చేరిందో యేమీ తెలియదు. ఇంటికి వస్తూనే మంచం మీద కుప్పలా కూలబడిపోయింది. భగవాన్! ఇవాళ తను లేచి యెవరిమొహం చూసిందో! చెయ్యని తప్పుకిశిక్ష! వెంట్రుకవాసిలో ప్రమాదాన్ని తప్పించుకుంది. జయంతికి హఠాత్తుగా గుర్తుకు వచ్చింది. ఉదయంనుంచి గుర్తుచేసుకుంటున్న బత్తాయిలు బామ్మకోసం తను తీసుకురాలేదని. ఏం రోజు! ఏం మనుష్యులు! ఆడపిల్ల ఇల్లు విడిచి బైటకొస్తే యిన్ని ఆపదలా! ప్రపంచంలో యిలాటి విషసర్పాల్లాటి సంఘటనలు సందు దొరికితే చాలు, కాటువేద్దామని చూస్తుంటాయి కాబోలు. రేపు యెవరికీ యే అవకాశం యివ్వకుండానే తను రిజైన్ చేసేస్తే? జరిగింది. వూహించింది నిజమే అనుకుంటారు. అలాకాదు. నిర్భయంగా నిలబడి వర్మ సంగతంతా చెప్పాలి. కాని వినేదెవ్వరు! వినసీ వినకపోనీ-చెప్పి రావటం తన ధర్మం.

"నా దృష్టిలో పడిన ఏ ఆడదీ యింతవరకూ తప్పించుకోలేదు.''

"జయంతి వెన్నెముకమీద భయంలాటిది జరజర పాకింది. అలాటి మనిషి దృష్టిలో తను పడింది అంటే యిహ తను బైట వంటరిగా తిరగటం క్షేమంకాదు. అయినా యిదేమిటి? వనితా విహార్ సెక్రటరీగా తనూహించింది యేమిటి? ఈ జరుగుతున్నదేమిటి?

జయంతి ఆరాత్రి నిద్రపోలేదు.

• • •

ఆ మర్నాడు జయంతి ఒంట్లో బాగా లేదని రెండు రోజులు సెలవు యిమ్మని కబురు చేసింది. ఏ కళనుందో సుమిత్రాదేవి వెంటనే ఒప్పుకుంది. జయంతి రెండు రోజులు దాటిన తర్వాత వనితావిహార్‌కి వచ్చింది. జయంతి భయపడ్డట్టు యెవరూ యేవిషయం కదపలేదు. మిసెస్ వర్మ రెండురోజుల తర్వాత వచ్చింది. ఆవిడ చూస్తూనే జయంతి వణికిపోయింది. కాని ఏంజరగలేదు. మిసెస్‌వర్మ జయంతితో యిదివరకులా మాట్లాడలేదు. అంతే.

వారంరోజులు గడిచి పోయినాయి. జయంతి మామూలుగా వచ్చి పని చూసుకుపోతోంది. ఓ రోజు మధ్యాహ్నం ఆనెలలో అయిపోయిన ప్రోగ్రాం తాలుకు వివరాలు టైప్ చేస్తుండగా ఫోన్ గణగణా మోగింది. టైప్‌చేస్తున్న కాగితాలు వదిలేసి విసుక్కుంటూ జయంతి రిసీవర్ తీసుకుంది.

"హలో!"

"హలో" అవతలనుంచి మగవాళ్ళ కంఠం విన్పించింది.

"యెవరు?"

"యెవరు మాట్లాడేది?"

"జయంతిని. సెక్రటరీ-"

"జయంతీ-నువ్వేనా! నేను వర్మని. నీతో మాట్లాడాలని నాలుగురోజులునుంచి ప్రయత్నంచేస్తున్నాను."

జయంతి రిసీవర్ పెట్టేద్దామనుకుంది.

"హల్లో! జయంతీ-నన్ను క్షమించు. క్షమించవూ! తొందరపడ్డాను. నా వైఫ్ అక్కడేం గొడవచెయ్యలేదుగదా! చెయ్యొద్దని వార్నింగ్ యిచ్చాన్లే."

అదన్నమాట మిసెస్ వర్మ మౌనానికి కారణం.

"ఇప్పుడు నా వైఫ్ యేమీ అనదులే. అప్పుడే చెబుదునుగాని, ప్రక్కన ఆ తాటకి వుంది. ఆవిడని చూసేసరికి భయంవేసి బయటకు పారిపోయాను. చూడు నా వైఫ్ నిన్ను మా యింటికి పిలుస్తుంది. నామీద కోపం వుంచుకోక తప్పకుండా రా! యేం?"

కోపంతో జయంతి పళ్ళు పటపట లాడాయి.

"పోనీ నీకు మా యింటికి రావటం అభ్యంతరం అయితే-నేనే-యెక్కడికైనా"

జయంతి రిసీవర్‌ని రపీమని పెట్టేసింది. ఎంత ధైర్యం. నలభై సంవత్సరాలుదాటి, చరమాంకంలో కాలుపెట్టటానికి తయారవుతున్న మనిషి. మెత్తగా మాట్లాడి మాటల్ని మర్యాదతో సంపేమనిషి. ఛీ! జయంతికి అసహ్యంవేసింది. ఈ మగవాళ్ళకి బొత్తిగా బుద్ధిలేనట్టుంది. ఆయన దృష్టికి తను నచ్చచ్చు కాని తన దృష్టిలో ఆయనకెలాటి స్థానం వుందో ఆలోచించడేం? ఆయనొక్కడే యింతా? లేక మగవాళ్ళంతా యింతేనా? టైప్ చెయ్యటం వదిలేసి బుగ్గన చెయ్యిపెట్టుకుని ఆలోచిస్తూ కూర్చుండిపోయింది జయంతి. అంత పొగరుగావుండే మిసెస్ వర్మ యీ విషయంలో భర్తనెలా లొంగి వూరుకుందో జయంతి కర్థంగాలేదు.

ఆలోచిస్తూ బొమ్మలా కూర్చుండిపోయిన జయంతి దగ్గరకి సుమిత్రాదేవి "యేంచేస్తున్నావు?" అంటూ వచ్చింది.

● డబ్బుకోసం తాపత్రయపడితే డబ్బు పిచ్చి అంటారు. డబ్బు దాచుకుంటే పిసినిగొట్టు అంటారు. ఖర్చుచేస్తేదుబారాగాడంటారు ప్రయత్నించకపోతే ముందుచూపు లేనివాడంటారు. తిని కూర్చుని సంపాదిసుంటే సుడిగాడంటారు. రాత్రింబగళ్లు కష్టపడి సంపాదించుకుంటే జీవితాన్ని అనుభవించడం తెలియని మూర్ఖుడంటారు.

కావున నోదేవా : డబ్బున్నా లేకపోయినా చిక్కే.

సుమిత్రాదేవిని చూడగానే జయంతి ఫులిక్కిపడి టకటక టైప్‌చెయ్యసాగింది. ఆవిడ దగ్గరకొచ్చి టేబిల్ మీద ఆకాగితాలు ఈకాగితాలు తిరగేస్తూ "అమ్మాయి! కొంచెంసేపు నీతో మాట్లాడాలి. ఆ శబ్దం కొంచెం ఆపు" అంది. జయంతి చేతులకు చిరుచెమటలుపోశాయి. గుండె కొట్టుకోసాగింది. మెల్లగా టైప్‌చెయ్యటం ఆపింది. కాని కళ్ళుమటుకు కాగితాలమీదనుంచి యెత్తలేదు. ఎత్తే ధైర్యంలేదు. చెవులు అప్పగించి సుమిత్రాదేవి నోటినుంచి రాబోయే బాణాలకోసం యెదురుచూడసాగింది.

"చూడు జయంతీ. మొన్న నీకు పరిచయంచేశానే! మా పిన్నికొడుకు ప్రకాశం!"

జయంతికి వూపిరివచ్చింది. మూడు రోజులక్రితం-నల్లగాపొడుగ్గా దుబ్బులావున్న వుంగరాలజుట్టుతో, నల్లటి కళ్ళద్దాలతో, చిన్నపిల్లలు హఠాత్తుగా చూస్తే బూచాడు అనే జడుసుకునే మనిషిని 'మా పిన్ని కొడుకు ప్రకాశం' అంటూ సుమిత్రాదేవి పరిచయం చేసింది. ఆ ప్రకాశానికి తనతో పనేమిటో జయంతి అనుకునేలోపలే సుమిత్రాదేవి చెప్పింది. "వాడికి పెళ్ళికాలేదు. నిన్ను చూస్తూనే నువ్వంటే చాలా యిష్టపడ్డాడు. సెంట్రల్‌గవర్నమెంట్‌లో మంచి వుద్యోగం చేసుకుంటున్నాడు. నెలకి 500 తెచ్చుకుంటున్నాడు."

జయంతి కాగితాలు, టైప్‌రైటర్ అన్నీ వదిలేసి కళ్ళు వెడల్పుచేసుకుని సుమిత్రాదేవివైపు పూర్తిగా తిరిగి వినసాగింది.

"కట్నం యేమీ అక్కర్లేదన్నాడు."

"అయితే-" ఒకవిధంగా వచ్చిన మతి యింకోవిధంగా పోయింది.

"ఓసారి మీ బామ్మదగ్గరకి నన్ను, మా ప్రకాశాన్ని తీసుకువెడితే అన్నీ మాట్లాడి. ముహూర్తం నిర్ణయించుకోవచ్చు-" టేబిల్ మీద కాగితాలు బొత్తిగా పెడుతూ అంది.

జయంతికి చాలాసేపటివరకూ నోట మాటరాలేదు. ఇవన్నీ వనితా విహార్ సెక్రటరీగా యెదుర్కోవలసిన సమస్యలా ఏమిటి?

"బంగారంలాటి సంబంధం. అసలు వాడికే పిల్లా ఓపట్టాన నచ్చదు. నువు నచ్చావు అని చెప్పగానే నువ్వు అదృష్టవతురాలివి అని అప్పుడే అనుకున్నాను."

"కాని-కాని-" జయంతి నసిగింది.

"కానీ అంటే!"

"అసలు నా కిప్పుడు పెళ్ళిచేసుకోవాలని లేదండీ."

"అది మీ బామ్మ నిర్ణయించవలసిన విషయం."

"ఇంతవరకూ బామ్మది. నాది ఒకటే అభిప్రాయం."

"పోనీ! నీయిష్టం. ఆలోచించుకో అంతేలే. ఏదయినా కోరిదగ్గరకివస్తే విలువ తెలియదు. కాని యీసంగతి మీ బామ్మనడిగి చెబితే బాగుంటుంది."

"అలాగే-కాని బామ్మకూడాయిలాగే...."

"సరే. నే వస్తాను." సుమిత్రాదేవి యేదో గుర్తొచ్చినదానిలా లేచి వెళ్ళిపోయింది.

జయంతికి యేడవాలో నవ్వాలో తెలియలేదు.

మరో రెండురోజులు గడిచిపోయినాయి. ఆరోజు టైప్ చెయ్యాల్సినవి, సమాధానాలు వ్రాయాల్సినవి వుత్తరాలు చాలావున్నాయి. జయంతి కూర్చుని పని చేస్తుండగానే-యిట్టే సాయంత్రం అయిపోయింది. ఈరోజు ఉదయంనుంచి బామ్మ మళ్ళీ అదోలా వుంది. డాక్టర్నడిగితే పూర్తిగా రెస్ట్ కావాలంటాడు. బలానికిమందులివ్వాలి అంటాడు. గుండెనొప్పి తరచుగా వస్తోంది. ఈ రోజు తను త్వరగా వచ్చేసి పని చూసుకుంటానని-మంచంమీదనుంచి కదలద్దని గట్టిగా చెప్పొచ్చింది. జయంతి త్వరత్వరగా వెళ్ళిపోవటానికి సిద్ధపడుతోంది. ఇంతలో సుమిత్రాదేవి గదిలోకి వచ్చింది. ఆవిడ మొహం మొన్నటినుంచి వాళ్ళ ప్రకాశాన్ని కాదన్నప్పటినుంచి జయంతిని చూస్తూనే చిటపటలాడుతోంది.

"ఇదిగో అమ్మాయి. మిసెస్ వర్మ ఫోన్ చేసింది. సాయంత్రం వెళ్ళరా" అంది.

కాగితాలు బొత్తిగా పెట్టటానికి వంగిన జయంతి లేచి నిటారుగా నిలబడ్తూ "నేనా?" అంది.

"నువ్వే! లేకపోతే నేను వెడతానా?"

"నేను వెళ్ళను. "వెంటనే చెప్పేసింది జయంతి.

"అదేం?" అంటే?"

"అంటే ఏంలేదు. యికనుంచి నే నలా ఎవరిళ్ళకి వెళ్ళనండి."

"ఇదీ కొత్తవిషయమే! మొదట్లోనే చెప్పాంగా. అయినా వెడుతూనే మళ్ళీ యిదేమిటి?" గుమ్మంలో ఆగి వెనక్కి తిరిగిచూస్తూ అంది.

"దానివల్ల చాలా బాధలున్నాయండీ." సుమిత్రాదేవితో విసురుగా మాట్లాడి పోట్లాడటం జయంతి కేమాత్రం యిష్టం లేదు.

"బాధలంటే?" జయంతిని నఖశిఖపర్యంతం చూస్తూఅంది.

జయంతి మాట్లాడలేదు.

"మనబళ్ళు మనం దగ్గరుంచుకుంటేసరి. అయినా అవన్నీ నాకు తెలియవు. నువ్వు వెళ్ళాల్సిందే. వెళ్ళితీరాలి."

"లేకపోతే?" కోపాన్ని నిగ్రహించుకుంటూ అంది.

"వుద్యోగం పోతుంది."

జయంతి నిలబడిపోయింది మాటరానిదానిలా. చేష్టలుడిగినదానిలా బిగుసుకుపోయింది.

"ఇదుగో చెబుతున్నా! నీ ప్రవర్తన ఏం బాగాలేదని తెలిసికూడా మేంచూసీచూడనట్టువూరుకుంటున్నాం. అది అలుసుగాతీసుకుని, నువ్వు యిష్టంవచ్చినట్టు ఆడకు. నీ కిష్టంలేకపోతే వుద్యోగంవదిలేసి వెళ్ళిపో.

భార్య: ఏమండీ! మన మనపెళ్ళయి ఇవాల్టికి సరిగ్గా సంవత్సమైంది. అందుకు గుర్తుగా మనం ఏమైనా చేద్దామండీ!

భర్త: ఏముందీ. రెండునిమిషాలు మౌనంగా నిలబడితే సరి:

ఎ. నరసింహరావు, శ్రీకాకుళం

అంతేగాని వుంది. మేం యిచ్చిన జీతం తీసుకుంటూ మాయెదుటే పొగరుగా మాట్లాడితే మేం సహించం."

"ఆగండి. ఇప్పుడే రాజీనామా కాగితం యిచ్చేస్తాను."

జయంతి హఠాత్తుగా అంది.

"ఇవ్వు. సలక్షణంగా. రేపీపాటికి ఇంకో ళ్ళని నీ స్థానంలో వుంచకపోతే నా పేరు సుమిత్రాదేవే కాదు. అయినా తింటానికి తిండిలేక వుద్యోగానికొచ్చి-"

"ప్లీజ్! మీరు అనవసరంగా మాట్లాడద్దు నేను రాస్తున్నాను." సుమిత్రాదేవిని శాసిస్తున్నట్టు అని జయంతి వంగి కాగితం తీసుకుని గబగబా రాయసాగింది.

• • •

ఆంధ్ర వనితావిహార్ అని బోర్డున్న గేటులోనుంచి సుడిగాలిలా బైటకుదూసుకు వచ్చింది జయంతి. గేటుకు పది బారల్లో వున్న బస్‌స్టాప్‌వైపు గబగబా అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయింది. పరీక్షగా చూస్తే జయంతిలో నరనరం ఏదో అస్పష్టమైన ఉద్విగ్నభావంతో వణుకుతున్నట్టుంది. మొహం యెర్రబడింది. పెదవులు అదురుతున్నాయి. నుదుటిమీద సన్నగా చెమట పట్టింది. కళ్ళలో తిరగబోతున్న నీళ్ళని బలవంతాన ఆపుకోవాలని ఒంట్లోవున్న శక్తి అంతాకూడా కట్టుకుని ప్రయత్నం చేస్తున్నట్టు. క్రిందపెదవిని రక్తం వస్తుందేమో అన్నంత గట్టిగా పళ్ళమధ్య నొక్కిపెట్టింది.

"వెధవబస్సు. ఇదోగోల. కావాలనుకున్నప్పుడు చచ్చినారాదు."

చుట్టుప్రక్కల యెక్కడా కనుచూపు మేరలో రిక్షాగూడా కన్పించకపోవటంతో తనని తనే తిట్టుకుంది. తిట్టుకున్నా స్టాప్‌లో నిలబడక తప్పలేదు.

"తొందరపడ్డావేమో? బంగారంలాటి ఉద్యోగం. చేతులారా వదులుకునివచ్చావు." జయంతి మనసులో అంతరాత్మలాటిది సణగటం ప్రారంభించింది.

"తొందరపడ్డానా? అది బంగారంలాటి వుద్యోగమా! అడుగడుక్కీ నా వ్యక్తిత్వాన్ని చంపి నేను అక్కడున్న అందరిలోకి అధమం అని ప్రతిక్షణం గుర్తుచేసే ఆ వుద్యోగం.ఆప లిన్నాళ్ళు ఇంత ఓపిక తెచ్చుకుని చెయ్యటం నాదే బుద్ధితక్కువ."

ఎర్రబడిన మొహంతో బస్సువైపు తల తిప్పి చూస్తున్న జయంతి అంతరాత్మని కసురుతూ అంది.

"కాని నీ ఆత్మాభిమానం అన్నంపెట్టదే మరి?"

"పెట్టకపోతేపోయింది. వెధవఅన్నం తినడం మానేస్తాను."

"నువ్వు మానెయ్యగలవు సంతోషమే. కాని బామ్మ కేమని చెబుతావు? ఆవిడసలే గుండెదడ మనిషి. కాస్త ఈ వుద్యోగం దొరికిన తర్వాత మనశ్శాంతిగా కృష్ణా రామా అనుకుంటోంది."

అవును నిజమే! బామ్మ కేమనిచెప్పాలి? జయంతి నిస్సహాయంగా చూసింది. వెంటనే కోపంవచ్చింది. "బామ్మకి చెప్పను. చెప్పకుండా ఇంకో ఉద్యోగం చూసుకుని అప్పుడుచెబుతాను."

"ఇంకోటి వెంటనే తొందరగా దొరకాలి అంటే మాటలా!"

జయంతికళ్ళముందుబ్యాగ్‌లోవున్న రెండు రూపాయల చిల్లర కళ్ళముందు మెదిలింది. వెంటనే కళ్ళలో గిఱ్ఱున నీళ్ళు తిరిగాయి. తనకేం తెలుసు. ఆంధ్ర వనితా విహార్ సెక్రటరీ అంటే గొప్పవాళ్ళతో పరిచయం అయి తనుగూడా గొప్పదై పోవచ్చునను కుంది. వాళ్ళంత అసూయాపరులని యెదుటి వాళ్ళని డబ్బుతో తప్ప గుర్తించరని, హోదా వుంటేగాని లెక్కపెట్టరని, యింత మూర్ఖులని అనుకోలేదు.

మూర్ఖులా! మూర్ఖులేంగాదు. అసలు యెదటవాళ్ళతో సమానులు అని గుర్తుపట్టటానికిష్టపడరు. పోనీ తన సంగతి వదిలేసెయ్యి. కాని వాళ్ళలో వాళ్ళకెన్ని పోట్లాటలు! మనిషి వెనక మనిషి మాటలు. బోలెడన్ని అబద్ధాలు వాళ్ళు చెబుతారు. ఎదుటివాళ్ళని చెప్పమంటారు.అవన్నీగూడా తను లెక్కపెట్టుకోలేదు. వాళ్ల చెప్పినట్టే చెయ్యటానికి సిద్ధపడింది. కాని యిదేమిటి? ఆ సంఘటన గుర్తొస్తూనే జయంతి వంటి నిండా గొంగళిపురుగులు పాకినట్టయింది. చదువు. సంస్కారం ముసుగువేసుకున్న క్రూరత్వం. రాక్షసత్వం.

ఎటోచూస్తూ ఆలోచనల్లోపడి కొట్టుకు పోతున్న జయంతికి తన ప్రక్కగా నల్లటి కారు ఆగటంగాని, అందులోనుంచి తెల్లటి బట్టల్లోవున్న వ్యక్తి 'హలో' అనటంగాని క్షణంసేపు గమనించలేదు

"హలో మిమ్మల్నే! రోడ్డుమీద నిలబడే నిద్రపోతున్నారా?"

జయంతి కళ్ళుతిప్పిచూసింది. ఎదురుగుండా డ్రైవింగ్‌సీటులో కూర్చున్న రాజశేఖరం! జయంతి చప్పున కంట్లో నలకపడినదానిలా రెండు కళ్ళు గట్టిగా తుడుచుకుంది. కాని కళ్ళలో సుళ్ళుతిరుగుతున్న నీళ్ళు జయంతి గట్టిగా వత్తినకొద్ది మరింత వుబికివాయిగాని తగ్గలేదు. ఇది రాజశేఖరం దృష్టిని దాటిపోలేదు.

"బస్సుకోసం వెయిట్‌చేస్తున్నారా-రండి డ్రాప్‌చేస్తాను."

ఆ రోజు దోరు వేసేసుకుని వెళ్ళిపోయిన మనిషి ఈరోజు మళ్ళీ వంగి అలాగే తీస్తూ అన్నాడు.

"థ్యాంక్స్! అక్ఖర్లేదు."

ఈ ప్రపంచంలో ముఖ్యంగా ఈ సమయంలో జయంతి కల్లోగూడా కలుసుకోగూడని వ్యక్తి రాజశేఖరం. అతని జ్యోతిష్యం గుర్తుకొచ్చిన జయంతి వెంటనే మొహం తిప్పేసుకుంది.

"ఇంటిదగ్గిర దించింతర్వాత థ్యాంక్స్ చెబుదుగాని రండి."

వనితావిహార్‌లోవుండే అందరికీవున్న జబ్బే యితనికీవుంది.

తాము చెప్పినమాటని అవతలవాళ్ళు శిరసావహించాలి.

"రండి. డ్రాప్‌చేస్తాను." అతనికళ్ళు జయంతిని పరిశీలనగా చూస్తున్నాయి.

● ఒకడు: "అదేమిటోయ్, అరగంటనుంచీ చెవిదగ్గిర ఫోను పెట్టుకు నిలబడ్డావ్, మాటామంతీ లేకుండా?"

మరొకడు; మా ఆవిడ మాటాడుతోందయ్యా బాబూ!"

"నో. థ్యాంక్స్." బొంగురుపోతున్న కంఠంతో అంది.

"మీరు మూడ్ లో లేనట్టున్నారే?" నవ్వుతూ అన్నాడు అతను.

జయంతికి ఒళ్లు మండింది. మహా తన మూడ్ అర్థం చేసుకున్నవాడిలా. దూరంగా బస్సువస్తున్న జాడేలేదు. పోనీ వెళ్ళిపోతే. కళ్లుమూసుకుంటే పది నిమిషాల్లో యింటికి చేరుకోవచ్చు.

జయంతి వచ్చి కారులో కూర్చుంది.

"మీకు తలుపు వేయటం రాదులావుంది. కొంచెం బలంగా వెయ్యాలి." శేఖరం జయంతిమీదనుంచి వంగి తలుపు బలంగా లాగివేశాడు. కారు స్టార్ట్ అయింది. అయితే ఆరోజు అతనికి గూడా గుర్తుందన్నమాట.

"ఏమిటీ విశేషాలు" డ్రైవ్ చేస్తూ అడిగాడు అతను.

"మీకు తెలియనివేముంటాయి?" ఈ రోజు కాకపోతే రేపయినా తెలిసితీరుతుంది అనుకుంది జయంతి.

"నేను ఆ రోజు మిమ్మల్ని డ్రాప్ చేసిన మర్నాడే బెంగుళూర్ వెళ్ళిపోయాను. అక్కడ మేము టెక్స్‌టైల్ మిల్ ఒకటి తెరుస్తున్నాం. మధ్యమధ్య అప్పుడప్పుడు వచ్చి రెండురోజులున్నా యిక్కడ సంగతు లేవీ నాకు తెలియవు." నిదానంగా వెనక్కు జారగిలబడి కూర్చుని ఒకచేత్తోనే డ్రైవ్ చేస్తూ "మిమ్మల్ని చూడగానే యేదో విశేషంవుందనిపించింది" అన్నాడు.

జయంతి చురుగ్గా తలతిప్పి అతనివైపు చూడకుండా వుండలేకపోయింది. అతను ఇటువైపు చూడలేదు.

"వుద్యోగం ఎలావుంది?"

"మీ జోస్యం నిజమైంది."

"అంటే?" తలతిప్పిచూస్తూ అడిగాడు.

"అంటే ఏం లేదు. నేను రిజైన్ చేసేశాను."

కళ్ళలో నిండబోతున్న నీళ్ళని బలవంతాన ఆపుకుంటూ అంది.

"ఎప్పుడు?" కారు సడన్ బ్రేక్‌తో ఆగిపోయింది.

శేఖరం పూర్తిగా జయంతివైపు తిరిగాడు.

"ప్లీజ్! నన్ను మీరు కొంచెం త్వరగా యింటికి తీసుకెళ్ళండి. బామ్మకి ఒంట్లో బాగాలేదు కూడాను." శేఖరం చూపుల్ని తప్పించుకోవటానికి మొహాన్ని పూర్తిగా ప్రక్కకు తిప్పుకుంటూ అంది.

"అయిదు నిమిషాల్లో దించేస్తాను. మీరు సరిగ్గా చెప్పండి. ఎప్పుడూ మీరు రిజైన్ చేసింది."

"ఈరోజు. ఈపూటే." పళ్ళు బిగబట్టి యెలాగో అంది. తనకేమో యేడుపువచ్చేస్తోంది. ఇతనేమో వదలకుండా తీరిగ్గా కారు ఆపి కూర్చున్నాడు.

"కారణం?"

తలతిప్పి ఒకసారి గిరుక్కున అతనివేపు చూసిన జయంతి మరుక్షణంలో హేండిల్ మీద చెయివేసి డోరు తెరిచేస్తూ.

"థ్యాంక్స్. నేను నడిచివెళ్ళిపోగలను." అంది.

"అరెరె. మైగాడ్, ఆగు." రాజశేఖరం చెయ్యి వారిస్తూ గబుక్కున ఖంగారుగా జయంతి చేతిమీదపడి హేండిల్‌ని గట్టిగా పట్టుకుంది. క్షణంసేపు యిద్దరి కళ్ళు కలుసుకున్నాయి.

జయంతిమొహం యెర్రబడింది. కళ్ళనిండా సుళ్ళుతిరుగుతున్న నీళ్ళు ఏ క్షణాన్నయినా బుగ్గలమీదకు జారవచ్చునన్నట్టున్నాయి. శేఖరం చెయ్యి అనుకోకుండా జయంతి చెయ్యిమీద బిగుసుకుంది. వెంటనే చేతిని తీసేసి కారు స్టార్ట్ చేశాడు. కాని కారు చాలా నిదానంగా పోతోంది. శీతాకాలపు సాయంత్రం. అస్తమిస్తున్న సూర్యబింబం తాలూకు ఎరుపు ప్రపంచాన్ని చుట్టేసి కంటికి కన్పిస్తున్న ప్రతివస్తువుని అదో మాదిరిగా చూపించసాగింది. మెల్లగా డ్రైవ్ చేస్తున్న శేఖరం జయంతివైపు చూడకుండానే "కారణం చెప్పటం ఇష్టంలేకపోతే అడగను. కాని రిజిగ్నేషన్ ఎవరికిచ్చారు మీరు?" అని అడిగాడు.

"సుమిత్రాదేవికి."

"సరే. రేపు ఉదయం ఆవిడే స్వయంగా వచ్చి బతిమలాడి మిమ్మల్ని తీసుకువెడుతుంది."

"థ్యాంక్స్. ఒకసారి కాదని వదిలేసి వచ్చింతర్వాత మళ్ళీ అక్కడ అడుగుపెట్టటం అనేది జన్మలో జరగనిపని."

రాజశేఖరానికి పున్న పలుకుబడి జయంతికి తెలుసు. కాని ఆదయా ధర్మం తనకేం అక్ఖర్లేదు.

"మరేం చెయ్యాలని? ఇంకేదయినా దొరికేవరకైనా చెయ్యాలిగా -"

"ఇంకోటి చూసుకునేదాకా యిదిచెయ్యాలని యెక్కడుంది?"

రాజశేఖరం మాట్లాడలేదు. కొంచెంసేపయిన తర్వాత జయంతి మళ్ళీ తనే అంది. "మీకు చాతనైతే యింకెక్కడైనా యెంత చిన్నదైనా సరే - అడుగడుక్కీ వ్యక్తిత్వం చంపుకోవాల్సిన అవసరంలేని ఉద్యోగం చూపించండి."

"నే నిక్కడ కారు ఆపుతాను. మీరేమీ అనకండి - "

శేఖరం రోడ్డువారగా కారు ఆపుతూ అన్నాడు. జయంతి యీసారి అభ్యంతర పెట్టలేదు. రోడ్డుమీద లైట్లు వెలిగాయి. వెలుగుతున్న ఆ లైట్లలో ఒకదాన్నుంచి కాంతి చెట్లకొమ్మలమధ్యనుంచి దూసుకు వచ్చి జయంతికి శేఖరానికి మధ్యగా పడుతోంది. ఇద్దరిమధ్య గీతలాపడిన ఆలైటును కళ్ళు వాల్చుకుని జయంతిచూస్తూకూర్చుండిపోయింది.

"ఉన్నట్టుండి ఉద్యోగం యెక్కడ దొరుకుతుంది?"

"ఆలస్యం అయినా ఫర్వాలేదు. అసలు దొరుకుతుందనే ధైర్యం వుంటేచాలు.

రాజశేఖరం మళ్ళీ ఆలోచనలోపడ్డాడు. జయంతికి బ్యాగ్‌లో చిల్లర కళ్ళముందు మెదిలింది. ఏం చెయ్యగలదు తను! అక్కడికి తనెంత సహనంచూపింది! తను చూపుతున్న సహనం ఆపతలవాళ్ళు అసమర్థతగా తీసిపారేశారు.

"పోనీ నా సెక్రటరీగా వుండగూడదూ?" హఠాత్తుగా అన్నాడతను.

"తమాషా కిది సమయంగాదు" రోషంగా అంది జయంతి.

"అంత మూర్ఖుణ్ణికాదు. నా సెక్రటరీ వూరువెళ్ళి ఇరవైరోజులుపైన అయింది. తల్లికి సుస్తీగావుందిట. మరో నెలవరకు

రాలేనని రాశాడు. ఒకవేళ అతను మధ్యలో వచ్చినా అతనికి నేను పని చూపించక పోలేను."

జయంతి మౌనంగా వుండిపోయింది.

"అసలు రేపు నేను మీరెందుకు రిజైన్ చేశారో కారణం తెలుసుకుంటాను. మీరు చూపించిన కారణం సబబే అయితే నా సెక్రటరీగా చేరిపోదురుగాని."

జయంతి మాట్లాడలేదు. భ్రాంతిగా కలో వాస్తవమో అర్థంగాని పరిస్థితి.

"ఏం ? యిష్టమేనా ?"

"మీకు నేను చెయ్యవలసిన పనులేముం టాయి ?"

శేఖరం కొద్దిగానవ్వి "వచ్చి చూస్తే తెలుస్తుంది. నిజంగానే నా సెక్రటరీగా తీసుకుంటాను" అన్నాడు.

"కాని అంతా...." అమ్మో ! యింతే మైనావుందా ! వనితావిహార్‌వాళ్ళు తన్ను బ్రతకనిస్తారా !"

"అదంతా నాకు వదిలెయ్యండి."

జయంతి మనసులో ప్రతీకారంలాటిది కదిలింది. నిజం. రాజశేఖరం అంటే వాళ్ళం దరికి ఎంత విలువుందో, అతనికెంత పేరు ప్రతిష్ఠలున్నాయో తనకి తెలుసు.

"కాని ఒక్క షరతు. మీరు వాగ్దానం చెయ్యాలి" ఆలోచిస్తూ అంది జయంతి.

"ఏమిటది ?"

"నాకు యెప్పుడింకో ఉద్యోగం దొరికితే అప్పుడు వెళ్ళిపోనివ్వాలి." జయంతివైపు కాసేపు పరిశీలనగా చూసిన శేఖరం కారు స్టార్ట్ చేస్తూ "సరే" అన్నాడు.

జయంతి గట్టిగా వూపిరి పీల్చుకుంది. పోనీ యింకో ఉద్యోగం దొరికేవరకూ కామాక్షికి తెలియకుండా వుండేందుకు యిది పనికొస్తుంది అన్పించింది.

మరో అయిదునిముషాల్లో కారు యింటి దగ్గరకు వచ్చేసింది.

వస్తా ! బై. బై. రేపువుదయం కారు పంపుతాను." కారు స్టార్ట్ చెయ్యబోతున్న శేఖరం హఠాత్తుగా వంగి కారులోనుంచి దిగి బొమ్మలా నిలబడిపోయిన జయంతి వైపు చూస్తూ "నాజ్యోతిష్యం నిజమైందని తిట్టుకోకండి." అన్నాడు. మరుక్షణంలో కారు వెళ్ళిపోయింది. జయంతి కొయ్యబారి పోయినట్టు నిలబడిపోయింది. ఇది కలా నిజమా అన్పించేటట్టు చేసి వెళ్ళిపోవటం యిది రెండోసారి.

(సశేషం)

రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పిపంప గోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతో పాటు కాక తరువాత స్టాంపులు పంప వద్దని. అట్టివారికి రచనలు త్రిప్పిపంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

—మేనేజింగ్ ఎడిటర్.

దృక్పథం

ఆచంట శారదాదేవి

సరిగ్గా రెండేళ్ళయింది మళ్ళా చదువులోచేరి. కాలం ఎంత త్వరగా గడచిపోతుంది ! ఆగాయం మొన్నమొన్ననే తగిలినట్లుంది. ఆ గాథ మనస్సును ఇంకా బలంగా హత్తుకునివుంది. అయితే, ఇప్పుడిప్పుడనిపిస్తోంది బహుశా నేనే తొందరపడ్డానేమోననీ, నా దృక్పథం సరికాదేమోనని !

ఆయనెంత. ధైర్యమూ, పట్టుదలా కల మనిషి ! రెండు సంవత్సరాలైనా ఒక్క సారైనా నాకు ఒక్క వాక్యమైనా వ్రాయ లేదు. మాట తప్పకుండా. నెలతప్పకుండా డబ్బుమాత్రం పంపుతున్నారు. అది చూచి నప్పుడల్లా నాకు గుండెల్లో మంట మళ్ళా రేగుతుంది. రోషం వస్తుంది. కులాసాగా ఉన్నావా ? డబ్బు సరిపోతోందా ?

ఇల్లాగ ఒక్కవాక్యమైనా, ఆ మనిఆర్డరు ఫారమ్‌లోనైనా ఎందుకు వ్రాయకూడదూ ? అంత తప్పు ఏం జేశానూ ? రోషం యొక్కపై దుఃఖం పొర్లివస్తుంది. ఈ మొండి తనం ఏమిటి? నిజానికి ఈయనకు హృదయం లేదు కాబోలు అనిపిస్తుంది. ఈ డబ్బు నిజంగా నేను తీసుకోకూడదు. అయినా యిప్పుడు తప్పదు. ఈ చదువు పూర్తయి ఉద్యోగంలో చేరగానే ఆయన డబ్బులెక్క ప్రకారం మళ్ళా పంపించెయ్యాలి అమ్మకు అక్కయ్యకు మళ్ళా నేను యిప్పుడు భారం కాలేను. ఈ ఊహతో ఊరటపొంది కన్నీళ్ళు తుడుచుకుంటాను.

ఈభావం మళ్ళా యెంతోసేపు నిలవదు. ఏరాత్రివేళో చదివి చదివి అలసిపోయి కన్నులు వాటంతటవె మూతలు పడే సమ యంలో, ఏదో ఉలిక్కిపడ్డట్టు, స్ఫురణకు వస్తుంది. రాత్రిపూట పడుకోబోయేముందు వేడిపాలు త్రాగితేనేగాని ఆయనకు నిద్ర పట్టదు. ఎవరుకాచి యిస్తున్నారో ! భోజనం యెవరు వండి పెడుతున్నారో ! ఏదో మొరటు ఊరికి బదిలీ అయిందన్నారు. అక్కడ పనివాళ్ళుమాత్రం సాఫీగాచేసే వాళ్ళెవరు దొరుకుతారు ! రాత్రిం పగళ్ళు ఆసుపత్రి గొడవతప్ప ఆయనకు ఇంకే గొడవా పట్టదు. భోజనం చేయమని కూడా యెవరైనా జ్ఞాపకం చెయ్యాలి ! నేను ఉన్న ప్పుడే అంతా గంటలు గంటలు యెదురు

చూస్తూ, ఊరికే విరామం లేకుండా ఫోను చేస్తూ వుంటే ఎప్పటికో ఇల్లు గుర్తుకు వస్తుంది. అఖరుక్షణంవరకు, బట్టలు వున్నాయో లేవోకూడా చూసుకోరు. ఆకలి యెన్నాళ్ళు రాకపోతే అన్నాళ్ళు అల్లాగే వూరుకుంటారు. నేనువుంటే అన్నీ చూసుకునేదాన్ని. ఈ ఆలోచనలతో మనస్సు చెదరిపోతుంది. ఏదో శూన్యంగా బెంగగా వుంటుంది. ఇంక యెంతకూ నిద్రరాదు.

ఆవేళ ఆయన ఇంటికి భోజనానికి వచ్చేప్పటికి మూడు గంటలయింది మామూలుగా పన్నెండుకు వచ్చేస్తారు. నేను వంట అంతా పూర్తిచేసుకుని, ఇంక వచ్చేస్తారు గదా అని వరాండాలో బల్లమీదకూర్చున్నాను. మా ఇంటి చుట్టూ మంచిరకరకాల పువ్వులతోటవున్నది. మాలతి తీగ దట్టంగా అల్లుకుని సువాసనలు వెదజల్లుతూ వుంటుంది. మేము యెక్కువ వరాండాలోనే కాలక్షేపం చేస్తాము. అక్కడ యెంతో చల్లగా ఉంటుంది.

ఏదో ఆలోచిస్తూ అల్లాగే చాలాసేపు కూర్చున్నాను. ఎంతసేపటికీ ఆయన రాలేదు. నాకు ఆకలి, నిద్ర, నీరసం అన్నీ కలిసి ఏదో మంపుగా వున్నది. ఆ బల్లమీద ఓమూల ఆవేళ వచ్చిన ఉత్తరాలన్నీ కట్టగా పడివున్నాయి. ఆయనదగ్గరమందులు పుచ్చుకు వెళ్ళిన వాళ్ళందరూ యేదో సలహాలు అడుగుతూ, కృతజ్ఞత తెలుపుతూ ఉత్తరాలు రాస్తుంటారు. ఏదో ఒకరోజు తీరిక చూసుకుని ఆయన అందరికి శ్రద్ధగా జవాబులు రాస్తారు. అందుకే రోజురోజుకి ఆయనకు ఉత్తరాల కట్టలు పెరిగిపోతుంటాయి. ఇవికాక యింకా యేవో వైద్య పత్రికలూ, మందుల జాబితాలు, ప్రకటనలూ వస్తూనే వుంటాయి. నాకు యివన్నీ చూచే ఓపికలేదు. నా కెవరూ వ్రాయరు అమ్మా, అక్కయ్యా ఉత్తరాలు రాయటం మానేసి చాలారోజులైంది. నా పెళ్ళయ్యాక రాయలేదు. ఇక స్నేహితులెవరైనా వ్రాస్తే బద్ధకించి నేను జవాబు రాయను. వాళ్ళూ రాయరు.

ఒంటిగంటయింది. ఆయన యింకా రాలేదు. ఏమీ తోచక ఉత్తరాలకట్ట తీసుకున్నాను. అన్నీ ఊరికే పరధ్యానంగా పైన చూసి పక్కన పెడుతున్నాను. మధ్యలో ఓ కవరు చాలా బరువుగావుంది. ఆ ఉత్తరం బరువుకు పలచని కవరంతా పూర్తిగా చినిగిపోయింది. అది చాలా పెద్ద ఉత్తరం. కవరు చినిగిపోవడం మూలాన మడిచిన కాగితాలకట్ట బయటికి వచ్చింది. దస్తూరి యెక్కువ చదువుకోని అమ్మాయిదిలా వుంది. ఇంత పెద్ద ఉత్తర మేమిటని ఆశ్చర్యపోతూ విప్పిచూశాను.

అది రాజ్యలక్ష్మి అని ఒక అమ్మాయి వ్రాసింది. ఆ అమ్మాయి అదివరకు కొన్నాళ్ళు ఆసుపత్రిలో ఉండిట ప్రత్యేకంగా ఆయన ఆదరణ! అభిమానంవల్ల కోలుకుండిట! ఆసుపత్రిలో ఆయనచూపిన వాత్సల్యాన్నీ ఆయనతో గడిపిన మధురక్షణాలనూ యెన్నటికీ మరువలేదట! ఆయన ఆదరంగా తన తల నిమరడమూ, ప్రేమతో తన కన్నీరు తుడవడమూ, ధైర్యం చెప్పడమూ, ఒక్కొక్కరోజు తను నిద్రరాక బాధపడుతూ వుంటే, ఆయన తనచేయి పట్టుకుని యేదో కబుర్లు చెబుతూ తను నిద్రపోగానే మెల్లగా ఆచేయి వదలించుకుని వెళ్ళిపోవడమూ యిల్లాంటి మధురానుభూతులెన్నో వివరంగా వర్ణించింది. ఆ అభిమానమే తనకు యిప్పుడు ఆధారమనీ, అది తలచుకుంటూ సుఖంగా జీవితం గడపగలననీ యింకా ఏవేవో వ్రాసింది.

నాకేదో తల తిరిగినట్లయింది. కొంచెం చదివాక యింక నేను చదువలేదు. ఆ ఉత్తరమంతా యేదో చెప్పలేని ఉద్రేకమూ కృతజ్ఞతా నిండి వున్నాయి. ఉత్తరాలు అవతల పారేసి టైము చూసుకుంటే రెండవుతోంది. విసుగూ నీరసానికి తోడు యీ ఉత్తరం మనస్సును కలచివేసింది. ఆయన నన్నేదో అవమాన పరచినట్లు బాధ కలిగింది.

ఆసుపత్రికి ఫోను చేశాను. ఆడవాళ్ళ మాటలు నవ్వులు ఫోనులోకి సన్నగా వినపడుతున్నాయి. వీళ్ళతో కబుర్లు చెబుతూ ఈయనకు ఇంటిగొడవ పట్టడంలేదు అని కోపం వచ్చింది. ఎవరో సమాధానం చెప్పారు. "ఆయన యిక్కడలేరు. ఆపరేషన్ థియేటర్‌లో వున్నారు." అని ఫోన్ పెట్టేశాను. ఆయన లేకపోతే వీళ్ళంతా ఆయన గదిలో ఏం చేస్తున్నట్లు? నాకేదో అనుమానం వేసింది. నామీద నాకే జాలివేసింది. నేనేమో ఈయనకోసం అన్నీ వదులుకుని పాపీ దానిలా ఇంటిపను లన్నీ చేస్తూ, వచ్చిన చదువు మరిచిపోయి, బాహ్యప్రపంచంతో సంబంధం లేకుండా ఆయనే సర్వస్వం అనుకుని, వేళకు తిండీ తిప్పలూ కూడా లేక ఆయనకోసం యెదురు తెన్నులు చూస్తూ కాలక్షేపం చేస్తున్నాను. ఆయనేమో అందరితో సరసాలు, ప్రేమ కలాపాలు, ప్రణయలేఖలు. నాకు దుఃఖం ముంచుకు వచ్చింది. నేనేదో జీవితంలో దగాపడి మోసపోయినట్లనిపించింది.

గడచిన జీవితం గుర్తుకువచ్చింది. నేనెటువంటి పరిస్థితులలో అన్నీ త్యాగంచేసి ఆయనను వివాహం చేసుకోగలిగినదీ గుర్తుకు వచ్చింది.

ఆయన ఆఖరు సంవత్సరం డాక్టరు చదువుతూ ఉండగా నేను మూడో సంవత్సరం చదువుతున్నాను. ఆ సంవత్సరం వార్షికోత్సవంలో మేమిద్దరమూ ఒకే నాటకలో పాల్గొన్నాము. అందులో ఆయన భర్తవేషమూ, నేను భార్య వేషమూ వేయవలసివచ్చింది. ఒక నెలరోజులు రిహార్సల్సు

● మల్లాదివారి మిత్రుడు. కడు చిన్నవాడు వారి అనురాగానికి నోచుకొన్నవాడు, వారి చమత్కారాన్ని దోచుకొన్నవాడు ఒకడు గలడు.

ఒక నాడా చిన్నవాడు శాస్త్రిగారి గృహమునకేగు సమయమున, అతని మిత్రుడొకడు 'ఎచటికి ప్రయాణ'మని ప్రశ్నించి, సమాధానము విని 'ఆయన అంత పెద్ద. నీ వింత చిన్న. మీరేమి మాట్లాడుకొనెదరు ?' అని సందేహము వెలిబుచ్చెను.

దానికా చిన్నవాడు 'తెలుగు' అని చల్లగ సమాధానము చెప్పెను.

కాశీ ప్రసాద్, మద్రాసు.

కోసం కలుసుకుంటూఉంటే మా కిద్దరికీ పరిచయం బాగా వృద్ధిఅయింది. ఒక నెల రోజులు భార్యా భర్తలుగా నటించటంతో ఒకరినొకరు ఆ దృష్టితో చూసుకోవడం అలవాటై ఈ సంబంధము నటనమాత్రమే కాక శాశ్వత బంధమేఅయితే ఎంత బాగుండునను ఊహ అస్పష్టంగా అంకురించింది. ఆ నాటిక అందరూ ఎంతో మెచ్చుకున్నారు. ఉత్తమ నటనకు మా ఇద్దరికీ మంచి బహుమతులు లభించాయి.

ఆ తరువాత ఆయన మా ఇంటికి రోజూ వచ్చేవారు. త్వరలోనే మేము వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాము. ఆయనకు ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్యడం అంతగా ఇష్టంలేదు. ఇద్దరూ ఉద్యోగం కోసం వెళ్ళిపోతే ఇంక ఇల్లుచూసుకునే వాళ్ళెవరంటారు. ఆయన అభిప్రాయాల కనుగుణంగా నేను పెళ్ళికాగానే చదువు మానెయ్యాలనుకున్నాను. అంచేత నేను డిగ్రీ పొంది డాక్టర్ అనిపించుకోలేక పోయాను.

ఈ పెళ్ళి అమ్మకు, అక్కయ్యకు ఇష్టంలేకపోయింది. ఒకటి ఆయనది మా కులంకాదు. రెండవది అమ్మకూ, అక్కయ్యకూ అసలు నేను వివాహం చేసుకోటమే ఇషంలేదు. డాక్టరు పూర్తి చేసుకుని ఉద్యోగంచేస్తూ స్వతంత్రంగా ఉండాలనీ ఆ తరువాత ఎప్పుడో పెళ్ళిసంగతి ఆలోచించవచ్చనీ, వాళ్ళ ఉద్దేశం.

అక్కయ్యకు చిన్నప్పుడే పెళ్ళిచేశారు. అది అత్తవారింట్లో వున్న కొద్దిరోజులూ నరకం చవిచూచింది అత్తగారిబాధ. భర్త నిర్లక్ష్యమూ రెండూ భరించలేక అది త్వరగానే మా ఇంటికి వచ్చేసింది. ఆ తరువాత అమ్మ యెంత చెప్పినా తిరిగి వెళ్ళడానికి యిష్టపడలేదు. మళ్ళా చదువులో చేరి యిప్పుడు ఉద్యోగంలో వుంది. నాకుతొందరపడి పెళ్ళి చేయకుండా స్వతంత్రజీవనం కల్పించాలని దాని ఉద్దేశ్యం. దాని పట్టుదలతోనే నన్ను డాక్టర్ కోర్సులో చేర్పించారు. ఒకసారి దెబ్బ తిన్న అమ్మ కూడా యిదే మంచిదనుకుంది.

ఇప్పుడు హఠాత్తుగా మధ్యలో నేను చదువు మానేసి పెళ్ళిచేసుకుంటాననడం వాళ్ళిద్దరికీ నచ్చలేదు. కనీసం చదువు పూర్తి అయ్యేవరకైనా ఆగమన్నారు. నేను వినలేదు. వాళ్ళకి కోపం వచ్చింది. ఈ పెళ్ళయ్యాక నాతో సంబంధం తెంపుకున్నారు.

ఇవన్నీ జ్ఞాపకంవచ్చిచాలాబాధకలిగింది. అయినవాళ్ళను కూడా కాదనుకుని నేను సాధించినదేమిటి? ఇప్పుడు ఈవిధంగా ఈయన నన్ను నిర్లక్ష్యం చేస్తున్నారు అని క్షోభపడింది హృదయం.

మూడు గంటలకు ఆయన వచ్చారు. చాలా అలసిపోయినట్లున్నారు. మామూలుగా మాట్లాడడానికి కూడా ఆయనకు ఓపికలేదు. కోపంతోవున్న నాకాక్షణంలో ఆవేవీ మనసుకు పట్టలేదు. ఆయన బట్టలు మార్చుకుని ముఖం కడుక్కుని వచ్చేలోగా నేను భోజనం వడ్డించాను. నా ముభావానికి ఆలస్యంగా రావడమే కారణమని ఆయన అనుకుని వుంటారు. అందుకనే నేను అడక్కుండానే, "సరిగా పన్నెండుకు బయలు దేరబోతూంటే యెక్కడో లారీ జట్కాకు కొట్టుకుందిట. అక్కడ గాయాలు తగిలిన



వాళ్ళందరినీ తీసుకువచ్చారు. పాపం ఆ చిన్నపిల్లకు చేయి విరిగింది." అంటూ ఆలస్యానికి సంజాయిషీ చెప్పుకున్నారు.

నేనేమీ చలించలేదు. మామూలుగా అయితే కంగారుపడి ఎన్నో వివరాలు అడిగి ఉందును. ఆయన చెప్పిఉందురు. కాని అవ్వాళ మాట్లాడలేదు. కాస్సేపటికి "ఉత్తరాలు చూసుకున్నారా?" అన్నాను. ఆయన లేదన్నారు. నేను కొంచం అసూయతో "ఎవరో రాజ్యలక్ష్మట! చాలా పెద్దఉత్తరం రాసింది" అన్నాను. ఆయన ముఖంలో ఎటువంటి చలనమూ కనిపించలేదు. భోజనం ముగించి వెళ్ళిపోయారు.

నేను పని ముగించుకుని ముందరగదిలోకి వచ్చేసరికి ఆయన హాయిగా మంచం మీద పడుకుని ఆ ఉత్తరమే చదువుతున్నారు. నేను వచ్చిందే ఆయన గమనించలేదు. ఆ నిమిషంలో అనుకున్నాను "ఇంకటితో ఈ అమ్మాయితో సంబంధము వదలిపోవాలి. లేదా నేనైనా ఈ ఇల్లు వదలి పోవాలి" అని.


ఆ రాత్రి ఆయనతో ఈ విషయం చెప్పాను. ఆయన నెమ్మదిగా అన్నారు "ఆ అమ్మాయి క్షయవ్యాధితో బాధపడుతోంది. ఎవరూ దిక్కులేరు. ఇప్పుడు కాస్త నయమై మళ్ళా ఉద్యోగించేస్తోంది. ఊరికే ఉత్తరాలు రాసినందువల్ల నష్టమేమీలేదు. జీవితంలో ఏదో కొంత సంతృప్తిఉంటే వ్యాధి తిరగబెట్టకుండా ఉంటుంది. అంతకన్నా ఆ అమ్మాయితో నాకు సంబంధం లేదు" అని.

ఈ మాటలు నా చెవికెక్కలేదు. నేనా రాజ్యలక్ష్మిని ఎప్పుడూ చూడలేదు. వారం రోజులయ్యాక ఆ అమ్మాయి మళ్ళా ఉత్తరం రాసింది. అది నాకు నిప్పులో నెయ్యిపోసినట్లయింది.

ఆవేళ ఆయన ఇంటికి రాకముందే నేను ప్రయాణానికి అన్నీ సిద్ధంచేసుకున్నాను ఎక్కడికివెళ్ళాలో ఏంచెయ్యాలో కూడా నిశ్చయించుకున్నాను. అమ్మ వాళ్ళ దగ్గరకు మళ్ళా వెళ్ళదలచుకోలేదు. నా స్నేహితురాలు రేవతి దగ్గరకు వెళ్ళి తరువాత మళ్ళా చదువు పూర్తిచేసుకోవాలనుకున్నాను.

ఆయన ఇంట్లో అడుగుపెడుతూనే అన్నాను. "నామాట మీకు లక్ష్యం లేనప్పుడు యిక్కడ వుండాల్సిన బాధ్యత నాకు లేదు. నేను ఇవ్వాళ వెళ్ళిపోతాను" అన్నాను. అంటూ ఆవేళ వచ్చిన ఉత్తరం తీసి ఆయనవేపు విసిరాను. అది మా ఇద్దరికీ మధ్యగా పడింది. ఆయన దానివంక చూడనే లేదు ముఖం కోపంతో యెర్రబడివుంది. మళ్ళా నేనే అన్నాను. "మీకోసం నేను అన్నీ వదులుకున్నాను. అంచేత నన్ను ఆదుకోవలసిన బాధ్యత మీకున్నది. నేను మళ్ళా చదువుకుంటాను. ఆభారం మీరు వహించక తప్పదు" అన్నాను. ఆయన అపరిమితమైన విరక్తితో అక్కడే డ్రాయరులో వున్న కవరుతీసి నాకిచ్చి వెళ్ళిపోయారు. అది ఆయన అన్నగారు పంపిన వంటతాల్లాకు డబ్బు రెండువేలు. ఎవరో మనిషి తెచ్చియిస్తే కవరులోపెట్టి అందులో వుంచారు. ఆయన నాదే తప్పయినట్లు కోపంగా వుండడం నాకు చాలా బాధ కలిగింది.

నేను ఆయనదగ్గరకు వెళ్ళి "ఈడబ్బు చాలదు. మీరు మళ్ళా పంపాలిసివుంటుంది" అన్నాను. ఆయన యేమీ మాట్లాడలేదు.



"నేను సాయంత్రం వెళ్ళిపోతాను" అన్నాను. అప్పుడు సమాధానం చెప్పారు.

"నువ్వు మనస్సుమార్చుకుంటేమంచిది. లేదా నీ యిష్టం" అంటూ వెళ్ళిపోయారు. నేను ఒక్కదాన్ని ఇంట్లో బాధపడుతూ కూర్చున్నాను. నాలుగు గంటలకు ఫోను వచ్చింది. ఒక్కటేమాట. "ఏం నిశ్చయించావు?" అన్నారు. "వెళుతున్నాను" అన్నాను. మళ్ళా మాటలేదు.

తరువాత టాక్సీలో శంకరంగారు వచ్చాడు. "అయ్యగారు మిమ్మల్ని రైలెక్కించి రమ్మన్నారు" అన్నాడు. నేను ముఖం మాడ్చుకుని ఇంటికి తాళంవేసి తాళంచెవి శంకరానికిచ్చి టాక్సీఎక్కాను. రైలెక్కగానే శంకరాన్ని పంపించివేశాను. రైల్లో కూర్చోగానే దుఃఖం ముంచుకువచ్చింది. నేను పదే పదే కళ్ళుతుడుచుకుంటూఉంటే పక్కన ఉన్నావిడ "మీ వాళ్ళకెవరికైనా సుస్తీగా ఉండి వెళుతున్నారా?" అన్నది. నేను జవాబు చెప్పలేదు. దూరాన గేటుదగ్గరగా ఆయన నిలబడిఉన్నట్లు లీలగాతోచింది. ఏదో ఆశతో ముందుకువంగి చూశాను గుండెల్లో ఏదో గుబగుబలాడింది. ఆయన ముందుకువస్తే బాగుండును దగ్గరకువస్తే బాగుండును ఏదోవిధంగా ఈ ప్రయాణం ఆగిపోతే బాగుండును అనిపించింది. కూత వేసి రైలు కదలిపోయింది.

2

సరిగ్గా రెండేళ్ళయింది - సావిత్రి వెళ్ళిపోయి.

ఈ సంవత్సరంతో చదువు పూర్తయిపోతుంది. ఆమె మళ్ళా నా దగ్గరకు వస్తుందన్న ఆశ నాకు పోదు. నన్ను విడచి ఆమె ఉండలేదు. ఆమెను విడచి నేనూ ఉండలేను. పెడదారి పట్టిన ఈ ప్రవాహం ఎప్పుడో మళ్ళా మలుపుతిరగక తప్పదు. అప్పుడు చీలిపోయిన ఈ సెలయేరు మళ్ళా ఒక్కటే అవుతుంది. ఒకే గమ్యం చేరుకుంటుంది.

సావిత్రి అమాయకురాలు. ప్రేమమూర్తి. అంత అనురాగానికి నేను అర్హుణ్ణికావడం అదృష్టం! ఏదైనా ఒకవిషయం మనస్సుకు తోస్తే దాంట్లో లీనమైపోవడం ఆమె స్వభావం! ఆ నిమిషంలో ఇతరవిషయాలేవీ ఆమెకు పట్టవు. మా పెళ్ళివిషయంలోను అంతే అయింది. చిన్నప్పటినుంచి ఆదుకున్న బంధువులను ఒక్కనిమిషంలో కాదనుకున్నది. అక్కడికీ నే నన్నాను. పోనీ మీవాళ్ళ ఇష్టప్రకారం నీ చదువన్నా పూర్తిఅయ్యేవరకు ఆగుదామని. ఆవిడ ఒప్పుకోలేదు. "నే నెల్లాగు ఉద్యోగం చేయడం మీ కిష్టంలేదుకదా! ఇంకెందుకు చదవడం" అన్నది. నాకూ అది సబబుగానే తోచింది.

అయితే యిప్పుడనిపిస్తోంది. నే నామెను చదువు మాన్పించడం మంచిదికాదేమోనని. ఆమెకూడా నాతోపాటు ఈవైద్యవృత్తిలో సహకరిస్తూవుంటే యిల్లాంటి కలతలకు అసలు అవకాశమే లేకపోయ్యేదేమో! నాకోసం ఎదురుచూడటం తప్ప వేరే వ్యాపకం లేకపోవడమూ, నేను తప్ప ఇంకెవరూ స్నేహితులు లేకపోవడమూ అసంతృప్తికి అసహనానికి దారితీసి వుంటాయి. దృక్పథం సంకుచితమై ఉంటుంది.

రాజ్యలక్ష్మి కొన్నాళ్ళు ఆసుపత్రితో ఉంది. క్షయవ్యాధి. చాలారోజులు అశ్రద్ధ చేయటం మూలాన వ్యాధి పాదుకుని మొండికి వారింది. ఆమెకు బంధువులెవరూ లేరట. వేలువిడిచిన మేనత్త యెవరో కొద్దిగా చదువు చెప్పించింది. తరువాత యెక్కడో చిన్న ఉద్యోగంలో చేరింది. జీవితంలో యెటువంటి ఉత్సాహము ఆసక్తి లేక వ్యాధి నిర్లక్ష్యంచేసింది. ప్రేమ,ఆదరం చూపే వ్యక్తులు యెవరూ లేనప్పుడూ జీవితం మోడుబారిపోతుంది. బ్రతకాలన్న కోరికకూడా నశిస్తుంది. "నాకీవ్యాధి నయం కాకపోతే ఏం, నేను జీవించి యెవరిని ఉద్ధరించాలి" అన్నదే రాజ్యలక్ష్మి తత్త్వం. ఈభావం మారి జీవించాలన్న ఆశ మళ్ళా రేకెత్తితేనేగాని ఆమె వ్యాధి కుదిరేటట్లుగా నాకు తోచలేదు. వైద్యుడు మందు ఇవ్వగలడు, కాని రోగి సహకారం లేనిదే మందులు పనిచెయ్యవు. వ్యాధి నెట్లాగైనా జయించాలి. ఎట్లాగైనా జీవించాలి అన్న బలమైన కోరిక రోగికి లేకపోతే, వైద్యుని ప్రయాస ఒక్కొకసారి నిష్ప్రయోజనమే అవుతుంది.

ప్రతి జీవితానికి ప్రయోజనం యేమిటి అని ప్రశ్నించడం నా ధర్మంకాదు. ప్రతి ప్రాణిని రక్షించడం మాత్రం నాధర్మం. ప్రతిజీవికి వీలైనంతవరకు బాధ ఉపశమింపచేయడం. జీవితకాలాన్ని పెంపొందించడం నా విధ్యుక్తధర్మం.

వైద్యుని మనస్సులో స్త్రీ. పురుష భేదం ఏనాడో నశిస్తుంది. యోగుల మనస్సులో ఏమోకాని, వైద్యునిమనస్సులో ఈ శరీరం కేవలం రక్తమాంసములగూడు. రామయ్య. రామమ్మ ఈ పేర్లతో నాకు సంబంధం లేదు. మూడో నంబరు రోగి. నాలుగో నంబరు రోగి అంతే! నా కంటికి కనిపించేది ఒక వ్యాధిగ్రస్తమైన శరీరం! వారి కన్నులలో నేను చూచేది ఒక ఆరని వెలుగు. ఆత్మజ్యోతి!

రాజ్యలక్ష్మి శరీరంలో మిగిలినది ఎముకలగూడు. కన్నులలో నిండినది నీరసించిన ఆత్మవేదన. ఆమెకు వైద్యంచేయడం ప్రారంభించిన రెండు మూడు వారాలలోనే నాకు తెలిసిపోయింది. మందులు ఇంజక్షన్లతోపాటు ఆమెకు జీవితంలో ఉత్సాహం కలిగిస్తేనేతప్ప లాభంలేదని. అందుచేతనే అవసరం లేకపోయినా నే నామెతో కొంచెం ఎక్కువకాలం గడిపి. ప్రత్యేక శ్రద్ధచూపి ఆమె మనస్సు మార్చడానికి ప్రయత్నం చేయవలసి వచ్చింది.

"ఈ జీవితం నిరర్థకం అనుకోవడం కన్న మహాపాపం మరొకటిలేదు. ఈజీవితానికి సార్థకత యేమిటి, ఫలమేమిటి అని ప్రశ్నించుకుంటూ కూర్చునే అర్హత నీకు లేదు. ఆబాధ్యత నిన్ను సృష్టించిన భగవంతునికే వదిలెయ్యి. ఏదో కారణమూ, ప్రయోజనము లేకుండా సృష్టి జరుగనే జరుగదు. నీ జీవితానికి ఏదో ఫలం వుండనే ఉంటుంది. కనీసం సంకుచితంగా ఆలోచిస్తే మీ మేనత్తను పెద్దతనంలో ఆదుకునే బాధ్యత నీదేకదా! నీవు ఉద్యోగం చేస్తే ఆమెను పోషించవచ్చును. నీవు లేకపోతే ఆమెకు నిరాధారమవుతుంది. నీ జీవితానికి యింతమాత్రం ప్రయోజనం ఉండనే ఉన్నది. జన్మ ఎత్తేటప్పుడు మనప్రమేయం ఏమీ లేదు. జన్మ అంతం చేసుకోటానికి మనకు అధికారం అసలే లేదు."

ఈవిధంగా ఆవిడతో యెన్నోసార్లు మాట్లాడుతూ ఉండేవాణ్ణి. క్రమంగా ఆవిడ మనస్సు మారింది. నిరుత్సాహం తగ్గిపోయింది. "తల్లిలా చూసుకునే మేనత్త, యెంతో ఆదరంతో అభిమానమూ, ప్రేమా చూపే మీవంటివారు లభించినప్పుడు నాకింకేమి కొరవ ఉంటుంది. ఏమీలేదు," అనేది ఉత్సాహంతో.

ఆతరువాత క్రమంగా కోలుకుంది. వెళ్ళిపోయింది. వెళ్ళేరోజు సావిత్రిని చూస్తానన్నది. చూడందే వెళ్ళనన్నది కాని నాకు ఆసుపత్రి వదలడానికి వీలుపడలేదు. ఆమెకు రైలు టైమయింది. వెళ్ళిపోయింది.

ఏవేవో ఉత్తరాలు రాస్తుంది. మళ్ళీ ఉద్యోగంలో చేరింది. కులాసాగానే ఉన్నానంటుంది. ఆమె మళ్ళా మామూలు మనిషిగా మారిందని నాకు చాలాసంతోషం. ఆమె ఉత్తరాలు పూర్తిగా చదవడానికికూడా నాకు తీరికవుండదు. ఎప్పుడో ఒకసారి రెండు

"ఏమిటోయ్, ఈమధ్య బొత్తిగా కనబడ్డంలేదూ ?"
"కళ్ళ డాక్టర్‌కి చూపించారా ?"

మొగలి సుదర్శనరావు, గొల్లప్రోలు

పంక్తులు జవాబు రాస్తాను. అదే ఆవిడకు సంతోషం. నేను రాయకపోయినా ఆమె ఆత్మతృప్తికోసం ఏదో రాస్తుంటూ వుంటుంది. ఈమాత్రం ఆనందానికి నేను నిమిత్తమాత్రుణ్ణి అయినందువల్ల నష్టమేమిటి! ఈ కాస్త సంతృప్తి కూడా ఆమెకు ఎందుకు లేకపోవాలి. పైగా మళ్లా నిరాశలో చిక్కుకున్నదంటే వ్యాధి తిరగబెట్టవచ్చు. ఆ పరిస్థితి రాకుండా కాపాడవలసిన బాధ్యత వైద్యునిగా నాకున్నదిగదా!

సావిత్రికి చిన్నతనం ఇంకా వదలలేదు. దృక్పథం ఇంకా విశాలం కాలేదు. ఆమె చదువు పూర్తిచేయడమే మంచిది. కొన్నాళ్ళకి మనస్సు విస్తృతమవుతుంది. సంకుచితభావాలు వాటంతటవే పోతాయి. అందుకే ఆమె వెళ్ళిపోయి చదువుకుంటానంటే నాకు ఎంతో బాధగావున్నా అడ్డుచెప్పలేదు. పైగా ఆ స్థితిలో నేనేమి చెప్పినా ఆమె చెవికెక్కదు. కొన్నాళ్ళకు ఆమెకే తెలుస్తుంది.

ఆమె వెళ్ళేముందు నేనేమీ మాట్లాడలేదు. అప లల్లా వెళ్ళిపోతానంటుందని నాకు తోచనేలేదు. ఒక్కసారి అంతా శూన్యంగా తోచింది. ఆమె అపోహలకు, మూర్ఖత్వానికి కోపమూ, జాలి, ఇన్నాళ్ళయినా నా వ్యక్తిత్వాన్ని తెలుసుకోలేకపోయిందని విచారము కలిగింది. ఇంట్లోంచి వెళ్ళిపోయాను. ఆమె వెళ్ళిపోతూవుంటే చూసి భరించలేను. మళ్లా శంకరాన్ని పంపికూడా ఉండలేక నేను స్టేషనుకు వెళ్లాను. దూరాన్నుంచే ఆమెను చూస్తూ వుండిపోయాను. దగ్గరకు వెళ్ళి ఆమెను బలవంతంగా ఆపాలని ఎంతోఆరాటపడ్డాను. కాలు నిలవలేదు. ధైర్యం సడలిపోయి నేను తీరా అడుగు ముందుకువేసేటప్పటికి రైలు కదలిపోయింది.

ఈ రెండేళ్ళ ఎన్నోసార్లు వ్రాయాలనుకుని బలవంతంగా అణచుకుంటున్నాను. ఒకసారి నామూలాన ఆమె చదువు పాడయింది. ఇప్పుడు మళ్లా మధ్యలో నేనే భంగంకలిగించకూడదు. మనస్సులో ఈ బాధను అణచుకుంటూ, ఈ శూన్యాన్ని భరిస్తున్నాను. ఆమె చిరునవ్వుతో నన్ను చూచినట్లేఉంది. నేను నిద్రపోయేటప్పుడు ప్రేమతో నా తల నిమిరినట్లే ఉంటుంది.

ఇక కొద్ది రోజులే! ఆమె తిరిగి రాక తప్పదు. అంతవరకు ఈ ఇల్లు ఆమెకోసం కనిపెట్టుకునే ఉంటుంది. ఈ కళ్ళు ఆమె కోసం ఎదురుచూస్తూనేఉంటాయి.

3

సరిగ్గా రెండు నెలలవుతోంది ఆవేళ రైల్లో ఆమె కనిపించి. నేను మా ఊరు వెడుతున్నాను సెలవుపెట్టి. త్రోవలో ఆమె యెక్కింది. ఇద్దరమే ఉన్నాము పెట్టెలో. ఆమె పలకరించినా మాట్లాడే ధోరణిలోలేదు. తల వంచుకు యేదోచదువుకుంటూ కూర్చుంది మధ్యమధ్య కిటికీలోనుంచి శూన్యంలోకి చూస్తూ. పక్కబల్లమీదే నేను పడుకున్నాను ఊరికే ఆమెనుచూస్తూ. యెంత అందంగా ఉన్నది! వంపులుతిరిగిన ముంగురులు, పెద్దపెద్దకళ్ళు, తెల్లగా దంతపుబొమ్మలా ఉన్నది. అంత అందంగా ఉన్నా నన్న స్పృహ ఆమెకులేదు. ఏదో పరధ్యానంగా ఉన్నది.

ఆమె ప్రక్కన ఉండటానికి నాకు అవమానమనిపించింది.

భగవంతుడు నన్నూ సృష్టించాడు! ఎందుకూ! ఇంత అందవికారంగా. యెప్పుడైనా పొరపాటున అద్దంకేసి చూస్తే నాకే బాధగా ఉంటుంది. కమిలి, కృశించి బొమికలు మాత్రము మిగిలిన ఈ దేహమూ, కాంతి విహీనమైన ఈనలుపువర్ణము. ఎందుకో ఈ సృష్టి! అబ్బా! నాకు అప్పుడప్పుడు ఈ భూమి చీలి నేను లోపలికి కృంగిపోతే బాగుండుననిపిస్తుంది. జన ప్రవాహానికి అంచున నిలబడి, ఆ ధార నా ఉనికినే గమనించకుండా ముందుకుసాగిపోతున్నప్పుడు! ఈ జీవితం నిరర్థకమనిపిస్తుంది. నేను ఎప్పుడూ ఎవరినీ ఏవిధంగాను ఆకర్షించలేను. ఎవరి స్నేహాన్ని సంపాదించుకోలేను. దురదృష్టవంతురాలిని. చిన్నప్పుడే తల్లినీ తండ్రినీపోగొట్టుకున్నాను. అత్తయ్య చేరదీసిపెంచింది. ఎందుకో? ఆవిడకు అంతకన్నా ఆధారం దొరికి ఉండదు, ఆమెకు డబ్బులేదు. ఎల్లాగో కష్టపడి కొన్నాళ్ళ చదివించింది. ఇప్పుడు నేను తెచ్చే జీతం మా ఇద్దరికీ చాలు. రోజంతా నెలంతా పని చేస్తే వచ్చేది భోజనానికి సరిపోతుంది. కాని ఎందుకూ ఈ మనుగడ! ఈ జీవితానికి ప్రయోజనమేమిటి? లోకాన్ని నేను ఉద్ధరించలేను. ఈ లోకానికి నా అవసరమూ లేదు. శూన్యమైన రాతిబండలమీద ఒక్కొక్కరోజు ఒక్కొక్క అడుగువేస్తూ ఎందుకీ ప్రయాణం? ఈ ఆలోచనలతో మనస్సు వికలమైపోతుంది.

దరిద్రుని తలమీదనే పడగళ్ళ వాన కురుస్తుందిట! నాకు ఏదో వ్యాధికూడా పట్టుకుంది. ఆఫీసువాళ్ళు ఆరునెలలు సెలవు, ఆరునెలల జీతం అప్పు ఇచ్చారు నయం చేసుకోమని. అంత మాత్రం దయ ఉంటుందనుకోలేదు. అయినా నాకు మొదట్లో బ్రతకాలన్న కోరికేలేదు. మగతగా కళ్ళు మూసుకుని శాశ్వతంగా నిద్ర ఎప్పుడు వస్తుందని ఎదురు చూసేదాన్ని! నాకు మందిచ్చిన డాక్టరుగారు మాత్రం నా జబ్బుకే కాకుండా నాలోనిండుకున్న నిస్పృహకు కూడా. ఏదో విధంగా మందు ఇవ్వడానికి గట్టిగా పూనుకున్నట్లు తోచింది. ఆయనకు నాకన్న మొండితనం. నాకు లేని ఓపిక ఎంతో ఎక్కువ. నేను విన్నా వినకపోయినా ఆయన చెప్పేవి చెబుతూనే ఉన్నారు. ఇచ్చే మందులు ఇస్తూనే ఉన్నారు. క్రమంగా నా మనస్సు మారిపోయింది. నా ఆలోచనలు మారిపోయాయి. ఏదో విధంగా బ్రతకడం నేర్చుకోవాలిగాని, బ్రతికి ప్రయోజనమేమిటి అనుకోడ మేమిటి పిచ్చి! ఆ డాక్టరు చేసిన ఉపకారం ఈ జన్మలో మరచిపోలేను. ఆయన ఎంత మంచివారు! ఇప్పుడు నాకు విచారం లేదు. ఆఫీసులో పని చేస్తున్నంతసేపు, అత్తయ్యతో మాట్లాడుతున్నంతసేపు సంతోషంగానే ఉంటుంది. తృప్తిగానే ఉంటుంది. ఈ అందవికారము, నిస్సహాయత్వము ఇప్పుడంతగా బాధగాలేవు.

• • •

ఆమె పుస్తకం మూసి కిటికీలో తల వాల్చి శూన్యంగా చూస్తూ కూర్చుంది. సన్నని రంగు పువ్వులు కుట్టిన పమిట కొంగు తల చుట్టూ కప్పుకుంది. ఇంత అందమైన ఈ ముఖము ఎందుకింత దీనంగా ఉన్నది! నాకు ఉండ బట్టలేదు.

"ఏ ఊరు వెళుతున్నారు?" అని అడిగాను.

ఆమె చెప్పింది.

"అత్తవారింటికా?" అన్నాను.

ఆమె నవ్వింది.

"కాదు హాస్టలుకు. డాక్టరు చదువుతున్నాను." అన్నది.

నేను మా డాక్టరుగారిపేరు చెప్పాను "ఆయన్ను ఎరుగుదురా?" అన్నాను. ఆమెముఖం పాలిపోయింది. ముభావంగా యెరుగుదునన్నది. నేను ఉత్సాహంగా చెప్పుకుపోయాను. "ఆయన నాకుదేవునితో సమానం. నా ప్రాణం కాపాడారు. నాకు మళ్ళా జీవం పోశారు. ఆయన ఆస్పత్రిలో కొన్నాళ్ళు ఉన్నాను." అంటూ ఏదో ఉద్రేకంతో చెప్పాను. ఆమె ఉదాసీనంగా విన్నది. ఏదో భయపడుతున్నట్లు మెల్లిగా అడిగింది. "మీ పేరేమిటి? అని. నేను చెప్పాను. "రాజ్యలక్ష్మి" అని. ఆమె ఉలిక్కిపడింది. నా అందవికారమైన రూపంపైపు ఎగాదిగా అపరిమితమైనజాలితో చూసింది. విరక్తిగా ఊరుకుంది.

"డాక్టరుగారు ఇప్పుడెక్కడున్నారు? దాదాపు రెండేళ్ళవుతోంది. ఆయన ఉత్తరం రాసినా జవాబు రాయడంలేదు. కులాసాగా ఉన్నారా?" అన్నాను. ఆమె జవాబు చెప్పలేదు. చలనం లేని బొమ్మలా దిగులుగా చూస్తూ ఊరుకుంది. నేను మళ్ళా అడిగాను.

"ఆయన భార్యను మీ రెరుగుదురా?" అని. ఆమె చలించకుండా అల్లాగే ఉండిపోయింది. ఏదో మరో లోకంనుంచి చెబుతున్నట్లు "ఆ" అన్నది.

"ఆమె అందంగా ఉంటుందా?"అన్నాను. ఎంతో ఆసక్తితో.

ఆమె నవ్వింది.

"ఏదో ఉంటుంది నాకుమల్లేనే! "అన్నది. కాస్సేపుండి మళ్ళా అన్నది ఏదో కసితో. "ఏమైతేనేం? ఆమె యిప్పుడు ఆయన దగ్గరలేదు. కోపంవచ్చి వెళ్ళిపోయింది!"

నాకు శూలం గుచ్చుకున్నట్లయింది. డాక్టరుగారి మౌనానికి ఇది కారణంకాబోలు! నాకేకాక నన్ను ఆదరించిన వాళ్ళకు కూడా దుఃఖాలు యెందుకు కలుగుతాయి! ఇది నా దురదృష్టమా! ఆయన యెంత బాధపడుతున్నారో! దీనికి నేను ఏవిధంగానైనా బాధ్యురాలిని కాను గదా! ఉపకారం చేసిన వారికి తెలియకుండా అపకారం చేసేభారం నుంచి భగవంతుడు నాకు విముక్తి ప్రసాదించాలి!

ఆమె మళ్లా ఆయనదగ్గరకు వెళ్ళిందన్న చల్లని కబురువింటేనే ఈమనస్సుకు మళ్ళా ప్రశాంతి. ఈ మనస్సు తన కష్టాలను తాను అనుభవించగలదు. తనకు ప్రియమైనవారికి ఆప్తులకు కలిగే బాధలను భరించలేదు. వారి ఆవేదనాభారాన్ని ఊహించుకొని ఊహించుకుని తీర్చేమార్గం లేక కుమిలిపోతుంది.

అబ్బా! ఎన్నాళ్ళక్రిందటో మరుగుపడిన ఈదగ్గు మళ్లా వస్తోంది.

దగ్గుతో బాధతో మెలికలు తిరిగిపోతున్న నన్ను ఆమె గట్టిగా పట్టుకుంది.

"మీరు ఊరికే బాధపడుతున్నారు. నేను తమాషా కన్నాను. ఆయనా ఆయన భార్యా ఇద్దరూ కులాసాగానే ఉన్నారు. మీ డాక్టరుగారి భార్యను నేనే" అన్నది పేలవంగా నవ్వుతూ.

దగ్గుతో తల దిమ్మెక్కిపోతున్న నేను దబుక్కునతమాయించుకోటానికిప్రయత్నం చేశాను. దగ్గు అణువచ్చింది. ఆమె అపరిమితమైన దయతో కూజాలో నీళ్ళు వంచి ఇచ్చింది. నేను కృతజ్ఞతతో రెండు చేతులతో అందుకుని అల్లాగే నమస్కారం చేశాను.

స్టేషన్ వచ్చింది. ఆమె కంగారుపడుతూ గబగబా దిగి వెళ్ళింది. వెళుతూ నన్ను చూసి నవ్వుతూ సెలవు తీసుకుంది. మంచినీళ్ళ గ్లాసుతో నేను అల్లాగే ఆప్యాయంగా ఆమె కనిపించి నంతవరకు చూస్తూ ఉండి పోయాను.

4

సరిగ్గా రెండు గంటలయింది. నా కథ కూడా పూర్తయింది. ఇంక రైలు రాలేదు" అన్నది శాంత.

"ఈ వెయిటింగ్ రూమ్‌లో ఇంకా ఎంతసేపో! ఈ ప్రయాణం ఎందుకు తలపెట్టామో కాని. బస్సుకు వెడితే టిక్కెట్లు లేవు. రైలుకు వస్తే ఇంకి మూడు గంటలు లేటు. మనవిహారయాత్ర మొదట్లోనే దెబ్బతిన్నది!" అన్నది అరుణ విసుగ్గా.

"నీ కథ అయిపోవడ మేమిటి? ఆ తరువాత ఏమైంది? ఆ డాక్టరూ భార్యా కలుసుకున్నారా? అది చెప్పు" అన్నది వాసంతి.

"అదేమో! నువ్వు ఊహించుకో!" అన్నది శాంత.

"ఎందుకు కలుసుకోరూ! తప్పకుండా కలుసు కుంటారు!" అన్నది అరుణ.

"ఏమో! నాకు నమ్మకం లేదు. విరిగిన మనసులు అతకవు" అన్నది వాసంతి.

"ఎందుకు అతకవు! మహచక్కగా అతుకుతాయి. చదువు పూర్తికాగానే ఆమె భర్త దగ్గరకు వెళ్ళిపోతుంది" అన్నది భానుమతి, అంతవరకుముఖానికి అడ్డం పెట్టుకున్న పత్రిక విసురుగా దూరంగా విసిరేస్తూ.

"నీకెలా తెలుసు?" అన్నది.ఆశ్చర్యపోతూ అరుణ.


"ఎందుకు తెలియదు? ఆ కథలో సావిత్రిని నేనే. నన్ను గురించే రాసింది శాంత" అన్నది బాధగా భానుమతి. శాంతకేసి చుర చుర చూస్తూ.

"ఇది మరీ బాగుంది. నీ కసలు పెళ్ళయిందనే నాకు తెలియదు." అన్నది శాంత తెల్లబోతూ.

"పరవాలేదులే రాసినా" అంటూ కొద్దిగా కోపంతో లేచి దూరంగా వెళ్ళిపోయింది భానుమతి.

చెయ్యనిదొంగతనంఅంటగట్టినమనిషిలా బాధగా మొహం పెట్టి ఊరుకుంది శాంత.

□□□



మనసు చాలని మంచి బ్రతుకు

*అంతా అయిపోయింది. ఇందాకటి వరకూ వున్న వెలుతురు, కన్నీరు - అన్నీ కూడా అయిపోయాయి. చివరికి చీకటి మిగిలింది. చీకటితో పాటు వెలుతురున్నప్పుడు * నీరు కారిపోయి ప్రస్తుతం ఎండిపోయిన కళ్ళుగల విశ్వనాథం కూడా మిగిలాడు.*

డాబామీద విశ్వనాథం. 'నేను వెర్రి వెధవ నన్న సంగతి దేవుడికూడా తెలిసిపోయిందే!' అని బాధ పడ్డాడు. అంతకు ముందు తను వెర్రి వెధవ అన్న సంగతి వాళ్లాఫీసు మేనేజరుకీ, రాధాక్రిష్ణగారికీ, మ్యునిసిపాలిటీ వాళ్ళకి మాత్రమే తెలుసుననుకొని బాధపడేవాడు. అతని బాధలోలో పలే ముసిలివాడి ప్రేమలా మనస్సుని తినేస్తోంది. ఏమైతేనేం విశ్వనాథానికి విశ్రాంతి లేకుండా పోయింది.

నిన్నరాత్రి విశ్వనాథం అందమైన భార్య సుమిత్ర, ఊళ్ళోనూ ఇంట్లోనూ కరెంటు పోయి దీపాలు ఆరిపోయి నప్పుడు, భర్తని కౌగిలించుకోబోయి వెల్లకిలా విరుచుకు పడిపోయింది. ఊళ్ళోనూ, ఇంట్లోనూ, కరెంటు వచ్చి, దీపాలు వెలిగేసరికి విశ్వనాథం పాదాల పక్కన అందమైన సుమిత్ర దేహం, దేవుడు శిల్పి జన్మ ఎత్తి చెక్కిన అందమైన ఆడశిల్పం పడుకోబెట్టిట్టు పడివుంది. వెంటనే విశ్వనాథం కంగారుగా కళ్ళ డాక్టర్ని, పళ్ళ డాక్టర్ని, ఒళ్ళు డాక్టర్ని - యింటికి అపమేఘాలమీద రప్పించాడు. ఒకరి తర్వాత ఒకరుగా ముగ్గురూ సుమిత్రని పరీక్షించారు. విశ్వనాథం - ముందు. కళ్ళ డాక్టర్ని దగ్గిరిసా పిలిచి, 'ఏమిటి?' అని అడిగాడు.

కళ్ళడాక్టరు, 'నావి బాగానే వున్నాయి.' అన్నాడు. దూరంనుంచి విని, పళ్ళడాక్టరు కూడా దగ్గిరిసావచ్చి, 'నావీ బాగానే వున్నాయి.' అన్నాడు.

'ఏవిటి?' అని మళ్ళీ అడిగేడు విశ్వనాథం.

'కళ్ళు' అన్నాడు కళ్ళజోడు సవరించుకుంటూ కళ్ళడాక్టరు.

'పళ్ళు' అన్నాడు బోసినోటితో పళ్ళడాక్టరు.

విశ్వనాథం వాళ్ళని అర్థంచేసుకుని, విజిటింగ్ ఫీజిచ్చి పంపించివేసి, 'ఒళ్ళు డాక్టర్ని' పిలిచి, 'ఏమిటి?' అని అడిగాడు.

'ఒళ్ళు బాగుండలేదు' అన్నాడు ఒళ్ళు డాక్టరు. విశ్వనాథం ఆయన్ని అర్థంచేసుకోక, "అయ్యో! మీకు శ్రమిచ్చాను. ఎంతమంచివారు! ఒళ్ళు బాగుండకపోయినా రాత్రిపూటా - శ్రమతీసుకువచ్చారు!" అన్నాడు.

ఒళ్ళు డాక్టరు ఒళ్ళంతా కుదుపుకుంటూ నవ్వబోయి, పరిస్థితికి అనుకూలమైన పని కాదని, నవ్వుని తుమ్ము రూపంలో బదిలీ చేసి, 'అదేవిటి భలేవారే - నా ఒళ్ళు కాదు, మీ ఆడవాళ్ళది' అన్నాడు.

'ఒళ్ళెందుకు బాగుండలేదు?' అనడిగాడు విశ్వనాథం.

'కరోనరీ త్రాంబోసిస్'

'అంటే?'

'అంటే గుండెనిండా రక్తం వున్నా, గుండెకు రక్తంలేకపోవడం.'

విశ్వనాథానికి అర్థంకాక, ఆత్రుతగా, 'అసలింతకీ ఏంజరిగింది?' అని అడిగాడు.

'గుండె ఆగిపోయింది - అయామ్‌సారీ! మీకిక ఆమెలేదు.' అని ఆయన వెళ్ళిపోయాడు.

వెంటనే విశ్వనాథం ఏడవటం, బాధపడటం ప్రారంభించాడు. పెళ్ళయి, సంసారానికి రెండేళ్ళయినా పాతబడకుండా ఎంతో అందమైన భార్య-ఊళ్ళోనూ, యింట్లోనూ, కరెంటుపోయి దీపాలు ఆరిపోగా, మత్తుగా తన్ను కౌగలించుకొనే వేళ హఠాత్తుగా చనిపోయిందే - అని విపరీతంగా బాధపడ్డాడు. తన్ను చేతనయిన వాడిగా గుర్తించడానికి మిగిలిన ఒక వ్యక్తి పోయాక అతనిలో ఆశ దిగజారింది. అందుకే ఏడిచాడు. నిన్నంతా యింట్లో కూర్చుని ఏడిచాడు. చివరికి యింటిమీద, ఏడుపుమీద విసుగూ, కోపం కలిగాయి. డాబాయెక్కి, ఏడుపు మానేసి నోరు మూసుక్కూర్చుని బాధ పడ్డాడు

• • •

— ఆర్నెల్లక్రితం అలా జరిగినందుకు, ఆరోనెల చివర అదేడాబా పిట్టగోడమీద, అదేబాధని ఒక్కసారి జ్ఞాపకం చేసుకున్న విశ్వనాథం - ఎదురుగా అల్లంతదూరంలో మౌనంగా కూర్చున్న రాధాక్రిష్ణగారివంక, చెమర్చిన కళ్ళతో చూశాడు.

ఊళ్ళో ఏదో పేరు తెలియని ఆఫీసులో విశ్వనాథం స్టెనోగా పనిచేస్తున్నాడు. అతనికి తండ్రి, తల్లి, ఎడమచేతి చిటికెన వ్రేలు లేదు. ఆర్నెల్లక్రితంనుండి భార్య లేదు. తండ్రివదిలిన డాబాయింట్లో ఏకాకిగా వుంటున్న అతను, యిప్పుడు పాతికేళ్ళ విడోయర్.

రాధాక్రిష్ణగారు చాలా ఆస్తిపరులు. ఆయనకూడా సొంత డాబావుంది. పైగా రెండు రైసుమిల్లులు, ఒకతల్లి, ఒకతండ్రి, ఒక భార్య, నలుగురుపిల్లలు-ఉన్నారు. అప్పట్లో ఆయన విశ్వనాథం తండ్రికి ప్రాణస్నేహితుడు. విశ్వనాథం కుటుంబానికి ఎంతో డబ్బు సహాయం చేశాడు. విశ్వనాథానికి స్టెనో ఉద్యోగం వేయించాడు. ఇలా రాధాక్రిష్ణగారు విశ్వనాథం కుటుంబానికి

కె. వివేకానందమూర్తి

ఎంతో దగ్గిరవాడూ, కావల్సినవాడూ అవడం చేత, ఆయనికి విశ్వనాథంమీద ఒకవిధమైన అజమాయిషీవుంది. పాతరోజుల్లో విశ్వనాథానికి, రాధాక్రిష్ణగారి దగ్గర భయం, భక్తీ వుండేవి. ఇటీవల ఆరెండూ కలిసి చనువుగా మారిపోయాయి.

దానిక్కారణం రాధాక్రిష్ణగారిలో వున్న ఒకే ఒక దౌర్బల్యం, ఆలోపం కారణంగా-పెళ్ళి కాక మునుపు విశ్వనాథం తప్పటడుగులు వేసేరోజుల్లో ఆయన అతన్ని పార్కు-కావల కాలువ వొడ్డునున్న ఒక కొంపలో యాదృచ్ఛికంగా కలుసుకున్నారు. ఆ కలయిక తర్వాతే ఆయన అతనికి పెళ్ళి చేయించారు.

డాబామీది ఆకాశంలో చీకటి మధ్య చుక్కలు మిణుగురుల్లా మెరుస్తున్నాయి. అతను నిశ్శబ్దాన్ని సహించలేకపోతున్నాడు. ఆయన, 'భార్యపోయి ఆర్నెల్లయినా బాధని కొంచెంకూడా మరువని ఈ వెర్రి వెధవని ఎలా సముదాయించాలి? వాడి మనస్సు ఎలా మళ్ళించాలి.' అని ఆలోచిస్తున్నారు. అతని కదలికతో ఆయన ఆలోచన తెగింది.

"ఏడుస్తున్నావా విశ్వం?"

"చాలాసేపు ఏడిచాను. ఓపిక చచ్చిపోయింది. ఇంక ఏడవలేను మేష్టారూ! అయినాఏడిచీ ఏంలాభం? సుమిత్ర అందం, సుమిత్రమళ్ళీతిరిగి వస్తాయా?అయినా ఏదో గుండెల్లో తెలియని బాధ, వెలితి. ఇక ఏడవను మేష్టారూ!" అతను చంటిపిల్లాడిలా ఏడుపు ప్రారంభించాడు. అతను ఏడుపు దాచుకోలేదు. ఆయన సముదాయించారు. ఆయన బుజ్జగింపుకి క్రమంగా అతనిలో కొంచెం స్థిరత్వం ప్రవేశించింది.

"నేనొకటి చెప్తాను వింటావా విశ్వం?"

"వినను మేష్టారూ!"

"ముందు నే చెప్పేది విను."

"తెలుసు. మీరు చెప్పబోయేది నాకు బాగా తెలుసు. నేను మరో పెళ్ళి కోలేను. చేసుకోను. నా సుమిత్ర చచ్చిపోయి, నాకు దూరమై పోయినా - రెండేళ్ళ సాహచర్యంతో గుండెల్లో నిండిన ఆప్యాయత, ప్రేమ ఇంకా నాకు దూరం కాలేదు. సుమిత్ర లాంటి వ్యక్తి నాకు మళ్ళీ దొరుకుతుందా? రెండేళ్ళ వ్యవధిలోనన్ను మగాడిగా ఎలా బ్రతకాలో చెప్పి మనిషిని చేసింది." అతను ఆగాడు. ఇప్పుడనిపిస్తోంది. ఆ నిండు తనం ఉన్నతిని తాను భరించలేదని ఇంత బలహీనుణ్ని ఆమెను ఎందుకు పెళ్లాడానా అనిపిస్తోంది.

"చూడు విశ్వం! సుమిత్రతో పెళ్ళి నీకు తెలిసే జరిగిందని తెలుసుగా-"

"ఎందుకు తెలియదు. తెలుసు. మీవల్లే జరిగింది. మీరే చేయించారు. రెండేళ్ళలో గుండె ఆగి చచ్చిపోయే:అందమైన సుమిత్రని నాకు మీరే తెచ్చి కట్టబెట్టారు."

"ఎందుకు కట్టబెట్టాల్సి వచ్చింది?"

"దానిక్కూడా మీరే కారణం. మీ లోపం వల్లే నేను మీకు పట్టుబడిపోయాను. అప్పుడు కోరికలు కూడా నన్ను చేతగానివాణ్నిగా చేశాయి. నేను చేతగానివాణ్ని. పుట్టినప్పట్నుంచీ అందరికీ లొంగిపోతున్నాను. ఆఖరికి నాకు నేనే-"

విశ్వనాథంలో బాధ వున్నంత వరకూ కన్నీళ్ళుకూడా ఉంటాయనిపిస్తుంది. అతని కంటివెంట కన్నీరు పాతచారల దారి ననుసరించి ధారావాహంగా కారుతోంది. ఉన్నట్టుండి ఆయన అన్నారు. "నాతోరా విశ్వం! బాధ విలువని చోటు చూపిస్తాను." తీవ్రమైన ఆలోచన ఫలితంలా వున్నాయి ఆ మాటలు. "పద వెళ్దాం" అని గొప్ప వ్యక్తిలా, సంస్కరణకి నడుంకట్టిన సంఘ సంస్కర్తలా లేచారు ఆయన.

విశ్వనాథం ఆయన్ని అనుసరించాడు. ఇద్దరూ డాబా దిగారు. రోడ్డుమీదకు వచ్చాక అతను అడిగాడు.

"ఎక్కడికి మేష్టారూ?"

"పార్కుకి."

ఇదా ఉపశమనం! అనుకున్నాడు. "వద్దు మేష్టారూ! పార్కంటే నాకు భయం. పార్కుకి వెడితే పిచ్చి పువ్వులు కనిపిస్తాయి. పిచ్చి పువ్వుల్ని చూస్తే నాకు మళ్ళీ సుమిత్ర జ్ఞాపకం వస్తుంది. పిచ్చి పువ్వులంటే పిచ్చెక్కిపోయేది సుమిత్ర. వద్దు నేను రాలేను."

"ఆ పార్కులో పిచ్చిమొక్కలేగాని, పిచ్చిపువ్వుల్లేవులే-పదు!" అని మందలింపు ధోరణిలో అన్నారు. పార్కువైపు దారితీశారు యిద్దరూ.

రోడ్డుమీద జనం పల్చబడుతున్నారు. రొజ్జ గాలి వీస్తోంది. కీచురాళ్ళ ధ్వని చీకటి స్థిరత్వాన్ని గుర్తు చేస్తోంది. అనుభవాన్ని పట్టుకు వదలని జ్ఞాపకాల్లా నక్షత్రాలు ఆకాశాన్ని పట్టుకు వ్రేలాడు తున్నాయి.

నగరం నడిబొడ్డునవున్న దట్టమైన పార్కులో ఎప్పుడూ తెల్లవారదు. రాత్రి ప్రపంచ మంతటా గడిపే చీకటి పగలంతా అక్కడగడుపుతుంది. పొడుగుపాటిపార్కు-కావల కాలువ పాపాన్ని మోసుకుపోయే పరీవాహంలా ప్రవహిస్తోంది. ఆయన కాలవమీద వంతెన దాటుతున్నారు. విశ్వనాథానికి పరిస్థితి అర్థమై పోయింది. మళ్ళీ రెండేళ్ళ తర్వాత ఆ ప్రదేశం తన్ను పరిచయం చేసుకుంటోంది. క్షణంలో అతని మనస్సుతన్ను కలచే మంచిజ్ఞాపకాన్ని వదలి మంచి అనుభవం కోసం తహతహలాడింది. భార్య మంచితనం, అమాయికత అతని క్షణిక నిర్ణయంలో నశించాయి. 'విశ్వం' అన్న పిలుపుతో ముందుకు కదిలి ఆయన్ని చేరాడు. అడుగుల్ని కొలుస్తూ అన్నాడు.

"ఎందుకో నవ్వొస్తోంది మేష్టారూ – రెండేళ్ళక్రితం ఇక్కడికి వచ్చినందుకు మందలించి భార్యని కట్టబెట్టారు. ఇప్పుడు మళ్ళీ భార్య కట్టువిడిపోగానే మందలింపుతో ఇక్కడికి తీసుకువస్తున్నారు. మీలాంటి మనుషులు ఉదాహరణకి దొరకరు." విశ్వనాథం నవ్వాడు. ఆయనా నవ్వేరు.

ఆ నవ్వుకి చుట్టుపక్కల కొంపల్లోని స్త్రీలు గుమ్మాల్లోకి వచ్చి హొయలు ప్రదర్శించడం మొదలుపెట్టారు తాపీకాళ్ళు ఎదురువచ్చి రాధాక్రిష్ణగారికి నమస్కరిస్తున్నారు. ఆయన ఇవేమీ పట్టించుకోలేదు. విశ్వనాధాన్ని వెంటబెట్టుకుని. తిన్నగా ఒకపాత పెంకుటి ట్లోకి బ్రిగేడియర్‌లా ప్రవేశించారు ఇద్దరూ మూలగదిలోకి వెళ్ళారు. గదిమధ్యగా ఎనభై కేండిల్ పవర్‌దీపం విజయవాడలో వ్యభిచారంలా. రాజకీయనాయకుడి మోసంలా దేదీప్యమానంగా వెలిగిపోతోంది. గదికి ఒక పక్కగా పాతమంచం వుంది. దానిమీద చింపిరవందరగా పడుకున్న పాతికేళ్ళ స్త్రీ కొత్త టేబిల్‌ఫాను గాలిలో సేద తీర్చుకుంటోంది. పమిట మంత్రిగాకమునుపు మంత్రిగారి వాగ్దానంలా. స్థిరత్వం లేక - వుండవలిసిన చోటునుండి తొలగిపోతోంది. పల్చటి తెల్లచీరెలోంచి ఆమెవొళ్ళు మెరుస్తున్నది.

రాధాక్రిష్ణగారి రాకతో ఆమె చటుక్కున లేచి, "మీరా రైసుమిల్లు బాబుగారూ!" అని వచ్చి మెడచుట్టూ చేతులువేయబోయి. విశ్వనాధాన్నిచూసి ఆగిపోయింది. అతను ఆమెని తదేకంగా చూస్తూ, అచేతనంగా నిలబడిపోయాడు. అతని మనస్సులో సుమిత్ర మెదిలింది. అవును. అంతా ఆదేపోలిక-అ ఛికిలి కళ్ళూ. మరోతలకి ఉద్రేకింపజేసే పట్టుత్న ఆ దొప్ప చెవులూ. ఆ బరువు పెదాలూ-అంతా సుమిత్రే. అతని నరాల్లో అణుశక్తి ప్రవేశించింది. చిటికెన వేలు తెగిన ఎడమ చేతిని పాంటు జేబులో దాచేసుకున్నాడు.

"పేరు పంకజం. అచ్చం నీ భార్యలా వుంది కదూ? నిన్ను స్తిమితపరచగలదని తీసుకువచ్చాను. ఇక నీకు బాధ. వెలితీ వుండదు నీబాధచూసి బాధపడే బాధ నాకు వుండదు. మరి నే వస్తాను" అని చెప్పి. పంకజానికి సౌజ్ఞచేసి రాధాక్రిష్ణగారు. కావలిసిన వాడికి సీటిప్పించమని రికమెండ్ చేసి వెళ్ళిపోయే చదువురాని వూరిపెద్దలా వెళ్ళిపోయారు. అతనికి ఆయనవెళ్ళిపోవటం తెలిసినా. తెలియనివాడల్లే నటించి-ఆమెను చూపులతో త్రాగేయడం మొదలుపెట్టాడు. తనకి యిదొక్కటి బాగా తెలుసు. అలా చూడటం అతనికి సుమిత్ర నేర్పింది

ఆమె దగ్గిరికి వచ్చి అతని మెడచుట్టూ చేతులువేసి, తన రొమ్ముల్ని అతనిగుండెల కదిమి, పెదాలకేసి ఆశగా చూసింది. అతనికి వొళ్ళంతా వేడెక్కిపోయిందిగాని, ఏం చెయ్యాలో తెలియలేదు. ఏదో వొకటి చెయ్యకపోతే బాగుండదని ఆమె దొప్ప చెవుల్ని ముట్టుకున్నాడు. క్షణం ఆగి. పంకజం పకాలున నవ్వి అతన్ని మంచం మీదికి వొయ్యారంగా తోసింది. "మీకేం చేతకాదు." అని నవ్వుతూ గోముగా అంది.

"అవును. నాకేం చేతకాదు. నీకే అన్నీ చేతొచ్చు. మొదట్లో సుమిత్రకూడా ఈ మాటే అంది. రాధాక్రిష్ణగారు ఈ మాటే అన్నారు. నువ్వుకూడా ఈ మాటే అంటు

న్నావు. అవున్లే. నాకేం చేతొచ్చని. నేను శుద్ధ అమాయకుణ్ణి. నేను ఎందుకూ పనికిరాని వెధవని – నేను చేతకానివాణ్ణని నాకు తెలియదూ? ప్రతీ నిత్యం. ప్రతీ మనిషీ నాకెందుకు గుర్తుచెయ్యాలి?" అతను పంకజంకేసి జాలిగా చూస్తూ కన్నీరు పెట్టడం ప్రారంభించాడు. ఈ కొత్త వ్యవహారంచూసి పంకజం కంగారుపడిపోయింది. అయినా అనుభవం. సాక్షీసూ కలిసి ఆమెకు కర్తవ్యం బోధించాయి. అతని పక్కకు చేరి. పమిటకొంగుతో కళ్ళు తుడుస్తూ. "తప్పండీ పాపాయిలా అలా ఏడవచ్చా? మగాళ్ళలో ఏడుపు బాగుండదు. ఏడవకండి! మీరు బాధలోవున్నారని తెలీక నోరు జారాను అనాలని అనలేదు-మీకేం! మీ కన్నీ చేతవచ్చు. మీకు చాలా తెలివుంది. అలా బాధపడకండి. అంతా మరచిపోండి. సుమిత్రనికూడా మరచిపోండి." అంది పంకజం కన్నీరు తుడిచిన పైట అలాగే వదిలేసి.

"అవును నిజంగా నేను తెలివైనవాణ్నే. అందుకే సుమిత్ర చచ్చిపోయినా. ఆమెని నీ ఛికిలి కళ్ళలో, నీ దొప్ప చెవుల్లో-చూడగల్గుతున్నాను నువ్వు చురుకైనదానివి. సుమిత్రకి యింత బాగా ఓదార్చటంరాదు." అమాయకుడు పాఠం వొప్పగించినట్టు అన్నాడతను. ఆమె వదిలిన పైటని ఏపుగా పెరిగిన రొమ్ములమీద కప్పివేస్తూ.

"సుమిత్ర మీ భార్య?"

"అర్నెల్లక్రితం వరకూ."

"పోనీలెండి. ఇకపైని ఆమెని మరచిపోండి. నేనున్నానుగా సుమిత్రకి బదులు" అని పంకజం విశ్వనాధాన్ని తనలోకి తీసుకుంది.

ఆమెకు అతని కౌగిలి 'సబిన్‌స్పెక్టరు' కౌగిలికంటె బలంగా తోచింది. అతని పెదాలు అద్వకేటు అప్పలకొండ పెదాలకంటె మైపుగా వున్నాయి. అతని వక్షం 'సినేమాల' గేటుదగ్గరుండే 'చత్తినారాయణ' ఛాతీకంటె విశాలంగావుంది. అతనిలో వేడి ఎమ్మెల్యే అవ్వకముందు 'ఎదవలా తిరిగిన గోపాలంకంటె యెక్కువగా వుంది. అతనిలో నెమ్మదిమాత్రం రాధాక్రిష్ణగారికంటె తక్కువగావుంది. ఇవన్నీ వున్న విశ్వనాథం గురించి యిలాంటి ఆలోచనలు వచ్చినందుకు మనస్సులో, ఎందుకో తనకు తెలియకుండానే. తన్ను తాను నిందించుకుంది.

కాలం గంటల్ని మింగి. రేపుకి సిద్ధమౌతోంది. చాలారాత్రి గడిచింది. 'రేపు కూడా రండి. రోజూ రండి' అనే పంకజం పిలుపులతో విశ్వనాథం వీధిని పడ్డాడు. చీకటి మరీ దట్టమయిపోతోంది - అతని మనస్సులో పంకజంమీద క్షణక్షణానికి పెరుగుతున్న ప్రేమలాగ. ఇంటికి వెళ్ళి. దాబా యెక్కి హాయిగా మేనువాల్చిన విశ్వనాథం 'రేపు రాత్రి తర్వాత పగలు వస్తేబాగుణ్ను' అనుకుని నిద్రపోయాడు.

మర్నాటినుండీ విశ్వనాథం క్రమం తప్పకుండా. కాలేజీకి చదువుకునే అమ్మాయిలా. పంకజం యింటికి రాకపోకలు సాగించాడు. అతని అమాయికత. చిత్రమైన ప్రవర్తన. వింత మొగలక్షణం ఆమెనికూడా ఆకట్టాయి. అతని పరిచయం తర్వాత ఆమె ఇతరులెవ్వరికీ వొళ్ళు వ్వలేదు. అలా చేయడానికి ఆమెకు మనస్కరించడం లేదు. అతను కనిపించని రోజున ఆమె గిలగిల్లాడి పోయే స్థితివరకూ వచ్చేసింది. ఆమె

వృత్తికి అలవాటు పడి. పాత బడిపోయినా. అతనిమీద మమతని. ఆప్యాయతని. దగ్గరితనాన్ని పెంచుకోగల్గింది. ప్రజలు నవ్వుతారని భయంగానీ - లేకపోతే ఆమె విశ్వనాథాన్ని ప్రేమించానని బాహాటంగా చెప్పుకోగలదు.

రోజులు గడిచే కొద్దీ విశ్వనాథం. పంకజం వొంటికీ. మనస్సుకీ మరింత దగ్గిరై పోసాగాడు.

ఈ విషయమంతా రాధాకృష్ణ గారికి నెమ్మదిగా అవగతమైంది. అతనిబాధని మరిపించటానికి చేసిన ప్రయత్నం ఇలాఅయిపోతుందని. యింత గ్రంథాన్ని నడిపిస్తుందని ఆయన అనుకోలేదు. ముందు యేదో విధంగా బాధ మరచిపోయేలా చేసి. అప్పైన యెవర్నో ఒకర్ని తెచ్చి అతని కిచ్చి. రెండోపెళ్ళి జరిపిద్దామని అనుకున్నాడు. కాని తన ఆలోచన మరీ దూరమై అందకుండా పోయింది 'అక్కడికి ఎరక్కపోయి తీసుకు వెళ్లాను కోతి వెధవని' అనుకున్నాడాయన అతని కుటుంబానికి తన మూలంగా చెడ్డ పేరు వస్తుందేమోనని భయపడ్డాడు. అలా భయపడగానే ఆయన అకు చెప్పులు తొడుక్కుని. హడావుడిగా అతని యింటికి వెళ్లాడు. అతను యింట్లోలేడు. అతనిలో చేతకాని తనంలాగే. డాబా ఎక్కే తనంకూడా వుందని ఆయనకి తెలుసు. డాబామీదకువచ్చి పిట్టగోడమీద కూర్చుని వంగిన మామిడి చెట్టు ఆకులు తుంచుతున్న విశ్వనాథాన్ని. 'విశ్వం!' అని పిలిచాడు. ఆ పిలుపులో భావం అతనికి తెలుసు. ముఖ్యమైన సంగతులు చెప్పేటప్పుడు ఆయన ఉద్రేకపడతాడు. అతను వెనక్కి తిరిగి పిలిచాడు: ఆయన కూర్చుంటూ అడిగారు. "ఆలోచిస్తున్నావా!"

"ఎవర్ని గురించి మేష్టారూ?"

"ఎవర్ని గురించో నాకు తెలుసు. ఆ రోజు మొదలు నీకు ఉన్నదీ. వుండేదీ ఒకే ఆలోచన అని కూడా తెలుసు". ఆయన ఆగాడు "జీవితానికి ఇన్నేళ్ళుగా అలవాటు పడికూడా నేను పెద్ద పొరపాటు చేశాను విశ్వం!"

"ఏమిటో! నాకేమీ తెలియట్లేదు మీరనే మాటలు."


"మొదట్లో పంకజాన్ని చూసినప్పుడు నాకూడా ఏమీ తెలియలేదు. జీవితం నన్ను తనవైపు తిప్పుకుని. లోకువచేసి ఒక దౌర్బల్యాన్ని నాకు అంటగట్టింది." విశ్వనాథం ఆకులు తుంచడం మానేశాడు.

"ఒక్కటి చెప్తాను వింటావా విశ్వం - పంకజాన్ని మరచిపోయి రెండో పెళ్ళి చేసుకో బ్రతుకులో మంచి అర్హత భార్యని పొందడంకోసం. స్త్రీని పొందడంకాదు. నాకు తెలిసిన సంబంధం వొకటుంది."

"వద్దు మేష్టారూ! నాకు రెండో పెళ్ళి వొద్దు నేను పంకజానికి దూరంగా వుండలేను. ఆమె లేకపోతే బ్రతకను."

"బ్రతకాలంటే ఆమెలాంటి పతితే కావాలా! లోకంలో ఎందరు తమ భార్యలతో కాపరాలు చేస్తూ హాయిగా బ్రతకట్లేదు!"

"నా దౌర్బల్యం నాకు తెలుసు. నా సంగతి వదిలెయ్. బ్రతుకులో సమస్యల



చివరికి జారిపోయాను. ముందు పెళ్ళికి సిద్ధపడు. ఆలోచించకు. పెళ్ళి విషయంలో ఆలోచన బాగుండదు" ఆయనలో ఏదో తాపత్రయం. బాధ్యత స్పష్టమౌతున్నాయి. ఉన్నట్టుండి విశ్వనాథం మాట్లాడాడు.

"నేను పంకజాన్ని పెళ్ళి చేసుకోదలిచాను మేష్టారూ!"

ఆయన ఉలిక్కిపడ్డాడు. "ఆ పతితనా? పదేళ్ళుగా ప్రజల చేతుల మధ్య నలిగి మలినమైపోయిన పంకజాన్ని. చచ్చిపోయే వరకూ నీతోకలిసి బ్రతకడానికి ఎన్నిక చేసుకుంటావా."

"ఆమె పతితకాదు ఎంతోనిండుదనంతో గర్వంతో. ఆత్మ విశ్వాసంతో సమస్యల మధ్య అలాని పేర్చుకుని బ్రతికిన ఆడది.. ఆరోజు రావాలని!! ఆమె దగ్గరికి తీసుకు వెళ్ళారు ఈ రోజు కావాలని ఆమెను దూరంగా పొమ్మంటున్నారు. ఎన్నో సార్లు నన్ను చేతకాని వాడిగా చేశారు మీరు. ఈ సారి నన్ను మార్చలేరు. ఏమైనా నేను పంకజాన్ని పెళ్ళి చేసుకుంటాను" మరో పక్కకి చూస్తూ ఉద్రేకపడి చెప్పాడు.

"విశ్వం! ఇలా చూడు. మొదటిసారిగా నీకు పనికిరానివాణ్నయ్యాను కదూ! నీ యిష్టం వచ్చినట్టు చెయ్యి. ఇన్నాళ్ళకి ఎలాగైతేనేం నామాట కాదనేటంత పెరిగిపోయావ్!" అతను పిలుస్తున్నా వినిపించుకోకుండా ఆయన ముఖం చిన్నబుచ్చుకుని మెట్లు దిగివెళ్ళిపోయారు. కానేపు ఆకాశంలో రెక్కలు విరగ్గొట్టుకున్న పక్షిలా

చలించిపోయాడు అతను. దాదాదిగి మెల్లగా నడిచి పంకజం యిల్లు చేరాడు.

ఆమె రాత్రికి సిద్ధమౌతోంది. రోజూ కంటె త్వరగా వచ్చిన అతన్ని చూసి వుత్సాహంగా యెదురువచ్చింది. వస్తూనే అన్నాడతను.

"నీతో ఒకముఖ్యమైన మాట చెప్పాలి పంకజం!"

"ఏమిటి? మీఎడమచేతికి వేలు లేదనేగా? వేలే కాదు. మీకు చెయ్యిలేకపోయినా, మీరు అప్రయోజకులైనా. మీకేం చేతగాక పోయినా మిమ్మల్ని ప్రేమిస్తాను."

"అదుగో. మళ్ళా చేతకాని వాణ్నంటు న్నావ్!"

"ఏం? ఏడుస్తారా?" నవ్వింది.

"కాదు. ఈసారి నాచేతనయిన తనాన్ని రుజావు చేస్తాను."

"ఏతవటంతోనే?"

"అదుగో అలా లేలికచేసి మాట్లాడితేనే నాకు ఏడుపొస్తుంది. ఏడుపుకాదు-కోపం - ముందు నే చెప్పేది చెప్పనియ్యి"

"చెప్పండి!"

"ఏమీ అనుకోకూడదు మరి - ఒక్క మాటడుగుతాను" అని దగ్గరగా వున్న ఆమెని మరింత దగ్గిర చేసుకుని, కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు.


"నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా? లేక వృత్తిధర్మంగానా?" ఆమె తటాలున విడిపోయి. అటువైపు తిరిగిపోయింది. "ప్రేమించడమేగా నావృత్తి. అలాగే ప్రేమిస్తున్నాను." ఆమె గొంతు వొణికింది.

"పంకజం!" - అతను చకితుడయాడు.

పంకజం బావురుమంది. ఎప్పుడూ ఏడవని పంకజం ఏడిచింది. "అవును. నేను బజారు దాన్ని. బేవార్సు సరుకుని. మీ భాషలో పతితని. నాకు ప్రేమించే అర్హతలేదు. అదేగా? మీ స్నేహంతో నేను పిచ్చిదాన్నయి పోయాను. మా మూలు అరదాన్నయి పోయాను. అయినా నావొళ్ళుమాత్రం చెకు పులిమేసుకుని. అలాగే వుండిపోయింది. అది నాలక్ష్మ. పంకజంగారూ! నేను ప్రేమిస్తున్నానంటే ఇన్నాళ్ళు లోకమే నవ్వుతుందనుకున్నా. కాని మీరుకూడా నవ్వుతున్నారు నవ్వండి. బాగా నవ్వండి. నవ్వి నవ్వి గుండె పగిలి చచ్చిపోంది. అలా చచ్చిపోతున్నప్పుడు మాత్రం ఒక్కసారి ఈ పిచ్చి పంకజం మిమ్మల్ని నిజంగా గుండెలు నిండేలా ప్రేమించిందనిమాత్రం నమ్మి మరీ ప్రాణాలు వొదలండి." వెర్రి ఆవేశంతో మాట్లాడిన పంకజం ఆయాస పడింది. "మీరిప్పుడు నిజంగాచేతనైనవారు. "కమిలిపోయిన కలువ పువ్వులావున్న ముఖాన్ని అతని వెంపు తిప్పింది. ఆమె నివ్వెరబోయింది. విశ్వనాథం మామూలుగానే ఏడుస్తున్నాడు. ఆ ఏడుపువెనక అర్థం పంకజం మనస్సుకి తెలుసు. ఆమెకోవేదన మాయమయింది. క్షణంలో సంతోషం కట్టు తెగి నవ్వు వచ్చింది. అతన్ని దగ్గరికి తీసుకుని తల్లిలా అంది.

"నిజంగా మీకు ఏడవటం బాగా చేతవవును."

"కాదు. నాకు బాగా ప్రేమించడం కూడా చేతనవును - పంకజం! - మనం పెళ్ళిచేసుకుందాం.



ఆ మాట వినగానే ఆమె చలన రహితంగా మారిపోయింది.

"ఏం? అనుమానిస్తున్నావా నన్ను? నిజం పంకజం! నేను మరెవ్వరి దగ్గరికీ వెళ్ళలేదు. నీ దగ్గరికి మాత్రమే వస్తున్నాను. నిజంగా నిన్ను పెళ్ళిచేసుకుంటాను ఈ పాడుబ్రతుకు మానేసి నాతోరా! నీ లాంటి వాళ్ళ కనుమరుగైపోయిన ఒక మంచి జీవితం మా కుటుంబాల్లో వుంది. నీ కది చూపిస్తాను. నిన్నాక ఆదర్శ భారత స్త్రీగా మలుచు కుంటాను. నా భార్యవని నలుగురితో గర్వంగా చెప్పుకుంటాను."

"కాని నేను మీ భార్యగా నలుగురితో ఎలా చెప్పుకోనేది? నలుగురి దృష్టిలో నేను చెడిపోయినదాన్ని. నాతో కలిసి ఉండటానికి సిద్ధపడిన మిమ్మల్నొక వెలివి తక్కువ మనిషిగా చూస్తారు. వద్దు పంకజంగారూ! వద్దు! ఆ బ్రతుకు నేను బ్రతకలేను. ఆ యోగ్యత. ఆ సిబ్బరం నాకు లేవు. నన్నిలాగే వుండనీయండి. మీరు యిలాగే వస్తూ వుండండి!"

"అలా అనకు పంకజం! నిన్ని విధంగా చూస్తూ నేను సహించలేను. నాకు నువ్వే కావాలి." అని ఆమెని వొళ్ళంతా కౌగిలించుకున్నాడు.

ఉన్నట్టుండి ఊళ్ళోనూ. యింట్లోనూ కరెంటు పోయింది. గదిలో దీపం ఆరిపోయింది. అతను కంగారు పడ్డాడు. సుమిత్రలా చచ్చి పోతుందేమోనని. భయంతో వణికాడు. అంతలోనే ఊళ్ళోనూ.యింట్లోనూ కరెంటు వచ్చేసింది. గదిలో దీపం వెలిగింది. పంకజం సుమిత్రలా విరుచుకుపడి పోలేదు. చచ్చిపోలేదు. పంకజం బ్రతికేవుంది. అతని మనస్సు ఆశతో రెపరెపలాడింది. మనస్సులో ప్రేమకోరిక మొగ్గ విరిచింది.

అతనిలో చేతనత్వం ప్రవేశించింది. తన్ను చేతనయినవాడిగా గుర్తించుకున్నాడు.

క్షణం తర్వాత విశ్వనాథం ధైర్యంతో, ఆత్మస్థైర్యంతో పంకజాన్ని చేతులమీదికి ఎత్తుకున్నాడు. ఇంట్లోంచి బైటికి వచ్చాడు. పంకజం విడుపుకోసం విశ్వనాథం చేతుల మధ్య విఫలంగా పెనుగులాడుతోంది. ఆ క్షణం అతనికి. ఆ ప్రదేశంచుట్టూ పాపం గూడుకట్టుకున్నట్టు అనిపించింది. అతను గంభీరంగా అడుగులు వేస్తూ. గమ్యంవేపు కదిలాడు. ఆమె చేతుల మధ్య గింజుకుంటోంది. 'విడిచిపెట్టండి. నన్ను వదలండి' అంటూ అరుస్తోంది. చేతులతో అతని బుజాలమీద కొడుతోంది. అతను నిశ్చలమైన మనస్సుతోనూ. పొత్తిళ్ళలో పంకజంతోనూ నడుస్తున్నాడు.

ఆమె చీకటి భయపడేలా వొళ్ళు విరుచుకుంటూ కేకలు వేస్తోంది. ఆమె అంగవిన్యాసంతో అతని వొళ్ళు పులకించగా పెదాలమీద చిరునవ్వు మెరుస్తోంది. ఆమె కేకలకి నిశ్శబ్దం గుండె పగిలింది.

కన్నుమూసి తెరిచేలోగా, చుట్టూవున్న కొంపల్లోంచి ఆడజనం. మగజనం వడివడిగా వచ్చి మూగారు. ఆమె పెనుగులాట మానలేదు. జనం చూస్తున్నారు. రణగొణ ధ్వనితో మాట్లాడుతున్నారు.

"గుంటమీద గొడవేనేటి ?"

"మందుకొట్టేశాడేటిగురూ ?"

"నంజికూతురు గిజగిజలాడి పోతన్నాది ఇడిచిపెట్టోశ్ !"

"అదీ యేసేసిందేమో మెడిసిను -"

ఇంతలో దూరంగావున్న కొంపలోంచి. యూనిఫారమ్ సరిచేసుకుంటూ ఇద్దరు పోలీసులు విసురుగా వచ్చారు. జనాన్ని అదిలించారు. ఇద్దర్నీ విడదీశారు.

"ఏటిగొడవ ?" అన్నాడతగాడు ఒక పోలీసు.

"ముందు స్టేషనుకి పదండి. అక్కడ చూసుకుందాం !" అన్నాడు రెండో పోలీసు.

"వెళ్ళండి ! మీకెందుకు మా సంసారం గొడవ ! మొగుడూ. పెళ్ళాలమధ్య తగూ మీరేం తీర్చనక్కర్లేదు. పొండి !" అని విసురుగా అంది - కేకలువేసి. విశ్వనాథం చేతులమధ్య గింజుకొని. నలిగి అలిసి పోయిన పంకజం.

"ఓశోప్! పంకినత్తిమతయిపోదెహో!"

"ఎవడాడు ? పంకినంజికి మొగుట్ట ! యెర్రెదవనాయాల !" అని రకరకాలుగా అనుకుంటూ, జనం కాలం వృధా చేయకుండా, ఎవరికొంపల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. వారిద్దరూ వేటినీ లెక్కచేసే స్థితిలో లేరు.

"నీ మొగుడేనేటి ?" అని మొదటి పోలీసు. రెండో పోలీసుతో వెళ్ళిపోయాడు.

విశ్వనాథం. పంకజంతో తన దాబా యింటివేపు నడిచాడు.

● ● ●

చిక్కటి వెన్నెల వూళ్ళో విద్యుద్దీపాల్ని వెక్కిరిస్తోంది. దూరాన పాత పంకజంవున్న పేట. అదే వెన్నెల్లో మకిలిగా, వెగటుగావుంది.

దాబా పిట్టగోడమీద మళ్ళీ అదే చిక్కటి వెన్నెల్లో - విశ్వనాథం. పంకజం తలవుంచి "నువ్వు నా భార్యవి!" అన్నాడు.

దాబా చివర మెట్లవద్ద ఆగిపోయిన రాధాకృష్ణగారి పాతమీసం కింద. పెదాల నడుమ భావం ఏమిటో అర్థంకాలేదు.

□□□



హాస్యబ్రహ్మ శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు

"నవ్వు అంటే ఏమిటి ?" అనే ప్రశ్న వేస్తే 'ఇహ్హి' అని ఒక నవ్వు దాఖలు చేసుకోవడం తేలికగాని, నిర్వచించడం నవ్వులాటకాదు.

అందుకే - హాస్యాన్ని సృష్టించడం చేత కాక కాబోలు 'అసలు బ్రహ్మ' అందు కోసం ఈ 'హాస్యబ్రహ్మ'ని సృష్టించాడు. మరి వీరు 'ఆది' కావలసినంత సృష్టించి, వెళ్ళిపోయారు. వారు వెళ్ళిపోయినా వారి హాస్యం తాలూకు మధురదరహాసాల దొంతరలు మన మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయాయి.

అసలు నవ్వడం అనేది మానవుడికి ప్రత్యేకంగా దఖలుపడ్డ జన్మహక్కు. కాని ఇది పుట్టుకతోనే వచ్చిందికాదు. పుట్టీ పుట్టడంతోటే ఎవరి తరిఫీదూ లేకుండానే జీవుడు నేర్చివుండేది నిండైన ఏడుపు. 'నవ్వు' అనేది తరవాత క్రమేపీ తోటి మానవుల దగ్గిర్నుంచి నేర్చుకున్న బాపతు. 'నవ్వు అంటుడు దినుసు' అవడంవల్లా, అనుకరణ సాధ్యం అవడంవల్లా పసిబాలుదికైసైతం అలవడుతుంది. అయినా కొంత మంది అమాయకులు, సుబ్బరంగా ఏడవకుండా నవ్వడం మొదలెడితే ఎదటివాళ్ళు ఏమన్నా అనుకుంటారేమోనని నవ్వడానికి తెగ మొహమాటపడుతూంటారు. ఏమిటా రోగం అంటే 'నవ్వు నాలుగువిధముల చేటు' అని అయిదో వేలుతో నోరునొక్కుకుంటారు.

'అద్బే! అదేం వీల్లేదు—' అన్నారు కామేశ్వరరావుగారు. 'అందరూ హాయిగా నవ్వవలసిందే!' అన్నాయి ఆయన మాటలు. 'నవ్వలేనివాళ్ళ వొంట్లో ఏదో జబ్బుఉంది!' అన్నాయి ఆయన కళ్ళు. దాంతో బయల్దేరాయి రకరకాల నవ్వులు. ఈవిధంగా ఎదటపడిన, పడని వాళ్ళందరూ కూడా కామేశ్వరరావుగారి పేరుచెప్పుకుని నవ్వుకునేవారు.

సదరు 'నవ్వు' శాస్త్రకారుడే చెప్పినట్టు— (స్మితం కనుబొమ లెత్తి, కళ్ళు విప్పడం). హసితం (పళ్ళు బయటపడేట్టుచేసి, పెదిమల్ని కళ్ళెం వెనక్కిలాగినట్టు ఆకర్ణాంతం పట్టిఉంచడం), విహసితం (చల్లని శబ్దం చెయ్యడం). ఉపహసితం (తల కూడా ఝాడించడం), అపహసితం (ఆనంద బాష్పాలతోసహా గోలగా నవ్వడం), అతిహసితం (విరగబడి పక్కలు పట్టుకుని, గిలగిలలాడి, మెలికలుతిరిగి దొర్లి, పెద్ద ఏడుపులోలాగా నానాఇదీఅవడం) — ఇన్ని రకాలుగా వెల్లివిరిసింది.

కొంతమంది నవ్వుతూంటే కడుపులు చెక్కలయ్యేవిట. మరికొందరు నవ్వి నవ్వి యింక నవ్వలేక చచ్చేవారుట. అలా ఖర్చయిపోయిన జనాభాకూడా 'హాస్య బ్రహ్మ' తాలూకు నవ్వుకోసం మళ్ళీ లేచికూర్చునేవారుట. మళ్ళీ మళ్ళీ నవ్వేవారుట. మళ్ళీ చచ్చేవారుట - ఎన్నిసార్లు యిల్లా జరిగినా వారి హాస్యం'లోని 'రహస్యం' ఏమిటో ఎవరికీ తెలియలేదు. కాని, కామేశ్వరరావుగారు మాత్రం ఆంధ్రులందరికీ తెలిసి నిలిచారు.

ఈ విధంగా పూరూర పేరుమ్రోగిపోయి-కీర్తిగామారి కీర్తికాంత రూపంలో బయల్దేరి 'ఫలానా కామేశ్వరరావుగారి ఇల్లు ఎక్కడ?' అని వెతుక్కుంటూ వచ్చి, వారిని వరించింది. ఇంతమంది పాఠకులకు న్యాయంచేసిన 'హాస్యబ్రహ్మ' కీర్తికాంతకి అన్యాయంచేశారు. ఆమె, ఆయన్ని వరించినంతఇదిగా, ఆయన ఆమెను వరించలేదు. 'నేను కీర్తికాంతను కదా! నన్నింత నిర్లక్ష్యం చేస్తాడేమి టీయన' అని కీర్తికాంత

గారు అప్పుడప్పుడు స్వగతంలో అనుకున్నా ఆయన్ని దినదిన ప్రవర్ధమానంగా ప్రేమించింది.

కాబట్టి ఆనందించడం విషయంలో— ఆయనకంటే ఆయన 'కాతా'లో ఆనందించినవాళ్ళ 'జమే' ఎక్కువ వుంటుంది. ఆవిధంగా మన మందరం ఆయనకి ఋణపడివున్నాం అన్నమాట.

మనల్ని యింతగా ఋణగ్రస్తుల్ని చేసిన వార్ని మనం యెలా మరిచిపోగలం? మరిచిపోలేం. కాని వారికీ సాహిత్యసేవ చెయ్యాలన్న పట్టుదల యెందుకు కలిగింది? కలిగినా ఆయన మాటలే మనల్ని యెందుకింతగా నవ్వించేస్తున్నాయి? అసలు ఇంతకీ ఆయన వ్యక్తిత్వంలో ఉన్న ఆ విశిష్టత ఏమిటి? — అని ఆలోచించడం మొదలెడితే, చివరికి 'మరే! - ఏమిటి చెప్మా?!' అని తక్కున ఆగిపోయి తెల్లబోతాం.

కామేశ్వరరావుగారు అసలు మనతెలుగు సాహిత్యంలోకి పూర్తిగా జొరబడడానికి తొందరపెట్టినవారు బొత్తిగా తెలుగురాని ఓపెద్దమనిషిగారు. 1918 లో రాజమండ్రి ఆర్ట్సు కాలేజీలో, కామేశ్వరరావుగారు విద్యార్థిదశలో వుండగా, వారి గురువుగారైన కూల్డ్రే దొరగారు క్లాసులో ఓసారి యేదో మాటమీద — "మీ ఆంధ్ర కవిత్వం ప్రత్యేక కళకాదు" అన్నారు. కామేశ్వరరావుగారు వెంటనేలేచి, "ఎందుకుకాదండీ?" అని అడిగేసరికి, "అది మీ సంగీత రాగాల్నుంచి విడివడి ప్రత్యేకత్వం సంపాదించుకోలేకపోయింది కనుక. రాగమిశ్రితం అయినప్పుడు తప్ప దానికి జన్మవున్నట్టు మీరు ఒప్పుగోరు గనుక—" అని ఇంగ్లీషులోనే కూల్డ్రే దొరగారుకూడా అన్నారు.

ఎవరో పరదేశీయుడు, మన సాహిత్యం మీద ఇలా మాట్లాడేస్తూంటే కామేశ్వరరావుగారికి ఇంతా కోపంవచ్చి, చిరునవ్వుతో, "తమ కెల్లాతెలుసు?" అని అడిగేశారు. "నేను మీ నాటకాల్లో సరేసరి, తక్కిన చోట్లకూడా, ఆఖరికి పండితుల ముఖతా కూడా-ఓ-ఓ-ఓ-అనే రాగపు హోరులోనే దాన్ని వెలువరించడం వింటున్నానుకాని, ఆ మాటల్ని యథాగమనంతో నేను వినడం లేదు" అన్నారు కూల్డ్రేదొరగారు సమాధానంగా.

"మా కవులు కవిత్వం చెప్పడానికని రాగాలు నేర్చుకోరండి - వాళ్ళల్లో చాలామందికి ఏరాగాలూ రావు" అని తెలియచెప్పారు కామేశ్వరరావుగారు.

● ఒకరినొకరు దెప్పి పొడుచుకోనడంలో ఆరితేరిన ఇద్దరు ముత్తయిదువులు కలుసుకున్నారు.

మొదటావిడ : "ఏవమ్మోయ్. మొన్న నువ్వు పేరంటానికి పిలిచావ్ గదూ? రావటం మరిచేపోయా. ఏమనుకోకు."

రెండో ఆవిడ : "సరిసరి. అవ్వాళ నువ్వు రాలేదేమిటీ? నేను సరిగ్గా చూడేలేదు."

దాంతో కూర్మనాథరగారు తమాయించు కుని, "అల్లాగా? పరమాశ్చర్యంగాఉందే! నేను అల్లా అనుకోలేదు. అదే నిజమైన పక్షంలో రచనాదృష్ట్యా మీ కవిత్వం ఒక కళే! కాని, దాని పుచ్చారణగురించి హెచ్చుతగ్గు ఏదో ఉందన్నమాట." అని ఒప్పేసుకున్నారు.

అయినా కామేశ్వరరావుగారిలో ఆవేశం ఇంకా తగ్గలేదు. కవిత్వానికి సంగీతంవల్ల జరుగుతున్న ద్రోహం తల్చుకునేసరికి ఆయనకి ఇంకా కోపం వచ్చింది.

సంగీతనటుడు నాటకపద్యాన్ని రాగిస్తూ నటించేటప్పుడు మూడుకళల దొంకలు కదుల్తాయి. పద్యానికి వుంటుండే సహజ గమనం సంగతి విస్మరించి, అన్యవ్యక్తిత్వం గల రాగం-తాను విన్నంత, తనకి తెలియ వచ్చినంత - అన్యుడై ఒప్పవలిసినవాడు తెచ్చి పద్యానికి సంధానంచెయ్యడం-అనేది ఒక సమస్య. ఈ సమస్య తేలక నటులంతా సంగీతంలో కవిత్వాన్ని హత్యచెయ్యడమే కాక-పాటగాళ్ళంతా నటులుగా చలామణీ అవుతున్న రోజులవి.

నాటకాల్లో నటుడు, తనదగ్గర బంధువు లెవరో పోయినట్టు 'పోలో' మని గుక్కపట్టి గింజుకుపోతూంటే "ఎందు కతనల్లా రాగాలు పెడుతున్నాడు!" అని కామేశ్వర రావుగారు కాస్సేపు జాలిపడినా, "పద్యాన్ని పఠించాలి తప్పితే రాగించకూడదు" అనే వాదాన్ని తెలుగు దేశంలో ప్రప్రథమంగా లేవదీశారు. '(ప్రౌఢరాగకన్య వెళ్ళి పద్య పురుషుణ్ణి కౌగలించుకోగానే, పద్యపురుషుడు గతి చెడడమే కాక, మూర్ఛపోతాడుట!')

1924 లో బందరులో నటసారస్వత సభ జరిగినప్పుడు - నటనకి చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు, సారస్వత సభకి కాశీ కృష్ణమాచార్యులుగారున్నూ అధ్యక్షత వహించారు. ఆసందర్భంలో కామేశ్వరరావు గారి వాదనకి సరైన వేదిక దొరికింది.

తమ వుపన్యాసం ప్రారంభిస్తూ కామేశ్వరరావుగారు ముందుగా భైరవిరాగం ప్రారంభించి, అయిదు నిమిషాలు అమోఘంగా ఆలపించి, ఆగిపోయి "ఇంతవరకూ నే చెప్పిన వృత్తాంతం మీకు బోధపడిందా?" అని అడిగారట. ఆహూతులంతా "అబ్బే! మీరేమి చెప్పారు!!" అని ఆశ్చర్యపోయారట. "అయితే కేవలం రాగంతోచే భావం బోధపడదు అన్నమాట!" అని తేల్చి చూపెట్టారు కామేశ్వరరావుగారు.

తరువాత తన శ్రావ్యమైన కంఠంతో "అనుంగు చెల్లెలిపై, ముకుందునకు అర్ధాంగిపై...." అని రాగ ప్రధానంగా పాడగా, అసలు ఆ పద్యంలో ఉండుకున్న భాష, భావం సభలో ప్రభావం తేలేకపోయేసరికి "కవిత్వానికి రాగం న్యాయం చేకూర్చటం లేదు!" అని అందరిచేత ఒప్పించారు.

ఆపైన "క్రుమ్మరి ఏటిల్లితిని ప్రొద్దుటి నుండి భోజనములేక...."అన్న పద్యాన్ని హెచ్చుస్థాయిలో అందుకుని "విశుద్ధ నీరమ్ములు...." అనేచోట అతి నీరసంగా అని, సొమ్మసిల్లి పడిపోగా-నిజం అనుకుని ఎవరో పరిగెట్టుకెళ్ళి నీళ్ళుతీసుకునిరాగానే, ఆయన లేచి "నీళ్ళు అక్కర్లేదు, కాని ఆ పట్టుతో అభినయం ఉండాలి!" అని చెప్పి నటనకి అభినయం ముఖ్యంకాని, రాగంతో కిక్కిరిసిన పద్యాలుకాదని రుజువుచేశారు.

గద్య పద్యాల తేడా గమనించడంలో ఆయన చెప్పినట్లు "నేను గద్య చదివేటప్పుడు ఎదటివాడు తల కదపకుండా వినడం, నా తల కదపకుండానే. నేను పద్యం చదివేటప్పుడు ఎదటివాడు తల నియమప్రకారం వూగిస్తూండడంవల్ల పద్యానికి నియమమైన నడకవున్నట్టు రుజువు కావడం మొదలైనవి...." విని అందరూ ఆయన చెప్పినది అవునని ఒప్పుకున్నారు.

ఈవిధంగా పద్యపఠనం - ముఖ్యంగా ఆంధ్ర నాటక పద్యపఠనం - గురించి ఉద్భవించిన మీమాంసల్ని కాచి వడబొయ్యడం ద్వారా కామేశ్వరరావుగారు తెలుగు సాహిత్య వ్యవసాయానికి నడుం కట్టారు. సంస్కృత, ఆంధ్రభాషలలో 'దిట్ట' అనిపించుగునేటంత పాండిత్యం సంపాదించారు. కాని సంపాదించిన పాండిత్యాన్నంతా 'మీ ఖర్మం.' అన్నట్టు భేషజంతో ప్రజల నెత్తిమీద రుద్దక, అవసరమైన సాహిత్యాన్ని పనిముట్టుగా తీసుగుని, తన సొత్తైన హాస్యరసంతో మెరుగులు పెట్టి, అపూర్వమైన హాస్యరచనలను, అమూల్యమైన ఆభరణాలుగా ఆంధ్రప్రజలకు అశేషంగా అందించారు. వారుసాహిత్య ప్రవేశం చెయ్యడానికి మూలకారణమైన

ఈ "ఆంధ్రనాటక పద్యపఠనం" అనే రచనని తనదగ్గిరే మువ్ఫయి సంవత్సరాలు అట్టిపెట్టుగుని, మూడునందల పరీక్షలకి నిలబెట్టి, ఇది అర్ధాయిష్షు వ్యవహారంకాదు, అని నిర్ణయించుగుని, పట్టుదలతో, నమ్మకంతో ప్రచురించారు ఆ పుస్తకాన్ని. ఆయన పట్టు 'భల్లూకపు పట్టు' అనడానికి యింతకన్నా నిదర్శనం ఏం కావాలి?

ఈ కోవకు చెందిందే వారు రచించిన మరోపుస్తకం "త్యాగరాజు ఆత్మవిచారం". త్యాగరాజు ఉత్తి కృతికర్తకాదు, ఉదాత్తమైన సాహిత్యవేత్త అని ఈరచన ద్వారా కామేశ్వరరావుగారు నిర్దుష్టంగా నిరూపించారు.

ఈ రెండు రచనలూ ఒకఎత్తు, కామేశ్వరరావుగారి మిగతా రచనలన్నీ ఒకఎత్తు. వాటన్నింటిలోనూ "కామేశ్వరరావుగారి హాస్యం" అడుగడుగునా చిందులాడిపోతూనే ఉంటుంది. "భారతి" పత్రికలో ఆరోజుల్లో నెలానెలాపడే కామేశ్వరరావుగారి రచనలు వారి కీర్తిని దేశవ్యాప్తంచేశాయి. ఆ రచనల్లో మరీ ముఖ్యమైనవి వారు రచించిన వ్యాసాలు. మొత్తంమీద వారు వివిధ విషయాలమీద ఏభైఏడు వ్యాసాలదాకా ప్రచురించారు. అందులో ప్రతీ ఒక్కటీ ఒక్కొక్క

● బజార్లో టవర్‌క్లాక్‌ను తుడవడానికి మునిసిపాలిటీ నౌకరు నిచ్చెనేసుకుని ఎక్కుతున్నాడు. దారేపోయే దానయ్య,

"ఏం. ఎందుకెక్కుతున్నావ్? ఏమైంది?" అని అడిగాడు. మునిసిపాలిటీవాడు దానయ్యకేసి విషపు చూపుచూసి,

"నాకు దూరపుచూపు ఆనదు, అందుకని...." అన్నాడు.

హాస్యరస భాండం. వాటిల్లో మన తెలివి తేటలు, మన కోపాలు, మన అక్కసులు మన వైషమ్యాలు, మన మనం, ఇవీ ఆయన కథావస్తువులు. ఇవన్నీ పట్టుకొచ్చి మన ముందరెట్టి మనల్నే నోరారా నవ్వించా రాయన. అటువంటి వ్యక్తి గొప్పవాడు కాదామరి!

పైపెచ్చు, కామేశ్వరరావుగారి దగ్గర శషభిషలేవీ పనికిరావు. ఏదేనా ఒకమాట పట్టారంటే దాన్ని ఎడాపెడా ఉతికి ఎండేసి, ఇస్త్రీచేసి మరీ కనుక్కుంటారు దానిసంగతి. మాటలు నమలకుండా మాటలు నిర్వచించడం కామేశ్వరరావుగారిలో ఒక ప్రత్యేకత. "అద్దె కొంపలు" అనే వ్యాసంలో ముందుగా "అద్దె" అంటే ఏమిటో ఆ సందర్భంలో ఆయన నిర్వచించారు. "ఒకరి తాలూకు కొంప మరియొకరు, ఆ ఒకరికి అసహ్యంవేసిన తక్షణం ఖాళీ చెయ్యగల పద్ధతిని తాత్కాలికంగా, అసలుకి మోసం రాకుండా వాడుకుంటూ, అట్లా కొంప వాడుకుంటున్నందుకుగాను షరతు ప్రకారం ఆ ఒకరికి (అనగా కొంప యజమానికి) నెల నెలా రొఖ్ఖంరూపేణా 'ఇంత' అని దాఖలు చెయ్యవలసిన ప్రతిఫలం వుందే, దాన్నే 'అద్దె' అంటారు, దీన్నే కొందరు 'బాడుగ' అంటారు. అనవేండి, 'అద్దె' అనడం కంటె 'బాడుగ' అనడం పాడుగాలేదు."— ఇదీ ఆయన ధోరణి. ఇల్లాగ, మాటల్నే కాదు. మాటల్ని మించిన వేదాంతాన్ని కూడా ఆయన తన హాస్యంతో అవలీలగా మచ్చిక చేసుకోగలిగారు. ఆ వ్యాసంలోనే చివరికి,"........అద్దెల ధోరణిబట్టిచూస్తే, భౌతికలోకంయొక్క అస్థిరత్వం స్ఫురణకి వస్తుంది. కొంపలేకాదు, వూళ్ళూ, జిల్లాలూ, ఈ ఇండియా, ఈ ప్రపంచమూ, యివన్నీ కూడా అద్దెవ్యాపారాలే కదా అనిపిస్తుంది. రోగంవల్లో, బెడదచేతో, అవాంతరం మూలాన్నో, కూనీద్వారానో, ఆత్మహత్య రూపంగానో, దారిద్ర్యం ధర్మమా అనో, ఏదో తరవాత మాత్రమే మానవులకి గోచరించే కారణాన్ని పురస్కరించుకుని జీవుడు శరీరం ఖాళీచేసి పోతూండడం ఆరఆరగా చూడగా, ఎవడిమట్టుకు వాడికే తెలిసేదాన్నిబట్టి జీవుడికి శరీరాలు అద్దె కొంపలు" అని పూర్తిచేశారు!

ఈ విధంగా వారి ప్రతీ రచనలో వ్యంగ్యం, హాస్యం, వేదాంతం పోటీలుపడి తొంగిచూస్తూవుంటాయి.

ఈ "అద్దె కొంపలు" వ్యాసం కేవలం తనమీదే రాశారని, అప్పట్లో కామేశ్వరరావుగారు అద్దెకున్న ఇంటియజమాని, కామేశ్వరరావుగారు వర్ణించినట్టు-

"(సుభర్త) కనపడ్డ ప్రతీవాణ్ణీ జబ్బట్టుకుని ఆపి, నిలేసి,

సుభర్త - విన్నారా?

ప్రతీవాడు-లేదండి!

సు: ఛీ! ఇంకా వినకపోడం ఏమిటి, మీ మొహం!

ప్ర: రామరామ! నాకు బొత్తిగా తెలియదండీ!

సు: తెలియకపోడం ఏమిటి, మా ఇంట్లోనున్నూ, అద్దెకుంటున్న లుచ్ఛా మామీద రాసేసి దేశదేశాల్లోనున్నూ మా కీర్తి తుడిచేశాడు.


ప్ర: ఎక్కడండీ రాస్తా?

సు: ఫలానా పత్రికలో! తెలిసిందా?

ప్ర: సరేలెండి, తెలిసింది, చదువుతాం. జబ్బవదిలిపెట్టండి.

అన్న తర్వాతనే వాళ్ళని విడుదలచేస్తూ ఈరీతిగా కొంతకాలం స్వవిషయప్రాశస్త్యం ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రచారంచేసుకుని కామేశ్వరరావుగారికి "నామీదేనర్రోయి!" అనే మరో వ్యాసం వ్రాయడానికి సమేతంగా సాయపడ్డారు! ఆ ఆంధ్రా మనుషులకి నమస్కారం అంటూ ఆ మందెయ్యడంలో కామేశ్వరరావుగారిది అందెవేసిన చేయి!

ఇవేగాక, కామేశ్వరరావుగారు హాస్యరస ప్రధానమైన అనేక కథలు, నాటకాలు, నాటికలు వ్రాశారు. అందులో 'ఎప్పుడూ ఇంతే' అనే వారి;నాటికకి, తెలుగుభాషతో కలిసి జీవించేటంత శాశ్వతత్వంఉంది. అలాగే అందులోని వారి పాత్రలుకూడా.



అందులో మనకి తటస్థపడే "పర్వతాలు, పానకాలు" పాత్రలను మనం ఎన్నటికీమరవలేం. 'పక్కవాడు బాగుపడిపోతున్నాడోయి!' అనే ఏడుపువాళ్ళ ఉమ్మడి వ్యాపారం. "మేం బాగుపడక్కర్లే, ఆ పక్కవాడు కుదిమట్టంలోకి తిరుక్షౌరమయిపోతేచాలు!" అన్నదివాళ్ళఏకైక కోరిక! ఇద్దర్లోనూ తేడా ఏమిటంటే పర్వతాలు పైకి ఏడుస్తాడు. పానకాలు శాస్త్రసంస్కారం తెలిసిన వ్యక్తి గనక లోలోపలే ఏడుస్తాడు. మనుషుల స్వార్థం, వాళ్ళ సంకుచిత మనస్తత్వాలు, లేని

గౌరవాలు ఉన్నట్టనిపించుకోడానికి వాళ్ళుపడే తహతహ ఇందులోనే మన కళ్ళకుకట్టినట్టు కనిపిస్తాయి. పొట్టలు కుట్టవలసినట్టు నవ్విస్తాయి!

హాస్యాన్ని ఇంతగా చెప్పుచేతల్లోవుంచుకోడం 'హాస్యబ్రహ్మ' ప్రత్యేకత. ఎందుకంటే హాస్యం పట్టివ్వకపోతే. అది విప్పి చెప్పి వ్యాఖ్యానం చెయ్యకుండా విసిరిన తక్షణం తప్పున పేలవలసిందే కనుక, లోటు ఎవరిదైనాసరే. అవజయంమాత్రం కారకుడే పట్లిగ్గా మోసుకోవాలి అంటారాయన.

కామేశ్వరరావుగారి రచనల్లాగే వారి ఉపన్యాసాలుకూడా తెగనవ్వించేవి. ఉపన్యాసాలు యివ్వడంలో ఆయనకి ఆయనేసాటి. అందులో ఒక విశేషం ఉండేది. కామేశ్వరరావుగారు ఇతరుల్ని యెంత నవ్వించేవారో తను అంత సీరియస్‌గా ఉండేవారు. తన మాటలు వింటూ యెదురుగుండా ఉన్న వాళ్ళు విరగబడి నవ్వేస్తూంటే ఏమీ ఎరగనట్టు చూస్తూ నిలబడేవారు! ఏమిటండీ దారుణం అని సన్నిహితులెవరేనా అడిగితే. మిఠాయిబుట్ట చేత్తో పట్టుకుని. వడ్డించేవాడు. 'అహా. ఏం బావుంది. ఏం బావుంది!' అంటూ వాడుకూడా కాస్త కాస్త నోట్లో పడేసుకుంటూ మీకు వొడ్డిస్తూంటే ఎల్లా ఉంటుంది?" అని అడిగేవారు. అదివిన్న వాళ్ళు మళ్ళీ నవ్వేవారు. మళ్ళీ ఆయన అల్లానే చూస్తూ ఉండేవారు!

అసలు. మనిషి స్వతహాగా యెప్పుడూ సీరియస్‌గా ఉండేవారు. ఆయన ముప్పై సంవత్సరాలకు పైగా రాజమండ్రిలోవున్న వీరేశలింగం హైస్కూలులో లెక్కల మాష్టరుగా పనిచేసి. అక్కడే హెడ్ మాష్టరుగా రిటైరయ్యారు. కుఱ్ఱాళ్ళతో వేళాకోళాలు చెయ్యడం, వాళ్ళని ఊళ్ళోకి పంపించి సరుకులు తెప్పించుకోడమూ ఇల్లాంటివేవీ ఆయనకు అలవాటులేదు. అంతమాత్రంచేత కుఱ్ఱాళ్ళమీద బకాసురుడిలా విరుచుకు పడిపోడమూలేదు. ఆయన తన సర్వీసులో ఏ విద్యార్థినీ 'ఒరేయి!' అని పిలవడంగాని. ఒక్క దెబ్బకొట్టడం ఎన్నడూ జరగలేదు. అసలు కిటుకంతా తీక్షణమైన ఆయన చూపుల్లో ఉందనిపిస్తుంది.

ఆయన చూపే విద్యార్థులకి ఓ సింహస్వప్నం. ఆయనమాటే ఓ కొరడాదెబ్బ. అల్లరిచేసిన కుఱ్ఱాణ్ణి ఆయన యాదాలాపంగా మందలిస్తూంటే క్లాసంతా గొల్లుమని నవ్వుతూండేవారు. సదరు కుఱ్ఱాడు మాత్రం నిలువునా నీరయిపోయేవాడు. మళ్ళీజన్మలో ఆయన క్లాసులో తలెత్తేవాడుకాదు. క్రమశిక్షణకి, వినయ విధేయతలకి ఆయన చాలా విలువ యిచ్చేవారు. అందుకే గురువుగా కూడా కామేశ్వరరావుగారు ఉత్తములనిపించుకున్నారు. ఆయన దగ్గిర చదువుకుని వెళ్ళినవాళ్ళంతా యిప్పటికీ. యెప్పటికీ ఆయన్ని ఆనందంతో. ఆప్యాయంతో. గర్వంతో. తలుచుకుంటూనే ఉంటారు. కుఱ్ఱాడు తగని అల్లరి చేసినప్పుడు వెంటనే శిక్షించవలసిందేగాని. 'నాకేం పోయిందని ఊరుకునే గురువు గురుద్రోహం కంటె యెక్కువైన శిష్యద్రోహం చేస్తున్నాడనేవారు ఆయన!

ఓసారి వారు క్లాసులో పాఠం చెబుతూండగా-కిటికీదగ్గర మూలగా కూర్చున్న ఓ అబ్బాయి కిటికీలో పడుతున్న ఎండలో. రహస్యంగా అద్దంపెట్టి. ఆ సూర్యకిరణాల్ని అడ్డంకొట్టి అమ్మాయిల ముఖాలమీద పడేట్టు చేతులోవున్న అద్దాన్ని ఆడిస్తున్నాడు. అబ్బాయి ఆ కళలో చాలానేర్పున్నవాడు. చాలామంది మేష్టర్లకు కళ్ళుకప్పి తనవిద్యాకౌశలాన్ని ఈ విధంగా ప్రదర్శించడం అతని ప్రత్యేక ప్రజ్ఞ. ఎవరికీ దొరికేవాడు కాదు. ఆడపిల్లల్ని నానాయాతనా పెడుతూండేవాడు. ఆవేళ కామేశ్వరరావుగారి క్లాసులోకూడా ప్రయత్నించాడు. చూసీచూడనట్టుకామేశ్వరరావుగారు వెంటనే ఆసంగతి పసిగట్టి. గభుక్కుని అతన్ని సుంచోమని. "ఏమోయి! ఆ అస్త్రం ఇల్లా యియ్యి!" అన్నారు.

"ఏ అస్త్రమండీ?" అన్నాడబ్బాయి అమాయకంగా.

"నీదగ్గిరున్న ఆ లంబాడీ అద్దం!"

"నాకేం తెలీదండీ!-" బుకాయించాడు. ఆ అబ్బాయి.

కామేశ్వరరావుగారు జాలిగా చూస్తూ. "అరెరె! అంతవరకూ వచ్చిందీ? ఇదివరకు కాస్త కాస్త తెలుస్తూండేది పాపం!- నువ్విల్లా అశ్రద్ధచేస్తే లాభంలేదు. పెంద్రాళే ఏ డాక్టరు దగ్గిరకేనా వెడితే మంచిది. తనేం చేస్తున్నాడో ;తనకి తెలియకపోడం మరీ దారుణమయిన జబ్బు. మూర్ఛరోగం లాంటిది!" అన్నారు.

"నాకే జబ్బూ లేదండి!-" అన్నాడబ్బాయి. తెగవుడుకుమోత్తనంతో.

"నీకు తెలియదు నాయనా! ఇదికూడా జబ్బులక్షణమే!" అని వారు అతనిప్రక్కన కూచున్న కుఱ్ఱాడితో "అతని వెనకాల గుప్పిట్లో అద్దంముక్క ఉంటుంది చూడు!" అని పురమాయించారు. ఆ అబ్బాయి చూసి ఉందని చెప్పాడు. వెంటనే అయన "చూశారా! అయినా అతనికి తెలియదు పాపం. అదోరకమైన జబ్బు. అతన్తో జాగ్రత్తగా ఉండడంమంచిది. మీరు ఏమరుపాటుగా ఉన్నారంటే మీ పెన్ను. మీ పుస్తకాలు. మీ చొక్కాలు. అప్పుడప్పుడు మీ ప్రాణాలు పుచ్చుకుని మరిచిపోయిచక్కాపోతూంటాడు. అతని కళ్ళుచూశారా? ఉత్త జబ్బుకళ్ళు! ఎందుకేనా మంచిది మీరంతా ఖాళీచేసి దూరంగా కూచోండి! లేకపోతే మరిచిపోయి ఆ అద్దమెట్టి మిమ్మల్ని బరికినా బరుకుతాడు" ఇల్లా ఆయన అంటూంటే మిగతా కుఱ్ఱాళ్ళంతా ఆ కుఱ్ఱాణ్ణి కొత్తగా ఎలుగ్గొడ్డుని చూసినట్లు చూడ్డం మొదలెట్టారు. ఆ అబ్బాయికళ్ళు వేడివేడినీళ్ళల్లో ఈదడం మొదలెట్టాయి.

"ఇంత అవమానం జరిగిన తర్వాత ఎందుకీ క్లాసులో యింకా వుండడం" అని ఆలోచించి. "వుండుటయా? వూడుటయా?" (టు బి అర్ నాట్ టు బి-కి తెలుగు అనువాదం) అని బుర్రగోక్కుని చివరికి అమాంతం క్లాసులోంచి యెక్కడికో చక్కాపోయాడు. ఇందులో మరోచిక్కేమి వచ్చిందంటే ఆ అబ్బాయి సాక్షాత్తూ కామేశ్వరరావుగారి బావమరిది. (ఇప్పుడు ఆయన కూడా మాష్టరుగారే!) కాని శిక్ష దగ్గిరకి వచ్చేసరికి వారికి స్వపరభేదాలు కనిపించేవి కాదు. అయినా ఆయనస్కూలునుంచి తిరిగి వచ్చేసరికి. వాళ్ళమామగారు విచారంగా కూర్చుని కోపంగా కనిపించారు!

"మావాడ్ని స్కూల్లో పట్లిగ్గా క్లాసులో మీరేదో అవమానించారుట అది భరించలేక కుఱ్ఱకుంక ఒక్కడూ ఎక్కడికో లేచిపో

యాడు. ఇందాకణ్ణుంచి గోదావరిగట్టూ, ఊళ్ళోఉన్న నూతులూ వెతికాను. వాడు కనపడలేదు. ఏమయ్యాడో ఏమిటో! మీరు మరీ అంతగట్టిగాకూకలెయ్యకుండా ఉండవలసింది!" అని అల్లుడిమీద నిందమోపారు ఆ మామగారు.

ఆ నింద పోవడానికి కామేశ్వరరావుగారు (శమంతకమణికోసం శ్రీకృష్ణుడు వెళ్ళినట్లు) వెంటనే బయల్దేరి, ఊరంతా తిరిగి ఆచూకీ తీసి, పొరుగూర్లో చుట్టాలింటో దాక్కున్న ఆ అబ్బాయిని తెచ్చి మామగారికి అప్పజెప్పి, రెండుచేతులూ జోడించి నమస్కరించి, "మామగారూ!" అన్నారు.

"ఏమండీ?"

"మీ సుపుత్రుణ్ణి ఆ స్కూల్లోంచి తీసేసి మరో స్కూల్లో జేర్పించండి. లేకపోతే నాకు నేనే తీసేసుకుని మరోచోటికి పోతాను!"

మామగారికి పెద్దకొబ్బరిబొండాం కంఠంలో చిక్కుకున్నంత పని అయింది. కామేశ్వరరావుగారిమాటకి తిరుగులేదని ఆయనకి తెలుసుగనక, తప్పనిసరిగా ఆ బొండాన్ని మింగేసి, అల్లానేవెళ్ళి అబ్బాయిని మరోచోట జేర్పించారు!

కాని కామేశ్వరరావుగారు పైకి ఎంత సీరియస్‌గాఉన్నా, ఆయన హృదయం చాలా సున్నితమైందీ, ఎంతో విశాలమైనదీ కూడాను. చదువు బాగావస్తున్నా డబ్బులేక ఇబ్బందిపడిపోతున్న బీద విద్యార్థులకి గుప్తంగా తనకి శక్తిఉన్నంతవరకూ జీతాలు కడుతూండేవారు. వారాలుకూడా ఏర్పాటు చేస్తూ ఉండేవారు. "ఏమిటండీ మీకీ పక్షపాతం?" అని సన్నిహితులెవరేనాఛలోక్తిగా అడిగితే, "వాళ్ళ ఇబ్బందులు యెంత బరువైనవో నాకు బాగా తెలుసు. నేనూ అల్లా చదువుకు వచ్చినవాణ్ణే. భగవంతుడు ప్రసాదించిన ఈశక్తితో అటువంటివాళ్ళకి నలుగురికి సహాయం చెయ్యడం కంటె భగవంతుడికి కృతజ్ఞత చెప్పుకునే మార్గం మరోటి ఏముంది?" అనేవారట. కామేశ్వరరావుగారి తండ్రిగారిపేరు నరసావధానులుగారు. ఆయన మంచి వేదపండితులు. తల్లి పేరు లచ్చమ్మగారు. వారికి ఈయన ఒక్కరే కుమారుడు, అదేనా అయిదుగురు ఆడపిల్లల తర్వాత. వాళ్ళ పెళ్ళిళ్ళగురించి ఆస్తిలో చాలాభాగం ఖర్చయిపోయిన తర్వాత, ఇంక పుత్రసంతానయోగం లేదని నిరాశ చెందిన తర్వాత, "ఏమిటీ అర్థంలేని తర్వాతలు?" అంటూ పుట్టారు కామేశ్వరరావుగారు. ఆయన జన్మస్థలం భీమవరం తాలూకాలోని ఆకివీడు గ్రామం. మొట్టమొదటకొడుక్కి వేదంచెప్పిద్దాం అనుకున్న నరసావధాన్లుగారు, భార్య పట్టుదలమీద హైస్కూలు చదువుకి కొడుకుని ఏలూరు పంపించారు. కామేశ్వరరావుగారు బంధువుల ఇంట్లోవుండి, స్కాలర్‌షిప్పుమీద చదువుకుని స్కూలుఫైనలుమాత్రం నరసాపురంలో పూర్తిచేశారు. ఎఫ్. ఏ. చదవాలని అభిలాష బాగావుంది. తండ్రిదగ్గిర స్తోమతు లేదని తెలుసు. అయినా సరే పట్టుదలతో చదవాలని నిశ్చయించుకుని తండ్రితో చెప్పారట ఆవిషయం.

"ఏమిటది?" అన్నార్ట నరసావధానులుగారు.

"ఎఫ్. ఏ. అని పైచదువు."

"ఎక్కడ చదవాలి?"

"కాకినాడలో"

"ఎన్నేళ్ళు?"

"రెండేళ్ళు!"

"చదవాలని కోరికగాఉందా?"

"అవున్నాన్నా!"

"అయితే ఉండు!" అని ఆ ముసలాయన (అప్పటికే ఆయనకి డెబ్భైఏళ్ళు) ఇంట్లోకివెళ్ళి నిచ్చెనవేసుకుని, అటకెక్కి తన కావిడపెట్టెలో దాచుకున్న సొమ్మంతా పట్టుకొచ్చి కొడుకుచేతుల్లోపోసి, వెళ్ళి జాగ్రత్తగా చదువుకోమన్నార్ట, చెమ్మగిలిన కళ్ళతో కొడుకుని ఆప్యాయంగా చూసుకుంటూ. ఆ సొమ్ము మొత్తం పన్నెండు రూపాయల ఏడణాలు!! తండ్రిహృదయం, స్తోమతు కొడుక్కి తెలుసు. కొడుకు కోరిక, పట్టుదల తండ్రికి తెలుసు. అదే లక్ష రూపాయలన్నట్టు కామేశ్వరరావుగారు ఎగిరి గంతేసి, కాకినాడవెళ్ళి ఎఫ్. ఏ. రెండేళ్ళూ చదివి పేసయ్యారు. ఎల్లాఉన్నారో, ఎల్లా చదివారో బహుశా భగవంతుడికికూడా చెప్పలేదేమో కామేశ్వరరావుగారు. ఆ తరవాత రాజమండ్రిలో బి. ఏ. చదివారు. అదీ తమాషాగానే జరిగిందట. ఆ రోజుల్లో రాజమండ్రిలో గయోపాఖ్యానం నాటకం పోటీలు జరిగాయి. ఆ పోటీలవల్ల వచ్చిన ఆదాయంతో అర్హుడైన ఒక విద్యార్థిని బి. ఎ. పూర్తిగా చదివించడానికి నిర్ణయించారు ఆ సంఘ కార్యకర్తలు. పోటీలు అయ్యాయి. డబ్బు మిగిలింది. ఆ డబ్బు ఎవరికివ్వాలో పరిష్కరించమని రాజమండ్రిలోని ఒక ప్లీడరుగారికి అప్పజెప్పారు. మొత్తం ముప్ఫయిపైగా అప్లికేషన్లు వచ్చాయి. ఆ ప్లీడరుగారు వాళ్ళందర్నీ తన ఇంటికి ఓనాడు సాయంత్రం రమ్మనిపిలిచి, అందర్నీ పరీక్షగాచూసి మర్నాడు ఉదయం అయిదుగంటలకి మళ్ళీ రమ్మన్నార్ట! అసలుసూర్యోదయం ఎరగనివాళ్ళు అలవాటు ప్రకారం పడుకునేఉండిపోయారు. ఓ పాతిక మందిమాత్రం లేచి చక్కా వచ్చారు. వాళ్ళలో మొహాలు కడుక్కోకుండానూ స్నానం చెయ్యకుండాను వచ్చిన ఓ పది పదిహేను మందిని ఇంక రానక్కర్లేదని పంపించేసి, మిగతావాళ్ళని ఎనిమిది గంటల దాకా ఊరికే కూచోపెట్టి, మళ్ళీ మర్నాడు ఉదయం అయిదు గంటలకి సరిగ్గా రమ్మని పంపించేశారట. అసలే అది మాంఛి శీతాకాలం. ఒక్కరోజు చలిలోస్నానం చెయ్యడానికే బాధగా ఉండేది. దానికి సాయం ఇల్లా ఒక్కవారం రోజులు జరిగేటప్పటికి విసుగెత్తి కొందరు, వొళ్ళు మండి కొందరు, నువ్విచ్చేదేమిటని కొందరు, అసలు యిది యిచ్చే వ్యవహారం కాదని కొందరూ తగ్గితగ్గి, చివరికి, ఇద్దరు మిగిలారు. ఇద్దర్నీ కూచోపెట్టి వాళ్ళస్థితిగతులు, వాళ్ళ చరిత్రలూ కనుక్కున్నారట ఆ ప్లీడరుగారు. కనుక్కుని, ఆ యిద్దర్లో ఎఫ్. ఏ. లో ఎవరికి యెక్కువ మార్కులు వచ్చాయో వాళ్ళకిచ్చేశారట, ఆ స్కాలర్‌షిప్పు. ఆవిధంగా ఆ స్కాలర్‌షిప్పు పొందిన విద్యార్థే మన కామేశ్వరరావుగారు. ఆయన బి. ఏ., చదువు, బి. ఇడి., చదువు, వివాహం అన్నీ రాజమండ్రిలోనే జరిగాయి. ఆ తరవాత కొన్నాళ్ళకి ఉద్యోగంకూడా అక్కడే వీరేశలింగం హైస్కూలులో దొరికింది. ఏ వెనకబలమూ

ఆసరాలేకుండా కేవలం స్వశక్తితో పైకి వచ్చి ఫలానా అనిపించుకున్న పెద్దలలో కామేశ్వరరావుగారు ఒకరు.

ఓసారి కామేశ్వరరావుగారూ, వారబ్బాయీ కలిసి అల్లా వీధిలోకి బయల్దేరారు. అబ్బాయి రిక్షాకేసి, "ఎక్కండి-నాన్నా!-" అన్నాడు. ఉండమని, కామేశ్వరరావుగారు, రిక్షావాడికేసి తిరిగి, "ఏమోయి! రాజమండ్రీ స్టేషనుకి యెంత?" అనగానే వాడునవ్వి," "మామూలేనండి! అబ్బాయిగారికి తెలుసు, తమ రెక్కండి!" అని ఆహ్వానించాడు. "మామూలుకాదు. నాకుతెలియదు. ఎంత?" అనిఆయన రొక్కించేటప్పటికివాడు కొంచెం తెల్లబోయి, "పావలాండి!" అనగా ఈయన "మూడణాలు!" అన్నారట.

"అబ్బాయిగారు ఎప్పుడూ పావలాయే ఇత్తారండి!" అని వాడు చనువుగానవ్వాడు.

"వాడు యివ్వడానికేం? వాళ్ళనాన్న ఏదో రెండుడబ్బులు గడించాడు. వాడు యిస్తాడు. మానాన్న మరీబీదవాడు. అంచేత నేను మూడణాలే యిస్తాను. ఇష్టమయితే కట్టు!" అని రెండడుగులు ముందుకి నడిచేటప్పటికి, ఆ రిక్షావాడు మతోయినట్టుచూసి, తలగోక్కుని సరేరండని బక్కావచ్చాట్ట. ఇల్లా ఆయన మందలింపులుపైకి ఏదో మార్దవంగా కనపడినా, ఎడాపెడాకూడా తగిలిన మనుషుల్ని తబలావాయించి వొదిలిపెట్టేవి. కామేశ్వరరావుగారికి అతనొక్కడే కుమారుడు. అంత పండితుడికి పుత్రుడుగా జన్మించిన ఆయన పెద్దలమాటప్రకారం మాంఛి పండిత పుత్రుడిగా తయారవక వాళ్ళమాట కొట్టేసి, రచనకి పూనుకుని అనతికాలంలోనే "దృశ్యకావ్య ధురీణు" డనిపించుకున్నాడు. ఇది అసాధారణమైన విశేషమే. కాని మొదట్లో వాళ్ళబ్బాయి రచనలు చేస్తున్నాడని ఆయనతో ఎవరేనా ఫిర్యాదుచేస్తే, "మరేటండి! వాడికి ఇంగ్లీషు రాదు. తెలుగు బొత్తిగా తెలియదు. పైగా ఇప్పటికే బోల్డు దిక్కుమాలిన రచనలు వచ్చాయి. మళ్ళీ నువ్వెందుకురా ప్రత్యేకంగా కష్టపడటం అంటే వినిపించుకోడు!" అనేవార్ట.

1958 లో షష్టిపూర్తయిన సంవత్సరం తిరక్కుండానే కామేశ్వరరావుగారికి తగని జబ్బుచేసింది. విశాఖపట్నం ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అది లింఫోసార్కోమా అనే జబ్బుఅనీ, దానికి కారణం మందూ కూడా లేవనీ డాక్టర్లు నమ్మకంగా చెప్పార్ట! తాత్కాలిక ఉపశమనానికి వైద్యం జరుగుతోంది. ఆయన క్రమేపీ క్షీణిస్తున్నారు. అయినప్పటికీ ఆయన హాస్యపు చెణుకులు, విసుర్లు మాత్రం ఎంతమాత్రమూ క్షీణించలేదు. ఆ సంవత్సరం వారి అబ్బాయి రాధాకృష్ణ వ్రాసిన నాటికకి గుడివాడలో జరిగిన ఆంధ్రనాటక కళాపరిషత్తులో ఉత్తమ రచన బహుమతి వచ్చింది. తండ్రికి సేవచేస్తూ తండ్రిదగ్గిరే ఉండిపోయిన రాధాకృష్ణకి ఈ విషయం డాక్టరు తోలేటి కనకరాజుగారు టెలిగ్రాంద్వారా తెలియజేశార్ట. రాధాకృష్ణ ఎంతో ఉత్సాహంతో ఆ టెలిగ్రాం అందుకుని తండ్రిదగ్గరకివెళ్ళి "చూశావా నాన్నా? నా నాటికకి పరిషత్తులో ప్రైజువచ్చింది!" అనగానే అదివిని కామేశ్వరరావుగారు జాలిగా చూసి "హూ! అల్లా ఉన్నాయన్నమాట మిగతా నాటికలు!" అని చప్పరించేటప్పటికి, గోడకొట్టిన మేకులా నిలబడి



పోయారట రాధాకృష్ణ. ఈవిధంగా చివరి క్షణంవరకూకూడా హాస్యం నాట్యంచేస్తూనే ఉంది కామేశ్వరరావుగారి పెదవులమీద. 'హాస్యం అంటే కామేశ్వరరావుగారు. కామేశ్వరరావుగారంటేనే హాస్యం' అనిపించుకున్న సార్థకజీవి ఆయన.

శ్రీ మధునాపంతుల సత్యన్నారాయణ శాస్త్రిగారు, తమ "ఆంధ్రకవుల చరిత్రలో పేర్కొన్నట్టు, "కామేశ్వరరావుగారి రచన వినీవినగానే భాష మొదట నవ్వించును, భావము పిదప కవ్వించును." కామేశ్వరరావుగారిని తెలుగుదేశం అనేకసార్లు సన్మానించింది. వారి అసమాన అద్వితీయ హాస్యసృష్టికి జోహార్లర్పిస్తూ, కీ॥ శే॥ శ్రీ జయపూర్ మహారాజావారు రాజమహేంద్రవరంలో కామేశ్వరరావుగారికి, "హాస్యబ్రహ్మ" బిరుదు ప్రదానం చేశారు.


సన్మానం జరిగిందని సంబరంతోగాని, ఏదైనా అన్యాయం జరిగితే దాన్నిగురించిన విచారంతోగాని కామేశ్వరరావుగారెప్పుడూ కాలం వృధాచేసుగోలేదు.

మామూలుగా గెడ్డాలుగీసే మంగలి వెంకడు నాటకంలో సేనాధిపతివేషంవేసి, ప్రేక్షకుల్లో మొదటి వరసలో కూర్చున్న తలమాసిన విడోగారికి అలవాటుకొద్దీ "హారలోంచి కత్తిదూసి, గుండుచెయ్యబోయిన దృశ్యం ఊహించుకుని, వారెంత తేలికగా చిరునవ్వు నవ్వుకునేవారో-ముప్పయిమూడేళ్ల తనచేత సేవచేయించుకుని, రిటైరయి వెళ్ళిపోయే సందర్భంలో వీరేశలింగంఉన్నతపాఠశాలకు చెందిన కొందరు పెద్దలు కనీసం వీడ్కోలు సభకూడా ఏర్పాటు చేయబడకుండా చూసినప్పుడుకూడా అలాగే తేలిగ్గా "చిరునవ్వు నవ్వుకున్నారు. వారి నవ్వువెనుక వున్న వేదాంతాన్ని అర్థంచేసుకోలేక వారి మంచితనాన్ని లోకువకట్టినపుడుకూడా వారేమీ బాధపడలేదు. కాని-అటువంటి సహృదయులులేని "లోటు"తో మనం ఇప్పుడు బాధపడుతున్నాం. భౌతికంగా వారు మనల్ని వీడి ఇప్పటికి అయిదుసంవత్సరాలయినా వారి జ్ఞాపకాలు నిన్నటి, మొన్నటివి లాగా మన మనసుల్లో నిలిచిపోడానికి వారి మంచితనమే కారణం. వారి రచనలు చిరస్థాయిగా ఉండడానికి వారి మంచి హాస్యమే కారణం.

తన అరవై వొక్కేళ్ళ జీవితంలో వారు వ్రాసిన అసంఖ్యాక, అమూల్య రచనల జాబితా యివ్వడం యిక్కడ సాధ్యపడేది కాదు. వ్యాసాలు, విమర్శలు, ప్రశంసలు, నాటికలు, నాటకాలు, వ్యంగ్యరచనలు, సంభాషణలు, ధోరణులు, వాదనలు, అనువాదాలు చాలా వున్నాయి. అవన్నీ మధురంగా మనసుల్లోనే ఉండిపోతాయి. అందుకని కామేశ్వరరావుగారి మధుర స్మృతులని ఒక్కసారి మళ్ళీ తలచుకోవడం మన కర్తవ్యం. మళ్ళీ ఒక్కసారి మనసూర్తిగా నవ్వుకోవడం మనహక్కు. ఆంధ్రుడినని చెప్పుగునే ప్రతీవ్యక్తి "ఫలానా భమిడిపాటి కామేశ్వరరావుగారుమావాడే" అనిచెప్పుకుని మరొక్కసారి గర్వించవచ్చు. □□□

— తంబు

కంపార్టుమెంటాలిటీ



రావికొండలరావు

ఒకానొక మూడోతరగతి రైలుపెట్టె. పాత పత్రికలు ఇంటినిండా ఎక్కువయిపోతే, అలమారులో కుక్కేయగా, అలమారుసొంపు ఎంతతీరుగా వుంటుందో అంతకన్న అధ్వాన్నంగా వుంది ఆ పెట్టె. చెత్త వూడ్చని మునిసిపాలిటీరోడ్డూ, రైల్వే ప్లాట్‌ఫారం ప్రక్కనే వుండే "హెచ్చుతరగతి ప్రయాణీకులు కూర్చుండు గదీ" వర్షాకాలంలో హోటలు వాళ్ళ వంటగదీ,-వంటివి ఏవీకూడా ఈ రైలుపెట్టెతో సరితూగిలేవు!

అతి బరువుగా వున్న రైలుపెట్టె కాళ్ళీడ్చుకుంటూ "నడచి" నీరసంగా ఆగింది. అదో స్టేషను. అంతుకని పెట్టెలో త్రొక్కిడి అధికమయింది. అందులో ఎంత మంది కూర్చోవాలో రాసివుందిగాని - ఎంతమంది నించోవాలో రాసిలేదు. అందుకని, వీలున్నంతమంది - లేదా, వీల్లేనంతమంది. ఒంటికాళ్ళమీదా. బొటన వేళ్ళమీదా. కొందరు మోకాళ్ళమీదా మరికొందరు మో:చేతులమీదా నుంచున్నారు. కొందరు పెట్టెలమీద నించుంటే, మరికొందరు వాళ్ళమీదే నించున్నారు. ఇది ఇట్లావుండగా-సామాన్లు పెట్టుకోవలసిన పై 'అర'లమీద - వున్న రెండుకాళ్లూ నాలుగుగా భావించుకుని అరుమైళ్ళ పొడుగున నిటారుగా చాచుకొని పడుకున్న వాళ్లూ వున్నారు. వీళ్ళల్లో కొందరు గురకపెట్టి నిద్రపోతూ వుండగా

మరికొందరు పత్రికా పఠనం ప్లస్ ధూమపానం, ఇంకొకాయన అపరాధ పరిశోధక నవలా ప్లస్ పొడుగుపాటి చుట్ట పానంచేస్తున్నారు. పెళ్ళిలో వంటవాని గాడిపొయ్యినుంచి వచ్చే పొగలాగా బండినిండా పొగ. మూడు నాలుగు ఫాన్లువున్నట్టున్నాయి. ఒకటి తిరుగుతూదానిచిత్తమొచ్చినరీతి ప్రవర్తిస్తున్నది. మరోటి హాయిగా ఆగి కూచుంది. పెద్దగా రొదచేస్తూ మిగిలినవి తిరుగుతున్నాయి. ఇందులో రెండు పైవారి భుక్తం. మిగిలిన ఒక్కటీ ప్రయాణీకుల సౌకర్యముకొరకు.

ఆపెట్టెలో ముసలివాళ్ళూ, పిన్నవాళ్ళూ, చిన్నపిల్లలూ, స్త్రీలూ, విద్యార్థులూ, వ్యాపారులూ, 'అక్కడే' వర్తకులూ, బిచ్చగాళ్ళూ ఉద్యోగులూ, నిరుద్యోగులూ వాళ్లూ వీళ్లూ అన్నిరకాలవాళ్లూ వున్నారు - ఒక దేశానికి మచ్చుతునకలాగా, ప్రతినిధిలాగా - నించున్నది ఆపెట్టె!

బండి ఆగీ ఆగగానే, ఆ స్టేషన్‌లో దిగవలసినవాళ్ళు ముందున్నవాళ్ళ భుజాలమీద నుంచి తలకాయమీదనుంచీ నడిచిపోతూ, ఆవెనకనే సామాన్లు బరబరాలాగేస్తూ దిగే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయత్నానికి అభిముఖంగా అదేవిధంగాలోపలకు ఎక్కే ప్రయత్నమూ చేస్తున్నారు. అట్నుంచి కొందరు. వాళ్ళు యెక్కరు - వీళ్ళు దిగరు. వీళ్ళూ వాళ్ళూ మధ్యలో ఢీకొట్టుకుని-కొట్టుకొనే పర్యంతం అయింది. "దిగనీవయ్యా, ఎక్కుదువుగాని - దిగనీ" అని అరున్నర క్రుతిలో కండువా సరిచేసుకొంటూ, మరోచేత్తో పెట్టి లాక్కుంటూ అరుస్తున్నాడు ఒక ఆసామీ.

"నువ్వుదిగేదేంది. వుండవయ్యా నన్నెక్కనీ. బండి బయల్దేరతంది" అని అవతలవాడు.

"నన్నొక్కణ్ణెని ఎక్కనీండి బాబూ. ఆడదాన్ని. బాబూ"

ఈ దిగేవాడు దిగకుండా "నువ్వు ఆడవాళ్ళ పెట్టెకు పో అమ్మా" అని సలహా యిస్తున్నాడు, ఉచితంగా తొందరగా.

"అక్కడ సోటులేదు బాబూ"

"ఇక్కడుండి చచ్చిందింత !"

దిగేవాళ్ళు దిగడంలేదు. ఆ స్టేషన్‌లో బండి మూడు నిముషాలకంటె ఎక్కువసేపు ఆగదు. తను ఎంత ఆలస్యంగా వచ్చినా, ఎంత నెమ్మదిగా నడిచినా తప్పులేదుగాని - స్టేషన్‌లో ఆగే వ్యవధి మాత్రం విధిగా పాటించి తీరాల్సిందే అంటుంది రైలు. ఇష్టంవస్తే ఈ రూలు సడలడానికి కూడా అభ్యంతరంలేదు, ఎక్కేవాళ్ళు సామాన్లు లోపలకు విసిరేస్తున్నారు, ఒకడు సామాన్లు ఎక్కించమని రైల్వే పోర్టరుమీద కేకలు వేస్తున్నాడు. "మీరు ఎక్కండి బాబూ" అంటాడువాడు.

"నువ్వు సామాను ఎక్కించవయ్యా స్వామీ. నా ఎక్కడం ఎంతసేపు! తీరా నేనెక్కి నువ్వు సామాను పెట్టక పోతే ...తొయ్యకండి"

"బాబూ, నేనూ ఎక్కవలసిన వాడినే"

"బాబూగారూ, ఈ మూట అందుకోండి ఆడదాన్ని" అని కిందనుంచి ఆమె అరుస్తున్నది.

బర్తుమీదవున్న చుట్ట తాగుడాయన సావకాశంగాతలతిప్పి - "ఇదే స్టేషనండీ." అని గొణుక్కున్నాడు.

"రైల్వేస్టేషను" అని ఒక యువకుడు జోకు విసిరాడు. వళ్ళుమండి "ఏవూరండీ ఇదీ?" అనిఅతనే ఎక్కుదామనుకొంటున్న

వాళ్ళను మూడు నాలుగుసార్లు అ డి గి, కోపంవచ్చి ఘాటుగా దమ్ములాగి బుస్సెడు పొగవదిలాడు!

"ఈస్టేషన్‌లో కాఫీ దొరికేట్టులేదు" ఇంతే ఈ రైలు వాళ్లు" అని ఒ క డు కోప్పడ్డాడు నెమ్మదిగానే లేచికూచుని.

దిగేవాడొకడు, కోపంవచ్చి పెట్టె బర్రు మని లాగాడు. అక్కడే సగంకూచున్న చిన్నపిల్ల "అమ్మో - నా కాలు నా కాలు" అని ఏడుపు లంకించుకుంది.

"నీకేంకళ్ళు లేవటయ్యా-పిల్లలుంటేనూ" అని ఆపిల్లతండ్రీ, మరుగుదొడ్డి తలుపుతీసు కుని గుమ్మంమీద కూచుని చిన్నపిల్లకు పాలు యిస్తున్న ఆపిల్లతల్లీ యిద్దరూ కేకలు వేశారు. దిగేవాడికి ఇదేమీ లెఖ్ఖలేదు. కొంత సామాను దింపాక. "ఏమండోయ్, ఆసీటు కింద బుట్ట ఒకటి వుంటుంది. ఇట్టా అందు కోండి" అన్నాడు. ఎవరూ అందుకోలేదు. "అందుకోండి ?....బండెళ్ళిపోతాది" ఇహ లాభంలేదని దిగేవాడే చే తు లూ కా ళ్ళూ తలలూ తొక్కుకుంటూ, సీట్లమీద ఎక్కి ఆ మూలకు దిగి కిందకు వంగి బుట్ట బయ టకు లాగాడు

"అదేంబుట్ట బాబూ, పళ్ళా ఏమిటి?.... కొన్నారు ?" అని భోగట్టా చేయసాగాడు పైన కూచున్న కాఫీ గతప్రాణి. పెట్టెగుమ్మం దగ్గర రద్దీ అట్లాగేవుంది. ఒకడో ఇద్దరో దిగినట్టున్నారు తప్ప - ఎక్కినవాళ్ళులేరు, "ఇది రిజర్వు - ఇది రిజర్వు" అని లోప లున్నవాడు ఒకడంటున్నాడు గడుసుతనం నాకే వుందన్నట్టుగా.

"రిజర్వయితే నువ్వెందుకెక్కినా ?" అని ఎక్కుదామను కుంటున్న ఒక ముస లాయన చిరాగ్గా అడిగాడు.

"నన్నెక్కనీండి బాబూ, నన్ను ముందు ఎక్కనీండి" అనిఒకడు దర్జాగా సీరియస్‌గా హక్కున్న వాడిలాగా ఎక్కబోయాడు. వాడెవడోకాడు - చేతికి బుట్ట తగుల్చుకొని బటానీలు అమ్మే వ్యాపారి, వాడినికూడా ఎ వ రూ ఎ క్క ని వ్వ లే దు. ఎక్క నివ్వాలని గసిరాడువాడు- "ఇక్కడెవరికీ అఖ్ఖర్లేదు పోవయ్యా" అని పిల్లతండ్రి విసుగ్గా అరిచాడు. "ఎవరికీ అని చెప్పటానికి మీకేం హక్కుందండీ - మాకుకావాలి - ఓ అణావిప్పుచ్చుకోండి" అని పైనున్న కాఫీ ఆ య న పిల్లతండ్రికి అణా అంది వ్వబోయాడు, పిల్లతండ్రి వినిపించుకోలేదు. బటానీలవాడు జబర్దస్తీ చేయబోయి ఎక్క బోయాడు - ఆ సమయానికి దిగే బాపతు యువకరత్నం ముందు హోల్డాలు తోశాడు. అది వెళ్ళి బటానీల బుట్టకు కొట్టుకుంది - బుట్ట వూడి రాలేదుగాని - బటానీలన్నీ ప్లాట్‌ఫారం పాలయినాయి. ప్లాట్‌ఫారం మీద ఆ డు క్కుం టు న్న వా ళ్ళ కొందరు హడావిడిగా పరుగెత్తుకొచ్చి కింద పడిన బటానీలమీదబడి - చేతికందినవి లాక్కుని నోట్లో పోసుకోసాగారు. బటానీల వాడు తారస్థాయిలోతిట్లకులంకించుకున్నాడు. యువకరత్నం నలుగుర్ని తోసుకుంటూ బరిలోకి దూకినట్టు కిందకి దూకాడు -

"పోయిన బటానీలు పోతేపోయాయిగాని నువు లోపలకురావయ్యా" అని బటానీల వాడికి పైనున్న కాఫీ మనిషి ఆహ్వాన పత్రంపంపాడు. పెట్టెలోకొందరు'అబ్బబ్బ అంటున్నారు - మరికొందరు "ఇష్షూ" ఇంకొందరు "రా మ రా మ" అని అనుకుంటున్నారు.



ఒక ఆసామీ ఎట్లాగో ఎక్కి ఫుట్‌బోర్డు మీద నించున్నాడు- "లోపలకు రానీయండి" అంటూ.

"అక్కడ నించోవయ్యా - చోటులేంది ఎ క్క డి కి రానీయమంటావు ?" అని లోపల్నుంచి ఎవరో కేకలు వేశారు.

"అ, కాఫీ యేయ్‌కాఫీ - వేడికాఫీ" - అని ప్లాట్‌ఫారంమీద నించుని కిటికీలోంచి చూస్తూ బండిలోకి అరిచాడు - కాఫీ కుర్రాడు.

"ఏది నాయనా, ఓగ్లాసు" అన్నది కాఫీ గతప్రాణి అక్కడనుంచే చెయ్యిజాస్తూ.

"బాబూ, ఇది వా రి కి వ్వం డి" అని అందించాడు వాడు దగ్గరున్నవాడికి.

"ఇదో గోల -"

"ఇటివ్వండి బాబూ"

అంచెలమీద ఆ కాఫీగ్లాసు పైనున్న వ్యక్తికి చేరింది. ఆయనగారు ఓ పిల్చుపిల్చి "రూపాయి చిల్లరుందా ?" అని అడిగాడు.

"అ, నోటివ్వండి".

కాఫీ గ్లాసు లాగే ఆనోటుకూడా అంచెల మీద అతనిదగ్గర కొచ్చింది.

అతను చిల్లర లెఖ్ఖపెట్టే కార్యక్రమంలో వున్నాడు, గార్డువేసిన ఈల కాంయ్‌మన్నది.

"చిల్లర యివ్వనాయనా. ఇదిగో గ్లాసు-" అంచెలమీద ఆ ఎంగిలిగ్లాసు అతన్ని చేరుకున్నది.

"నాన్నా నాకూ కాఫీ నాన్నా" అని ఓ పిల్ల ప్రయాణీకుడు ముద్దుగునిశాడు. ఆ తర్వాత వాడి వీపుమీద ఢామ్మని చప్పుడయింది - పిల్ల ప్రయాణీకుడు మళ్ళా కాఫీమాట యెత్తలేదు.

దిగవలసిన వాళ్ళు దిగినట్టున్నారుగాని- ఎక్కవలసినవాళ్ళు మాత్రం పూర్తిగా ఎక్కినట్టులేరు.

"బాబూ. ఆడదాన్ని బాబూ....నన్ను ఎక్కనీండి" అని ఆమె అట్లాగే అరుస్తున్నది. - పుట్‌బోర్డుమీద ప్రయాణం చేయాల్సినవాడు - "లోపలకు రానీయండి" అంటున్నాడు. గార్డు రెండోసారి ఈల వేశాడు - ఆ ఈల అందుకొని రైలుఇంజను గొంతుపోయిన నటుడు పద్యానికి రాగం తీసిన పద్ధతిలో అరిచింది. ఇంతలో టిక్కట్లు పరీక్షించే రైల్వేఅధికారి అక్కడికొచ్చాడు - ఎక్కే ప్రయత్నం చేస్తూ. "అసలే చోటులేదు. మీరు మరో పెట్టె చూసుకోండిసార్" అన్నాడు జోకుల యువకుడు. రైల్వే అధికారి వ్యర్థ ప్రయత్నంచేసి - హాయిగా వుంటుందని అనుకొని ఒకటో తరగతి పెట్టెకు వెళ్ళిపోయాడు.

ఈలవేసిన రైలు, వెంటనే కదలలేదు; కారణం యెవరికీ తెలీదు. జనం యింకా వస్తూనే వున్నారు. గుమ్మంముందు గుమిగూడుతూనే వున్నారు. ఇంతలో అక్కడికి ఒకాయన పరుగెత్తుకొచ్చి - "రండి. రండి. అక్కడ చోటుంది - రండి రండి...."అని పరుగెత్తసాగాడు.

"ఎక్కడ బాబూ ఎక్కడ?" అని ఎక్కబోయే గుంపూ, సగం యెక్కిన గుంపూ ఆత్రుతగా అడిగింది.

"రండి రండి, ఇంజన్‌లో యిద్దరే వున్నారు...."అని అతను పరుగెత్తాడు. అతని మాట వినిపించుకోనివాళ్ళు అతని వెనకే పరుగెత్తారు. కొందరు "ఏడిశాడు" అనుకున్నారు.

ఇంజను మళ్ళీ కూసింది.

కాఫీ తాగినాయన-"చిల్లర ఇవ్వయ్యో" అని అరిచాడు. కాఫీవాడు యింకా లెఖ పెడుతూనే వున్నాడు. అతికష్టంమీద రైలు - బరువుగా కదిలింది. "చిల్లరేదయ్యా?" కాఫీవాడిలెఖ పూర్తికాలేదు. బండి వాడిని దాటిపోయింది.

"ఆ చిల్లర అందుకోండి, బాబూ, చిల్లర....చిల్లర....చిల్లర...." అంటున్నాడు కాఫీ గతప్రాణి. ఎవరూ ఆ ప్రయత్నం చేసినట్టులేరు. ఒకాయన కిటికీలోంచి తొంగి చూశాడు - కాఫీవాడు కనిపించనేలేదు!

"దొంగముండావాడు, ఎంత పనిచేశాడో. చూశారా - కాఫ్ అని పీళ్ళ అందించాడు- రూపాయీ పట్టుకుపోయాడు, గ్లాసయినా వుంచుకున్నానుగాదు" అని పెద్దగా స్వగతం ప్రారంభించాడు - కాఫీ తాగినాయన. చుట్టతాగుడాయన శరీరం బరువుగా, ఆ రైలులాగే, కదిలి - "ఏమిటండీ ఏం జరిగిందీ?"అన్నది నిదానంగా - అప్పుడే లోకంలోపడి. కాఫీమనిషి ఈమాటవినిపించుకోనేకాదు. భావావేశాలు ప్రకటిస్తూ స్వగతం దంచేస్తున్నాడు!

బండి ప్లాట్‌ఫారం దాటింది. ఈ జనంలోనే కలిసిపోయి ఎక్కడో పాతుకుపోయిన రైల్వేగాయకుడు నిటారుగా లేచినించుని- చేతిలోని చిడతలు రెండు మూడుసార్లు టకటకలాడించి మరోమూడుసార్లు "కర్ర్ కర్ర్" మని చప్పుడుచేసి. ఎడంచేయి చెవిమీద పెట్టుకొని, ఏకహస్తంతోనే లయవేసేస్తూ-

"మిద్దె బంతిపూవులో - మూగె కళ్ళ పూసిలో" అని తన ధోరణిలో పాట ప్రారంభించాడు. పక్కనున్నవాడు పూరుకోమన్నాడు. కాని, గాయకుడు లక్ష్యపెట్టలేదు.

జుట్టు రేపుకుని. ఘోరయుద్ధం చేసి పెట్టిలో అడుగుపెట్టిన కొత్త ప్రయాణీకుడు "లోపలకు రానివ్వండి" అన్నాడు ముక్తసరిగా.

"మానెత్తి ఎక్కవయ్యా. చస్తూంటే లోపలకు రానీయమంటావు"

"రానివ్వాలండీతప్పుకోండిఅని"రాబోయే కొత్తప్రయాణీకునిపాదాన్ని తన పాదరక్షతో తీవ్రంగా పలకరించాడు.

"ఓరీ నీ బూడ్పుకాలు తగలడా. తియ్యరా...." అన్నాడుఅతను కంయ్‌మని.

"రా ఏమిటయ్యా. పళ్ళురాలగొడతాను" అన్నాడు కొత్తాయన.

"ఏంటి రాలగొడతావు - కాలుతొక్కి-"

"పోనీ పూరుకోండి బాబూ" అని ఓ గొంతు.

"ఏంటయ్యారాలగొట్టేది. కాలుతొక్కి-"

"మరి జరగరాదా ?"

"ఎక్కడికి జరగమంటావు? ఇదేం రైలుపెట్టె అనుకున్నావా - సముద్రపొడ్డు అనుకున్నావా-జరగమంటున్నావు"

"జరగటానికి ఏముంది నాయనా. ఇదిగో అరుగంటలాయి ఇలాగే వున్నాము" అన్నది పిల్ల తల్లి దొడ్డిగుమ్మంమీదనుంచి. "ఉన్నంతలో సర్దుకోవాలమ్మా - కాస్త కాలుతియ్యి నాయనా. కాస్త....కాస్త....ఆఁ...."

● భర్త ఇంటికిరాగానే భార్య ఏడుపుమొహంతో "చూశారా.చూశారా: మీ చెల్లెలు నన్నెల్లా అవమానించిందో:"

భర్త : "మా చెల్లెలు మెద్రాసులో వుందిగా:"

భార్య: "అవును, ఇవ్వాళ ఉత్తరం రాసింది. చింపి చదివాను."

భర్త: "అందులో అవమాన మేముంది:"

భార్య: "చివర 'వదినా! ఈ వుత్తరం మా అన్నయ్యకి ఇవ్వడం మరిచిపోకు' అనిరాసింది"

"చంపేయవయ్యా మమ్మల్నిచంపేయ్"

"కాస్త నించోటానికి చోటు ఇవ్వవేమయ్యా-పైగా కాలుతొక్కానంటావు"

"వుంటే తీసుకోవయ్యా - నేనిచ్చేదేమిటి ?"

ఇంతలో కొత్తగా వచ్చినాయన కాళ్ళు ఓమూల కిందసీటుమీదే పక్కపరుచుకొని పడుకున్న ఆడమనిషిమీదా, తలదగ్గర కూచున్న మగమనిషిమీదా పడ్డాయి.

"అయ్యా, ఆమెను కాస్త లెమ్మనండి. నలుగురు కూచోవచ్చు—"

"హమ్ కలకత్తే జానా" అన్నాడు అతనుహిందీలో.

"కలకత్తా జాతే మాత్రం పడుకోవాలా ? లెమ్మనండి, పైగా పట్టపగలు—"

"హిందీవాళ్లలెండి. వూరుకోండి. ఇంత సేపాయి మేము భరిస్తున్నాము కామా ?" అని ఒక ప్రయాణీకుడు అన్నాడు.

గాయకుడు పాటఆపి, డబ్బులకోసం కదలబోయి; కదలలేక 'అక్కడినుంచే చెయ్యిచాపి అరవసాగాడు. - ఒకాయనకు పెట్టెలు పెట్టుకోటానికి చోటుదొరక్కపోగా తనసీటుమీదే ఆ పెట్టెలు రెండూపెట్టి, దానిమీదే ఎత్తుగా హనుమంతుడల్లే కూచున్నాడు. అతగాడి పిల్లవాడు, అతని భుజాలమీద నించున్నాడు.

"నాన్నా - నాకు పట్టుకోటానికేంలేదు, అది పట్టుకోనా" అన్నాడు కుర్రాడు.

"అదిపట్టుకోకూడదు బాబూ, అది పట్టుకుంటే రైలాగిపోతుంది. గట్టిగా నా తలకాయేపట్టుకో. దానిమీద చెయ్యివెయ్యకు. ఏదయినా అయిందంటేజుల్మానా కట్టుకోవాలి."

పైన నిద్దుర పోతున్న వాళ్ళిద్దరిమధ్యా కొంతరగడ ప్రారంభమైంది. కాఫీ పీల్చినాయన కాలు, చుట్టతాగుడాయన చేతికి తగిలిందిట-"చూసుకో చూసుకో" అన్నాడు చుట్టాయన.

"పొరపాటు" అన్నాడు కాఫీ.

"పొరపాటు అంటే యెట్లాగయ్యా - నిన్నొక్కటి చరిచి, పొరపాటు అంటాను, నోర్మూసుకొంటావా ?"

"ఆటువంటిదేనేంటి, ఇది ?"

"చూసుకోవాలయ్యా - ధీమాగా కాలు విసిర్తే ?"

"నువ్వు చుట్ట యెందుకుతాగుతున్నావు ? బండిలో తాగకూడదు" అన్నాడు కాఫీ.

"చుట్ట తాగకూడదనిది ఈ బండిలో కాదు, బస్సులో"

"తీసి పారెయ్యి - ఇదికూడా అంతే"

"రూలులేదు"

"పోనీ వూరుకోండురూ, వున్నరూళ్ళన్నీ పాటిస్తున్నామా ఏమిటి ?" అన్నది ఓ కంఠం.

సగం కూచున్నవాళ్ళూ, చేతులనే కాళ్ళు చేసుకున్నవాళ్ళూ అందరూ అట్లాగే మాట్లాడేసుకుంటున్నారు - పోట్లాడుకుంటున్నారు- రాజకీయాలూ- వ్యాపారాలూ అవీ ఇవీ అన్నీను. ఇంతలో దొడ్డికి ఎదురుగా ఆచివరకూచున్నాయనకు దొడ్డి అవసరం కలిగి నట్టుంది - లేచాడు. అక్కడినుంచి దాటుకుంటూ కొందర్ని తొక్కేస్తూ "ఈ గోనెమూట ఎవరిదండి దార్లోపెట్టారూ" అని విసుక్కుంటూ అరగంట తర్వాత మరుగుదొడ్డి చేరుకున్నాడు. మరుగుదొడ్డి గుమ్మంమీద కూచున్న పిల్ల తల్లి లేవావలసి వచ్చింది, లేవటానికి ఏ మాత్రమూ అవకాశంలేదు. అప్పటికీ- "చంకలో పిల్లాడిని కొంచెం అందుకుంటారూ?" అన్నది భర్తను. ఆయన అవతల దూరాన వున్నాడు "ఎట్లాగే! నువ్వు రాలేవు నేను రాలేను. "అన్నాడు.

"అమ్మా మీరు లేవాలి" అన్నాడు వచ్చినాయన.

"ఆదేబాబూ నా ప్రయత్నం— ఏమండీ...."

"కేకవెయ్యకే - ఎట్లా రమ్మంటావు?" అని విసుక్కున్నాడు భర్త.

"నేనెట్లా లేవనండీ - ఎక్కడా సందులేందే -"

"ఏం పర్వాలేదమ్మా. మీరట్లాగే కూచోండి. నేనుదాటేస్తాను"

అని అక్కడికి వచ్చినాయన, ఆయన భాషలో ఆమెమీదనుంచి "దాటాడు!"ఆమె, పిల్లవాడూ ఏవో కొన్ని ఆర్తనాదాలుచేశారు. గాని, ఆ గొడవలో అవేం నోదిలోకి రాలేదు !

కాలు తొక్కినాయనా, తొక్కబడినాయనా తారస్థాయిలో పడ్డారు. ఊరుకోమని కొందరంటున్నారు. కొందరు మనకెందుకని వూరుకున్నారు....

పైన చుట్ట తాగుడాయనకూ, కాఫీ తాగుడాయనకూ వాగ్యుద్ధం బాగానే జరుగుతున్నది....

"బండి చాలా నెమ్మదిగా పోతోందేం?" అన్నాడొకాయన.

"మెయిలుగా" అన్నాడు జోకులరాయి.


కాస్సేపటికి బండి ఆగే ప్రయత్నంలో వున్నట్టు మరీ నెమ్మదయిపోయింది. స్టేషను వస్తూన్నది.

అక్కడ దిగవలసినవాళ్ల గుమ్మందగ్గరకు రావడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నారు.... అక్కడ ప్లాట్‌ఫారం నిండా వున్న జనం లోపలకు యెక్కేందుకు మార్గాలు ఎట్లాగని, ఆందోళన పడుతూ ఆలోచిస్తున్నారు....

బండి ఆగింది ... 000

నీమీద ఒట్టు.

కొమ్మూరి పద్మావతీదేవి





ఆ పల్లెటూరికల్లా ఉన్న గుడిసెలలో పెద్దదీ, తోట అర్థీ ఉన్నదీ, రామయ్య ఇల్లు. తెల్లారిలేస్తే పాడీ, పంటా, వంటా, వార్పూ. ఒక్క నిమిషం తీరికన్న మాటలేనిది చంద్రమ్మ.

ఉన్నది ఒక్క ఆడపిల్ల. దాన్ని కాస్త కలిగిన ఇంట్లో పడెయ్యాలని చంద్రమ్మ ప్రతీరోజూ రామయ్యతో పోరుపెడుతూనే ఉంటుంది. పట్టుమని పదేళ్ళన్నా నిండని కాసులుకి ఇప్పుడేం తొందరే అంటూ నవ్వేస్తాడు రామయ్య.

ఆ వీధివేఉన్న రంగన్న మేకల్ని తోలుకు వెళుతుంటే, తన రెండు మేకల్ని, నాలుగు పిల్లల్ని "శ్, శ్," అంటూ, నోటితోనే తరిమి తరిమి, పరుగులు తీస్తూ వరుగెత్తుతూ ఉంటుంది కాసులు. రంగన్నకి కాసులుకి ఎన్నికబుర్లో. చెరుకుగడని పళ్ళతో పీకి తింటూ చిలిపిగా రంగన్నని ఎక్కిరిస్తూ నవ్వుతూ ఉంటుంది కాసులు. సినిమా పాటలు, కూనిరాగాలూ ఆటలు, ఆటలు ఇద్దరికీని. కాసులుకి కోపం వచ్చిందా అంటే మూతి ఆదోలా పెట్టేసి "ఛీ, పో" అనడం అలవాటు. ఆ కోపం, ఆ మాటలూ అనిపించుకోవాలని రంగన్నకి ఆశ. ఇంచుమించు ఒకే ఈడులోఉన్న ఆ ఇద్దరూ రోజులు, వారాలు, నెలలు, ఏళ్ళు ఆడుకుంటూ, పాడుకుంటూ, పావురాల్లా ఎగురుతూ తిరగడానికి అలవాటు పడ్డారు.

"కాసులూ! చెప్పేది నీకే! బజారున పడి తిరగవద్దనలే" అంటూ ఒక్క కసురు కసిరేసరికి కాసులు అలాగే నిలబడి పోయింది. వయసు వచ్చినపిల్ల, గుమ్మం దాటరాదనే ఆంక్షపెట్టే సరికి, కళ్ళనీళ్ళతో కటికనేలమీద కూచుండి పోయింది కాసులు.

"లేలే! లేచి, ఇంట్లో పనులు చూడు నా తల్లివికాదూ?" అంటూ తల్లి లాలించే సరికి, కాసులుకోపంఆగలేక "ఛీ పో" అంటూ లేచింది.

"అదే అదే, ఆ ఛీ పో" ఇంకతగ్గించు. "నేనయితే తల్లిని గనక, సరిపోయింది. రేపు అత్తారింట్లో ఇలాగ అన్నావా చెంపలు వగలేస్తారే." అన్నది చంద్రమ్మ నవ్వు ఆపుకుంటూను.

ఆ సంధ్యచీకటిలో పరాగ్గా నడుస్తూ వస్తూన్న కాసులుకి రంగన్న యెదురయాడు. ఒళ్ళంతా సిగ్గుతో అలా ముడుచుకుపోయి ఒక చెట్టుచాటున నిలబడి ఓరగా చూసింది. కాసులు నడకయిట్టే గుర్తుపట్టిన రంగన్న "ఏం కాసులు, కళ్ళకే కరువయిపోయావు. ఏం సంగతి! పెళ్ళికూతురిలా అంత సిగ్గేం?"

"ఛీ, ఛీ, పో"

''ఎన్నాళ్ళయిందే నన్నిలా కసిరికొట్టి. రేపు సంతకొస్తావా? మంచి సంగతి కాసులూ.''

"అమ్మ తిడుతుంది. రాను"

"రమ్మంటే. నీకో రహస్యం చెబుతానే" అంటూనే వస్తున్న గుంపులో కలిసి రంగన్న వెళ్ళిపోయాడు. ఎటువెళ్ళేందుకు కాళ్ళాడక కళ్ళప్పగించి రంగన్న వెళ్ళిన దారే చూస్తూ నిలబడింది కాసులు.

"చీకట్లో ఈ చెట్టుకిందేమి చేస్తున్నావే" అంటూ చంద్రమ్మ విసురుగా రావడంతో కాసులు కాళ్ళు తల్లివెంట నడిచాయి. మనస్సంతా సంతకి వెళ్ళడం, రంగన్నని కలుసుకోడం ఇవే ఆలోచనలు. పట్టరాని ఆనందం కాసులుకి.

● ● ●

"బాగా కలిగినవాళ్ళే, ఎటూ ఏలోటూలేదు. ఒక్కడే కొడుకు. సరే అని చెప్పేశా"

"అంత తొందరేం! ఊళ్ళోనే ఉన్నారుకదా. కాస్త ఆగి చెప్పరాదా అంట."

"ఎందుకూ, ఆగడం? పదిహేను నిండాయో, ముసిలిదవుతుందో అనే గదే రోజూ నీ గోల."

"అవునూ, గోల పడ్డాను గనకే, చూశారూ. జాతకాలు చూడొద్దా! ఇంకా...."

"ఇంకాలేదు, గింకాలేదు. అన్నీ చూశానే. వచ్చేనెలే లగ్నం పెట్టేశాం కూడాను"

"అయ్యో! అన్నీ ముగించేశారా! ఒక్క మాటన్నా చెప్పలేదేం:"

"చెబుతున్నాగా! నీకూ చాలా ఇష్టమయిన వాళ్ళేగదా. ఇంకేం! ఇంకా .... ఇంకా అంటావేం?"

"డబ్బు అదీ అన్నీ చూడొద్దా?"

"అదా నీగోల! అంతా వాళ్ళదేనే. పిల్లని ఇస్తే చాలని కూచున్నారు. ఆ పిల్లాడికి కాసుల్నే చేసుకోవాలని పట్టుట. నేను నిన్ను అడిగానుటే."

"ఆ....పోదురూ." మరీ చిత్రం మాటలు." అంటూన్న చంద్రమ్మ ఒక్కసారిగా ముప్పయి ఏళ్ళ కిందట తన చిన్నతనం, తనే కావాలని రామయ్య పట్టుదలా అన్నీ అలా అలా కళ్ళల్లో మెదలి ఆనందంతో, గోడపట్టుకుని సర్వం మరిచిపోయి నేల చూస్తోంది.

"ఇదేనే. ఈ ఎల్చోడం నీకెంత అందం అనుకున్నావు" అంటూ రామయ్య భుజంమీద చెయ్యి వెయ్యగానే తుళ్ళిపడి సిగ్గుతోతలతిప్పి ''ఏం పనులవి? చిన్నతనం చిలిపిపనులు యింకా పోలా?" అంటూ అందెల చప్పుడుతో అడుగులు చకచకా వేస్తూ లోపలికి వెళ్ళిపోయింది.

రామయ్యపొగాకు ఈనెలుతీస్తూ. ''పిచ్చి పిల్ల. ఎలా బతుకుతుందో." అనుకుంటూ నులకమంచంమీద జారగిలపడి దూలాల వంక చూస్తూ కళ్ళు తుడుచుకున్నాడు.

● ● ●

సంతలో జనం నేలనించి పుట్టినట్లుగా గుంపులు గుంపులుగా తిరుగుతున్నారు. మిఠాయి దుకాణాలు, గాజులు, పళ్ళు, బట్టలు, నేలంతా, పరిచినరకరకాలబొమ్మలు అమ్మేవాళ్ళ కేకలు, అడిగేవాళ్ళ అదలింపులు, పిల్లల ఏడుపులు, గోలగా ఉంది సంత అంతా. అటు ఇటు వెతుక్కుంటూ జనాన్ని తోసుకు తిరుగుతున్నాడు రంగన్న. బట్టలన్నీ పరచి వేలంవేస్తున్నారు ఒకచోట. ఆ గుంపులో జొరపడ్డాడు రంగన్న.

సన్న కోరమీసాలతో, అందరికన్నా మంచి బట్టలతోఉన్న ఒక కుర్రవాడు జేబులోంచి నోట్లదొంతర తీసి వెగ కొనేస్తున్నాడు. రంగన్నని చూడగానే, తల ఎగరేసి "ఏం రంగన్నా, ఏదన్నా పాడు?"

" ఏమిటి అన్ని కొనేశావు? ఏం సంగతి కిష్టా? చీరెలు, రవికలూ, ఏట్రా సంగతి"

"నీకింకా తెలియదా! కాసులుకిరా ఇవన్నీ. వచ్చేనెలే లగ్నం" అంటూ అదోలా చూశాడు కిట్టు. రంగన్న పైకండువాతో ముఖం తుడుచుకుంటూ, ఆరిపోతున్న గొంతుక సరిచేసుకుని కాస్త పొడిగాదగ్గి "ఏవిటీ సంగతి! మంచి పిట్టనే పట్టావే"

"నే పట్టిందేవిటిరా! అంతా మావాళ్ళే కుదిర్చేశారు." అంటూ జరీ కండువా మడిచాడు.

తొందరపని ఉన్నట్టు అక్కడినించి తొందరగా వెళ్ళిపోయాడు రంగన్న. ఏదోవస్తువుని పోగొట్టుకున్నవాడిలా పిచ్చిగా చూస్తూ నడిచేవాళ్ళకి అడ్డువెళ్తూ దారే మరిచాడు. గాజుల కొట్టుదగ్గిర నిలబడిన కాసులు రంగన్నని చూసి పిలవాలని మళ్ళీ గొంతురాక మూగదానిలా అతన్ని వెంబడించింది. దూరంగాఉన్న ఒక ఎద్దులబండి దగ్గిర రంగన్న నేలమీద కూచున్నాడు. బుజంమీద చెయ్యివేసి పక్కనే కూచుంది కాసులు. రంగన్న ఉలిక్కి పడ్డాడు.

"ఏం? పలకవు?"

"ఇందా పూసలదండ."

"ఛీ. ఫో, ఇందుకా రమ్మంది."

కాసులు ముఖాన్ని తేరిపారచూసి ఆగలేక "నాదగ్గిరెందుకే నీదాపరికం. వచ్చేనెల పెళ్ళిఅని మాటన్నా చెప్పావా?"

"పెళ్ళా! నాకా? ఛీ పో."

"చాల్లే! ఇప్పుడేగా, కిష్టా చెప్పాడు పెళ్ళని."

"ఏకిష్టా!"

''అబ్బా! ఎంత నంగనాచివమ్మా; చాల్లే వగలు.'' కళ్ళనిండా నీళ్ళతో నేల మీద గడ్డితో రాస్తూ, యెవ్వరున్నదీ ఆలోచించకుండా, రంగన్న భుజంమీద తల ఆనించి ఏడ్చింది కాసులు.

''నాకు తెలియందే, నన్నే అంటావేం! నీమీద ఒట్టు. ఛీ ఫో."

''ఛీ పో! ఏడవకే, దూరంగా జరుగు, ఎవరన్నా చూస్తారూ?''

''చూస్తే చూడనీ! నిన్నే కట్టుకుంటా. నాకింక...."

''ఏడవకే వెర్రిపిల్ల! నామాట వినూ, నేనూ నిన్నే కట్టుకుంటా. ఆరు నూరవనీ నూరు ఆరవనీ, నీమీద ఒట్టు.''

''మరి మాటలెందుకూ! నీ ఇంటికి తీసికెళ్ళి నన్ను కట్టుకో, నే కాదన్నానా?'',

---

● ఒకడు "ఏమండోయ్, మీకు కవలపిల్లలు పుట్టారుటగా? ఆడపిల్లలా, మొగపిల్లలా?"

మతిమరుపు పెద్దమనిషి : ''ఒక ఆడపిల్ల, ఒక మొగపిల్లడు అనుకుంటాను. ఉహూ. ఒక మొగపిల్లడు. ఒక ఆడపిల్ల అనుకుంటాను."

''ఇంట్లో ఎవరున్నారే కాసులూ, అంతా నేనే. ఏ ఊరన్నా పోదామా!'' అన్నాడు కాసులు కళ్ళనీళ్ళు తుడుస్తూ.

''చెప్పు. యెక్కడికి రమ్మన్నావస్తా."

ఒక్క నిమిషం ఆలోచించి చేతులో ఉన్న బూందిపొట్లం విప్పి కాసులు చేతిలో కాస్తపోసి, తనూ ఇంత నోట్లో పోసుకుని కరకరా తింటూ.

"ఈ ఊళ్ళో మనం వేరే బతకలేం కాసులూ. ఎల్లుండి ఆదివారం రాత్రికి సరిగ్గా ఏడుగంటలబస్సులో వెళ్ళిపోదాం.నీమూటా, ముల్లె సర్దుకు వచ్చెయ్యి. అనుమానం రాకుండా చిన్నమూట తెచ్చుకో. చె క్రింద నిలబడు."

"నిజంగానా! రమ్మంటావా? చెప్పు? ఛీ, ఛో,".

మాట అనడం ఒకటీ, మళ్ళీ ఇంకొకటీనా? తంకెణగా వచ్చెయ్యి. తెలిసిందా! ఏదీ చేతిలో చెయ్యెయ్యి." ఎందుకే నీచెయ్యి చల్లగాఉండీ? భయంగా ఉందా?"

"ఛీ, ఛో, ఎప్పుడూ ఇంతే. భయం నాకా! నువ్వువక్కనుంటే నాకేం భయం.

మరింత పోతా, రంగన్నా! అమ్మ తిడుతుంది. సరీగ్గా నువ్వు చెప్పిన వేళకి వస్తాన్లే'' అంటూ, అతి సంతోషంగా కాసులు జనంలో కలిసి వెళ్ళిపోయింది. రంగన్న నిలబడినవాడు అలాగే బండీ చక్రాన్ని పట్టుకుని ముఖం తుడుచుకుంటూ తనలో తను ఏదో గొణుగుతూ ఉండిపోయాడు యెంతోసేపు.

''సంతకి వెళతానని ఒక్కమాటన్నా చెప్పకుండా యింతరాత్రికి వస్తావుటే?''

"గాజులు కొనాలని వెళ్ళానమ్మా. సీతి తమ్మందే."

"ఏసీతే! సీతి ఊళ్ళోనే లేదే! అబద్దాలు కూడా మరిగావా?"

''ఏనిటే, ఆగోలా!''అంటూరామయ్య రావడంతో తల్లీ కూతురూ ఆగిపోయారు.

"చెప్పకుండా చెయ్యకుండా సంతకివెళ్ళి యిప్పుడు దిగింది ఈ అమ్మవారు. ఎలా అంట?"

"వెళితే వెళ్ళింది లేవే! ఇంకెన్నాళ్ల? ఇంక ఉంటే ఒకనెల మనఇంట్లో. దాన్నెందుకే కసురుకుంటావు?"

చంద్రమ్మకి మరి మాటరాలేదు. కళ్ళు తుడుచుకుంటూ గొడ్లసావిడిలోకి పోయింది.

కాసులు కన్నీళ్ళతో మేకపిల్లని ఒళ్ళోకి తీసుకోడం రామయ్యచూసి...."నీకొవల సినవన్నీ నీతో తీసికెళ్ళే వెర్రిపిల్లా?" అంటూ వీధి అరుగు దగ్గరకి వెళ్లాడు.

అన్నీ అర్థం చేసుకున్న కాసులు ఈ ఇంటినీ తల్లినీ, తండ్రినీ ఒక్కసారిగా ఒదిలి వెళ్ళడం బాధగా అదోలా అనిపించి వెక్కి వెక్కి ఏడుస్తూ మేకపిల్ల ఒళ్ళంతా కన్నీళ్ళతో తడిపేసి కుప్పలా కూలపడిపోయింది. తను వెళ్ళే మార్గం తెలియని తల్లి, తండ్రి. తనకోసం పడే ఆ దిగులూ అదీ తలుచుకుంటే ఎంతబాధ! రెండురోజుల్లో ఈ ఇంటినీ అందర్నీ విడిచి వెళతానని వాళ్ళకి తెలియదే అనే ఆ రంపపుకోత బాధతో కుమిలి, కుమిలి, ఏడ్చి నేలమీద అలాగే నిద్రపోయింది.

• • •

సన్నని వానతుంపరలలో చల్లగా వస్తూన్న చెమ్మగాలిలో చాటు చాటున చంకలోమూట గట్టిగా పట్టుకుని కాసులు



నడుస్తూంది. వెనక్కి, వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ, కన్నీళ్ళు తుడుచుకుంటూ వెళ తూన్న కాసుల్ని ఊహించి రంగన్న చూశాడు. చిన్నగాఉన్న చేతిలోని సంచీ రంగన్నకి చాల భారంగా, బరువుగా తోచింది. సరీగ్గా బస్సుదగ్గిర చెట్టుకింద నిలబడి ఓరగా అటు ఇటు రంగన్నకోసం వెదికిపోతూ చూస్తోంది కాసులు. ఒకటిరెండు

బస్సులు గానూ వచ్చాయి వెళ్తున్నా, వెళ్లాయి. రోష్టు ధూళితో కాసుల ముఖం ధూళితో నిండిపోయింది.

రెండు అడుగులు ముందుకి వేస్తిన రంగన్న ఎందుకో ఒక్కసారిగా ఆగిపోయాడు. ఎదురుతెన్నులు చూసీచూసీ, రాత్రి 9 గంటలకి ఇంటివేపు తిరిగింది కాసులు కన్నీళ్ళతో. పెద్ద ఇంటి కోడలు కాబోతూన్న కాసుల్ని తన వెంట తీసికెళ్ళి ఆమె జీవితం, పాడు చేయదలుచుకోలే. కాసులు సుఖాన్నే. ఆశిస్తూ వెనక్కిమళ్ళాడు రంగన్న అమిత బాధతో.

● ● ●

రైలు. బుసలు కొడుతూ, ప్లాట్‌ఫారం మీదికివచ్చి విసురుగా ఆగింది.

ఆడవాళ్ళ పెట్టెలోంచి, కిటికీ దగ్గిర తలలు. స్టేషనంతా అరుపులూ, గోల.

ఆ గోలలో బొమ్మలు బొమ్మలంటూ ఒకతను పిల్లల్నిచూసి, ఆడవాళ్ళ పెట్టె దగ్గిర ఆగి గట్టిగా అరుస్తున్నాడు. కిటికీ దగ్గిరగా కూచున్న ఆవిడ పిల్లల్ని తీసుకు మూటవిప్పి తిండి అందిస్తూ ఛీ, ఫో అంటూ కసిరింది. ఆ గొంతు విని, బొమ్మల్లోని మేక బొమ్మలు నాలుగు తొందరగా ఏరి ఒళ్లమీద పిల్ల ముందు పడేసి చక్కాపోయాడు అతను.

రైలు శింహంలా అరుస్తూ, కదిలింది. ఆకూతకి పిల్ల భయంతో, అరనగానే పిల్లని గుండెలకి అదుముకుంటూ ఆ బొమ్మల్ని చూసి ఛీ ఫో అంటూ ప్లాటుఫారంవైపు అదోలా చూసింది ఆవిడ.

రంగన్న కాసుల్ని చూసి చెయ్యి ఊపుతూ ఆనందంగా నవ్వాడు.

"రంగా" అంటూ కేకవేసింది కాసులు. ఆ రైలు రొదలో ఆ గాలిలో ఆ మాటలు కలిసిపోయాయి. రంగన్నని వదిలి రైలు తొందరగా వెళ్ళిపోయింది. 000

పఠాభి పన్‌చాంగము

జూన్

1. హిమాలయంలోనేకాదు హిమం వుండేది;
వనితామణుల వదనాలలో సైతం
హిమానీ స్నోవుంది,

2. శ్వేతముక్తామణుల కన్న
స్వేదముక్తామణులకే జాస్తిధర
అంటాడు సామ్యవాది

3. శూన్యానికి కూడా ప్రయోజనం వుంది;
లోహమూ శూన్యమూ కలసి
పాత్రగా పరిణమిస్తున్నది.

4. వారనారికి నాణ్యమే ప్రాణము

5. అతివల అధరాల మీద వుండేది
అమృతంకాదు, అది అనృతం,

6. వాడన్నిటికీ నీళ్ళు వదిలాడు
విస్కీకూడా నీటుగా
త్రాగుతున్నా డందుకని.

7. ముందుగాపూజించేదివెనకయ్యను.

8. కాంతుని ప్రార్థనా లాపాలకు
కాంత నిలువంబడలేక
అడ్డం పడింది.

9. మనిసిలో కడకు మిగిలేది
ఆద్యంతం మటుకేను,

10. చిలువకన్నా అపాయకరం చెలువ

11. ఒకానొకప్పుడు అంటరానివాళ్ళు
మాలవాళ్ళు నామాల వాళ్ళున్నూ.

12. బంగుళూరు = బంగళాలూరు.

13. మానవతులందరూ ఈ నాడు
సమానవతులు కాగోరుతున్నారు.

14. పాములు, పావులు చేసేవి
పాప కార్యాలు

15. తార కాదగిన స్త్రీ ఒకరకం
దారకాదగిన స్త్రీ మరోరకం

పఠాభి పరిహాసము

16. పాలు రాకున్నా ఫరవాలేదుగాని
తపాలు రాకున్న చాలా ఆదుర్దా

17. పూర్వం మంత్రాలను రహస్యంగా
కాపాడేవారు: ఈనాడురహస్యంగా
కాపాడేది యంత్రాలను.

18. ప్రాణాయామంచేసి గాలిని
బంధించుట
హంసకాదు; అది హింస.

19. సిగరెట్‌కన్నా గౌరవ ప్రదం
సిగారు

20. ఒకప్పుడు కవులకు కాకలిగీతాలపై
మక్కువ.
నేడు మాత్రము ఆకలి గీతాలపై.

21. చాలామంది శీలవతులు
శీతలవతులు నిజానికి

22. లవ్ లవ్ లవ్ అన్ని నిరంతరమూ
అనేది శునకమున్న,
లవరున్న.

23. శిశు పంచకమును తన్ను కెనడా
దేశపు
ఐదువ భాగ్య మేమనవచ్చు!

24. తల గుడ్డలమీద చాలమోజు
మైసూరు ఆఫీసర్లకు; -
సరిగ వుండాలంటారు.

25. కాశ్మీరము భరతమాత నెన్నుదుట
కాశ్మీరము. అది చెరుగరానిది.

26. తలను కప్పునది కుంతలము

27. మహమ్మదీయుల మతమేమతము
ఇల్లాకాదు అల్లా అంటారు.

28. ప్రియురాలు దగ్గరలేని ప్రియుని
ముఖం ఒకే వైపు: ఉత్తరంతట్టు.

29. ఎలమావికన్ననూ ఎల మోవి
తియ్యన.

30. కాకికన్ననూ దయనీయం ఏకాకి.

స్వరలహరి

జనంనోట తన పాట పలికించిన చిలక

లలిత కళలకి, ముఖ్యంగా, సంగీతానికి భాషా భేదాలవట్టింపులులేవు. శ్రావ్యమై హృదయంగమమైన సంగీతం ఎవరు సృష్టించినా ప్రతివారూ విని ఆనందిస్తారు. అభినందిస్తారు. పాట బాగున్నప్పుడు, దీనిని తయారు చేసినవారు ఆంధ్రులా, అరవలా ఔత్తరాహులా, అనే సంకుచితభావాలు కలగనే కలగవు. "ఆహా! ఎవరు కట్టారోగాని, ఎంత చక్కగా కట్టారీ వరస". అని అప్రయత్నంగా అనుకుంటారంతే.

భాషా భేదాలను అతిక్రమించిన ఈ కళా ప్రశంసకు పాత్రులై, తన అతులితసంగీత రచనా శక్తితో అందరి ఆదరాభిమానాల్ని ఆర్జించి, అశేష ఆంధ్ర దేశాన్ని ఆకర్షించి అంతటా తన గాన కిరణాలను ప్రసరింప జేస్తున్న అరవరవి, మన మహాదేవన్.

వీరు నిర్మాతలకెట్టి యిక్కట్టులూ కలుగకుండా, తన పని తను సాఫీగా సాగించుకుంటారు. నిముషానికొక ట్యూనిమ్మన్నా యిస్తారు. కనకనే వీరి చేతిలో కనీసం ఇరవై ముప్పై చిత్రాలైనా వుండకుండా వుండవు.

పదింటికి రికార్డింగు ప్రారంభిస్తారు - పదకొండింటికల్లా "ప్యాకప్" అంటారు. చకచకా సాగిపోతుంది వీరి 'వర్కు' కొనసాగే వరకు. మధ్య మధ్య పకపకలతోనూ వికవికలతోనూ దద్దరిల్లు తుండడంకూడా కద్దు - రికార్డింగుహాలు - వీరప్పుడప్పుడు పట్టాలు తప్పి గుట్లు మిటకరిస్తున్న గూడ్సుబళ్ళని తిట్టే తియ్యనితిట్లు విట్లుగా విన్న చూపరులు నవ్వాపుకోలే నందువల్ల. సాధారణంగా సాంగు కండక్టింగు బాధ్యతా భారాన్ని నిజభుజస్కంధాలపై మోపుకోరు. కుడిభుజమన నొప్పు "శ్రీ పుగళేంది"కి ఆ తాపత్రయమంతా అప్పగించి, తను సౌండు ఇంజనీర్‌తో కలిసి కూర్చుని, తనకు కావలసిన సర్‌ఫెక్టు ఎఫెక్టు త్వరలోనే రప్పించుకుని, చాకచక్యంగా గీతాన్ని గమ్యస్థానానికి చేరుస్తారు.

మహాదేవన్‌గారితో పని చేయడం మహా సుళువు. ఈజీ కంపోజింగులో కడుంగడు నేర్పరులు. "పొన్ని తిరునాళ్" అనేతమిళ చిత్రానికి. "ఏన్ శిరిత్తాయ్ ఎన్నైప్పార్తు (నన్నుజూచి నగవేటికి) వరస కట్టడానికి

పి. బి. శ్రీనివాస్

కూర్చున్నారు - నన్ను రిహార్సల్సుకి పిలి పించిన వితవ. ఆ నాడే శ్రీ బడేగులాం అలీ ఖాన్ పాటవిని ప్రభావితుడనైయున్న నేను నాలోనేనే "పహాడి" రాగాన్ని సన్నసన్నగా గొణుగుకుంటున్నా. అదేరాగంలో అరనిము షంలో అక్కడమందేలా అమర్చేశారు. పల్లవిని అప్పటికప్పుడు. రెండో ఆలోచనే లేకుండా, మాటల్ని అవళంగా ఆలపించ దొడగారు. అంతలోకే ఆ మాటలు చక్కని పాటై కూర్చున్నాయి. ఆ పాట హిట్టయి కూర్చుంది. వీరికిగల ఈ సంగీతజ్ఞానం నేర్చుకున్నదానికన్న మిన్నగా వినికిడివల్ల కలిగిందే.


వీరిపేరు "కృష్ణన్‌కోవిల్ వెంకటాచల మహాదేవన్" (కె. వి. ఎం) మొదటిది వీరి వూరిపేరు. రెండవది వీరి తండ్రిపేరు, మూడవది వీరి పేరు. ఇలా వూరిపేరూ, తండ్రి పేరూ, సొంతపేరూ చేర్చి వాడు కోడం తమిళ సంప్రదాయం. వీరి జనకు లైన శ్రీ వెంకటాచలపతిగారుకూడా గొప్ప సంగీత పండితులే. "పండితపుత్రః" అన్న లోకోక్తిని అబద్ధపరచి, తానూ ఉద్దండ పండితులై, తండ్రికన్న మిన్నగా ధన, కీర్తి ప్రతిష్ఠలను గడించిన వీరిపేరు దక్షిణదేశానికంతటికీ ప్రదక్షిణం చేసింది.

బాల్యంఅంతా ఆటపాటలతోనే పేచీపూచీ లేవీ లేకుండా గడిచింది. బాలగంధర్వ గాన నాటకసభలోచేరి వారి నాటకాలలో ఆడ వేషాలు వేసేవారు. చదువు మూడోఫారం తోనే ముగిసింది.

అనంతరం. శ్రీ బూదపాండి అరుణా చల కవి రాయరనే వారివద్ద శాస్త్రీయ సంగీతాన్ని చక్కగా అభ్యసించారు. తండ్రి విద్వాంసులవడంచేత తరుచూ యింటిలోనే వింటూ వుండే సంగీతం బాగా వంటపట్టింది. నాగర్‌కోయిల్ పరిసరప్రాంతాల కొన్ని మైళ్ళదూరంలో ఎక్కడ ఏ సంగీతకచ్చేరీ జరిగినా, కాలినడకనే ఆచోటికిచేరి. శ్రద్ధగా విని. వారి వారి బాణీలన్నీ బుర్రకెక్కించు కునేవారు వీరా పసిప్రాయంలోనే. శ్రీ టి. ఎన్. రాజరత్నంపిళ్ళై. శ్రీ సుబ్రహ్మణ్య పిళ్ళైల నాదస్వర వాయిద్యాల ప్రభావం వీరి లేతమెదడు పై బలంగాపడేది. ఇలా శ్రవణ జ్ఞానంవల్ల సంగీతం బాపతు సంగతు లెన్నో అవగతం చేసుకునేవారు నిరంతరం.

ఈరీతిగా అభివృద్ధి చెందిన వీరి గాన జ్ఞానం ప్రథమంలో వీరికి పనికిరాలేదు. కారణం. వీరికి సినిమాల్లో మొదట దొరికిన అవకాశం నటించడానికి మాత్రమే; పాడ డానికిగాని, సంగీతం యివ్వడానికిగానికాదు. ఈవిషయం తలుచుకుంటే, నేను సినిమా రంగంలో అడుగిడిన నాటి మాట గుర్తు కొస్తుంది. అప్పటికే ఫిలిం ఫీల్డులో వేళ్ళతో పాతుకుపోయిన అనుభవం సంపా యించిన ఒక మహాశయుడి వ్యంగ్యం స్ఫురణకొస్తుంది.

"సార్, మీ కెందులో మంచి ప్రజ్ఞ వుందో అందులోతప్ప తక్కిన ఏ శాఖలో ప్రయత్నించినా సులువుగా ప్రవేశందొరుకు తుంది ఈ రంగంలో. ఇట్టే పైకొచ్చేస్తారు. మీరు గాయకులు గనక, గానం మినహా మీకు రాని మరో పని ఏదైనా చెయ్యడం ప్రారంభించండి. సెంట్‌పర్సెంట్ సక్సెస్" అని చమత్కారంగా సాయించారా స్వామి సరసమైన ధోరణిలో.



వ్యాసకర్తతో శ్రీ కె. వి. మహా దేవన్

ఇంతకీ శ్రీ మహాదేవన్‌కి మొట్టమొదట లభించిన దేమిటయ్యా అంటే కదలికా, మాటామంతీలేని శిలాప్రతిమ వేషం. ఆ రోజుల్లో రాతిబొమ్మకి బదులు మనుష్యులనే నిలబెట్టేవారట. రాళ్ళలాగ కదలవీయ కుండా. వీరికి దొరికింది "తిరుమంగై ఆళ్వార్" అనే అరవచిత్రంలో శ్రీ మహా విష్ణువు ఆలయ ద్వారాని కొకవైపు నిలిచి వుండే ద్వారపాలకుడి పాత్ర. "కిరీట కవచాదులు ధరించి, ఆశీర్వదిస్తూన్న పోజులో కుడిచేతి అరచేయి పైకెత్తి. రెప్పవాల్చకుండా" (శిలగా మరి) మాటిం గొతున్నంతసేపూ కదలకుండా నిలబడడం కన్నా మానవ ప్రాణికి మరో శిక్షేముం టుంది చెప్పండి" అన్నారు చిరునవ్వుతో. పాపం అలాగే చాలాసేపు నిలుచున్నారట పంచప్రాణాలూ బిగబట్టి. రిహార్సలూ అవీ సక్రమంగానే సాగాయి. శివరకి అద్భు తంగా అభినయించారు. కాని తీరా "టేక్" అని డైరెక్టరుగారన్నారో లేదో మరుక్షణమే. "టేక్" అన్న నోటనే "కట్" అనవలసి వచ్చింది. ఏమంటే ద్వారపాలకుని శిలా విగ్రహంతాలూకు ఆశీర్వాద హస్తం ఆడడం ప్రారంభించింది. సీను పాడైంది. దర్శకుడు గారు."ఏమయ్యా! మహానుభావా! ఇంత వరకూ బాగానే వున్నావుకదా! అంతలోకే నీ చేతికే మొచ్చిందయ్యా?" అని ఇంచుక కుపితమానసులై పృచ్ఛించారు. ఆ ప్రశ్నకు

సమాధానంగా శ్రీ కె. వి. ఎం తన నాసికా ద్వారాన్ని చూపించారు. పాపం సరైన సమయానికి మనవ్యారపాలకుని నాసికా పుటాల్ని ఛేదించి ఛేదించి చొచ్చాదొక మశికారాక్షసుడు!

చూపరులెల్లరూ (దర్శకులతోసహా) విరగబడి నవ్వారీ సందర్భోచితమయిన అసందర్భానికి. ఈ బాధపడలేకా, సంగీత మార్గాన్ని వదల్లేకా, కొన్నాళ్ళు శ్రీ అంగరై విశ్వనాథ భాగవతార్‌గారికి పక్క పాట పాడుతూ కాలక్షేపంచేసేవారు. ఈ బృందంతో హైద్రాబాద్, బొంబే, నాగ్‌పూర్, ఢిల్లీ వగైరా మహానగరాలన్నీ సందర్శించివచ్చారు.

హాస్యనటులైన శ్రీ కొళత్తు మణి వీరిని ప్రసిద్ధ సంగీతదర్శకులైన శ్రీ ఎస్. వి. వెంకట్రామన్‌వద్ద చేర్పించారు. పిమ్మట, వీరు శ్రీ టి. ఏ. కల్యాణంగారితో కలిసి కొంతకాలం పనిచేశారు. కీ॥ శే॥ శ్రీ ఎస్. డి. ఎస్. యోగిగారి "ఆనందన్ లేక అగ్ని మహిమ" అనే చిత్రానికి మహదేవన్ ప్రథమంగా సంగీత సారథ్యం వహించారు. 1941 మొదలు 45 వరకు సేలం మోడరన్ థియేటర్స్‌కి పనిచేశారు. చాలా చిత్రాలకు చక్కని సంగీతం సమకూర్చారు. తదాదిగా శతాధిక తమిళ చిత్రాలకు పనిచేసి ఈనాడు అనేక ప్రశంసలనంది "తిరై ఇశై తిలకం" (రజతపట సంగీత తిలకులు) అనే బిరుదు పొందారు శ్రీ శివాజీగణేశన్ ఆధ్వర్యం వహించిన రసికజన మహాసభలో.

వీరికి కర్నాటక సంగీతం అంటే పరమ ప్రీతి. కాని సినీమాలలో దానిని వుపయోగించవలసినంత వరకే ఉపయోగించాలంటారు. ఎం. కె. త్యాగరాజ భాగవతార్ కాలంలో జానపదాలూ, పౌరాణికాలూ అధిక సంఖ్యలో వుండేవి గనక, కర్నాటక సంగీతం రాణించేది. సినీమాల్లో కూడా. కాని ప్రస్తుతం యెక్కువగా సాంఘికాలే వస్తున్నాయి. వాటిలో సన్నివేశాలకి కర్నాటక బాణీ యథాతథంగా అమలుపరచడానికి వీలులేదు. రాగాలను రకరకాల మార్పులతో ప్రయోగించి, ప్రజాభిరుచి కనుగుణ్యంగా ట్యూను అమరిస్తేనే పాప్యులర్ అవుతాయి పాటలు. లేకపోతే రసాభాసం అవుతుంది.

ముఖ్యంగా వీరి వరసలు సులభగ్రాహ్యలుగా వుండడానికి కారణం పల్లవిని మామూలుగా మాటాడుకునే ధోరణిలో మలచడం. ఇక రిథం విషయంలో కె. వి. ఎం. గారి సంగీతరథం' వింతపథంలో పయనిస్తూ కొత్తవిధంగా రూపొందుతూ వుంటుంది పరిపరాల్ని బట్టి. ఒక్క "దగ్గారిథం"లో వీరు వందలకొలది వరసలుచేసి వూపిరి తిరక్కుండా వూపివూపి వదిలారు రసికలోకాన్ని. ఈ పద్ధతిలో యెవరేపాట చేసినా, మహాదేవన్ బాణీయే అని అనిపించకమానదు.

ఇది ఇంకా ఉత్తరాదిని ఉపయోగింపబడలేదు. ఒక్కసారి ప్రయోగిస్తే ఈ తాళమంత్రం ఔత్తరాహుల్ని సైతం మంత్రముగ్ధులను కావించకమానదు. పాటకి బ్యాక్‌గ్రౌండ్ బిట్లు కొలిచిచూచినట్లు, తూకంగా అమరుస్తారు శ్రీ కె. వి ఎం. సాధారణంగా వీరి గీతాలు "మధ్యమం" స్కేలులో వుంటూవుంటాయి. గాయకుల గళప్రస్తారావధుల్ని గుర్తించుకుని మరీ వరసలు కుదురుస్తారు. కనక పాడేటప్పుడే

యిబ్బందీ పడరు పాటకులు. వీరి వరసలూ, బిట్లూ వీరి వాద్యబృందానికి ఎంతగా అలవాటైపోయాయంటే, నిద్రపోతూకూడా తూగా తప్పకుండా వాయించెయ్యగలరు. ఓసారి అలాగే జరిగిందికూడా.

ఆర్. ఆర్. పిక్చర్స్‌వారి "గూండుక్కిళి" అనే చిత్రం తాలూకు రీ రికార్డింగు జరుగుతున్న రోజులవి. రీ రికార్డింగు ముగించుకుని సాయంత్రం 6 గంటలకల్లా మరోకంపెనీ బాపతుపాట రికార్డుచేయించడానికి ప్రోగ్రాం వేసుకున్నారు ఫిలింసెంటర్ స్టూడియోలో. కాని వీరి రీరికార్డింగు ఆరోజున కారణాంతరాలవల్ల రబ్బరులా సాగసాగింది. రాత్రి పన్నెండుగంటలదాకా లాగింది. వీరు ఈ పని ముగిసినవెంటనే రెండవ రికార్డింగుకి బయలుదేరారు. పంక్చువాలిటీకి పేరువడ్డ శ్రీ ఎ. ఎం. రాజా, శ్రీమతి జిక్కీగారలు ఆరుగంటలనుంచీ ఆరు గంటలసేపు వీరికోసం కాచుక్కూచున్నారు నిద్రాముద్రాంకితాలైన మొగాలతో. వారిని మెల్లిగా మూడ్‌లోకి లాక్కొచ్చి అర్థరాత్రివేళ ఆరంభించారు కార్యక్రమం. ఇహ వాయిద్యగాళ్ళ ముఖాలుచూస్తే నిద్రరానివారికి కూడా నిద్రవచ్చితీరుతుంది. వరసగా నెలరోజులుగా రికార్డింగులూ, రీ రికార్డింగులూ తగిలిన కారణాన, బలవంతాన వస్తున్న నిద్రను కళ్ళనుండి నులిమినులిమి తరిమి, యంత్రాల్లా పని జేసినందువల్ల వాళ్ళ కళ్ళు వాచివున్నాయి. కళ్ళు జోగుతూనేవున్నా, కాళ్ళూ చేతులూ వాయిస్తూనేవున్నాయి వాయిద్యాలు. నిద్ధరోతూనే నిర్ణీత సమయానికి లోపుగానే రికార్డింగు ముగించగలిగారు. వీరి బాణీకలవాటుపడని మరో ఆర్కెష్ట్రాబృందం వాయించివుంటే ఆ పరిస్థితిలో ఆ రోజున అంతత్వరగా ముగిసేది కాదు పాట. మరునటి రోజు కూడా తెల్లారిపోయివుండేది. "ఇంతాచేసి అంతకష్టపడి రాత్రంతా మేలుకుని పనిజేసి రికార్డుచేయించిన ఆ పాట తాలూకు పిక్చరీనాటికీ ప్రజలముఖం చూడలేదు. రికార్డూ రిలీజుకాలేదు. ఇలాగుంటాయి మా అవస్థలు" అన్నారాయన.

వీరిని నేను తొలిసారిగా కలిసినది శ్రీ ఆర్. పద్మనాభన్‌గారి "రక్తరేఖ" తరవాత చిత్రం "రాజేశ్వరి"లో. అప్పుడు వీరు స్వర్గీయ శ్రీ ఓగిరాలకు సహాయకులుగా వుంటూ వుండేవారు. నా పాటవిని మంచి బాస్ వాయిస్ అని మెచ్చుకుని చక్కని ప్రోత్సాహం యిస్తూ వుండేవారు. అప్పుడు చూసినప్పుడెల్లా వున్నారో ఇప్పుడూ అలాగే వున్నారు నడవడికలలో. పేరు ప్రఖ్యాతుల వల్ల హోదా మారిందేకాని, మనిషిమాత్రం ఏమాత్రం మారలేదు. ఈనాడు వీరిపేరిట ఎంతమందికో ఎంతో పబ్లిసిటీ జరుగుతున్న సమయానకూడా వీరిలో సింప్లిసిటీ రవంతైనా తరగలేదు. జీవితంలో ధక్కామొక్కలన్నీ తిన్నారుగనకనే ఎట్టి యిక్కట్లు వచ్చినా భయపడి పిక్కబలం చూపించకుండా దృఢంగా నిలబడి, తనతోబాటు పక్కవారికికూడా అట్టి యిక్కట్టుల బారి నుండి టిక్కెట్టు యిప్పించగల సమర్థులు. తనైనా అవస్థపడతారుగాని ఇతరుల్ని ఇబ్బంది పడనీయరు. తను తిరిపెమెత్తినా, భక్తుల మురిపెములన్నింటినీ తీర్చే భక్తవశంకరుడైన శంకరునివలెనే కరుణామూర్తులైన మహాదేవులు మన మహాదేవన్. ఈ మహాదేవుడి నీడలో నిర్భయంగా బ్రతుకు

తున్నాయి ఎన్నో భక్తగణాలు. వారి సౌఖ్యాల కోసం, స్వసుఖాలను త్యజించే త్యాగజీవులు మన మహాదేవులు. ఈ క్రింది ఉదంతం దీనికొక దృష్టాంతం.

ఆ మధ్యనే మేమందరం సేలంవెళ్ళాం అక్కడ ఎగ్జిబిషన్‌లో ప్రోగ్రాముకని. మాకో స్పెషల్ "బోగీ" బుక్ చెయ్యబడింది రానూ-పోనూ. కనక సకల సదుపాయాలతోనూ సరదాగా పయనించి. సంగీత కచ్చేరీల కాలవాలం అయిన సేలం చేరుకున్నాం. రాత్రి పదింటికి ప్రారంభించాంగాన సంచాలనం. దక్షిణాదిని ఇదే పరిపాటి. పదిలోపుగా ప్రారంభిస్తే పట్టుమని పదిమందైనా అడియన్సుండరు ఖాళీకుర్చీలూ బెంచీలూ తప్ప. కాన్సర్టు ముగించేసరికి. తేదీ మారిపోయి రెండుగంటలయింది అంతవరకూ సక్రమంగానే జరిగింది. తంతంతా. తిరుగుప్రయాణంలోనే చిక్కెదురైంది. మా బృందంలోని ఒక వ్యక్తికి జ్వరం తగిలింది కొద్దిగా. కాని మద్రాసులో మర్నాడే మానటానికి వీలులేని పనులుండడం వల్ల, మాతోపాటే బయలుదేరక తప్పింది కాదు-రాత్రికి రాత్రే. తీరా స్టేషనుకొచ్చేసరికి, గుండె గుభేలుమనే వార్త వినవచ్చింది. తిరుగుప్రయాణానికని మాకని ప్రత్యేకించబడిన బోగీని, నిర్ణీతమైన ట్రయినుకి తగిలించడానికి బదులు - పొరపాటున మరో మెయిలుకో, ఎక్స్‌ప్రెస్‌కో ఎటాచ్ చేసి పంపేశారు రైల్వేవారు. మేం స్టేషనులోనే కూర్చున్నాం. మరో అరగంటలో రావాల్సిన మరో ట్రయిను కోసం. కాని రిజర్వేషన్ లేందే రైలుప్రయాణం చేయడంఅంటే ఏమిటో అనుభవజ్ఞుల కందరికీ విదితమే.

ఈ పరిస్థితిలో ఆ జ్వరపీడిత వ్యక్తినెలా తీసుకెళ్ళడమా అనేది పెద్ద సమస్యై కూర్చుంది. మమ్మల్ని రైలెక్కించి కారులో హాయిగా మద్రాసు చేరుకుందామని సన్నాహాలన్నీ పూర్తి చేసుకున్న శ్రీ మహాదేవన్, బాధలన్నీ ఆలోచించి. తనకారులో కొంతమంది అనుయాయుల సహాయంతో ఆ వ్యక్తిని, మొగమాటపడి వెళ్ళనంటున్నా ఎక్కించి సౌకర్యంగా పంపించేశారు. ఆయన మాతోపాటే ఏ క్లాసులో ఖాళీ దొరికితే అందులోనే యిరుక్కుని యిబ్బంది పడడానికి నిర్ణయించుకున్నారు ఉదారస్వభావులై. అనుకున్నట్టే ఫస్టు సెకండ్‌క్లాసుల్లో ఎక్కడా జాగాదొరక్కపోయే సరికి థర్డు క్లాసు ప్రయాణం తప్పని సరైంది. ఆ నాటి మా ప్రయాణం శత్రువులక్కూడా వొద్దనిపించింది. దొరికిన సందులో దూరిపోయాం బాంబులకి బెదరిపోయిన కాందిశీకుల్లా. శ్రీ మహాదేవన్‌గారి అవస్థ చూస్తే మాకే బాధ కలిగింది. ప్రయాణం పొడుగూతా నిలువుకాళ్ళ జీతం పుచ్చుకున్నారు. నిద్రతో సతమతమవుతూనే. మొత్తానికి పచ్చడైపోయాం అనుకోండి అందరం. మద్రాసు చేరుకునే సరికి. "ఇలా ఎలా ప్రయాణం చెయ్యగలిగారండీ? మీరు హుషారైన కారు ప్రయాణానికలవాటు పడీ కూడా ఈ తలనొప్పిని కొనుక్కు తెచ్చుకున్నారే!" అని అడిగిన ప్రశ్నకి వారందించిన సమాధానం-"ఈ ప్రయాణాలన్నీ చేసేగా ఈ పరిమాణపు పరిణామాని కొచ్చిందీ! ఇలాంటి వింకా ఎన్ని జర్నీలుచేయాలో మనం జీవనయానం ముగించి లక్ష్యాన్నందుకోడానికి" అని.

ఈవిధంగా అప్పులకీ అమ్మలకీ అందరికీ అభిమానపాత్రులై మసలుకుంటూ వుంటారరమరిక లేకుండా. అనతికాలంలో తమిళంలోవలెనే, తెలుగులోకూడా శతచిత్ర సంగీత దర్శకులుగా సన్మానింపబడగలిగే ఎన్నో అవకాశాలూ- అర్హతలూ వున్నాయి వీరికి.

దొంగలున్నారు జాగ్రత్త, బొమ్మలపెళ్ళి, ముందడుగు, మాంగల్యం, ఆలుమగలు, అపూర్వచింతామణి, నువ్వా-నేనా, ఆత్మబంధువు, ఎదురీత, ఆత్మబలం, మంచిమనసులు, మూగమనసులు వీరి సంగీత సుపరిమళాల్ని తెలుగుతోటలో విరజిమ్మిన "చిత్ర"పవనాలు. చిత్రాలమాట అటుంచి ఇహ పాటలదాటకొద్దాం.

ప్రతిభావారి "దొంగలున్నారు జాగ్రత్త" చిత్రానికని శ్రీమతి జానకి, నేనూ-గిరిజ జగ్గయ్యలకు పాడిన "వలపే పులకింత" శంకరాభరణం మేళానికొక గిలిగింత. శ్రీ ఆత్రేయగారి "కల్లకాదుకలాకాదు కన్నెపిల్ల బాసలు" వింటే పుట్టుకొస్తాయి కొల్లకొల్లలుగా ఉల్లాన్ని కొల్లగొట్టే ఆసలు. శ్రీశ్రీ గారి "చమురుంటేనే దీపాలు" అనే గీతికా దీపికను రాజేశ్వరి, కస్తూరి తమ స్వర తైలంతో వెలిగించి కాంతి కలిగించారు. శ్రీ కొసరాజుగారి "ఎరుక జెబుతాను" గీతాన్ని శ్రీమతి జి. వరలక్ష్మినోట కమలగారు కమనీయంగా, యెరుకపరచారు. 'గిరిజ, జగ్గయ్య'లకే జిక్కి- ఘంటసాలల కంఠాలాలపించిన "ఏమనెనోయీ ఆమని రేయీ" గీతమాధురులు వేయి శరద్యామినుల హాయినొక్కరేయియందు అందిస్తాయి, అందించాయి. ఆత్రేయకలం మాధవపెద్ది "సత్యం" గళంద్వారా పలికించిన "తెలుసుకోండి ఈ నిజం" అన్న నిజం అందరికీ నచ్చడం సహజం. ఒక సత్యం (లంక)కి మరో సత్యం (మాధవపెద్ది) పాడిన "వినరానాన్న, కనరాచిన్న" శ్రీ ఆత్రేయకలం చిలికినవెన్న. గిరిజగారికి జిక్కిగారాలపించిన "హాసమా, పరిహాసమా" శ్రీ ఆత్రేయ స్వరయుత సాహిత్యానికొక ప్రత్యక్ష ప్రమాణం.

అరుణావారి 'బొమ్మలపెళ్ళి'లో జమునా శివాజీ గణేశన్లకు "హాయిగా తీయగా" అని హాయిగాతీయగా' జిక్కి-రాజాగారలాలపించిన గీతం ప్రణయరసపూరితం. శ్రీమతి జమునకు సుశీలగారు పాడిన "నిన్నే నిన్నే మేఘమా" వర్షించిన అమృతాన్ని చవిచూచినవెనుక విడువసాధ్యమా? "రావో, కనరావో" అని శ్రీశ్రీ రచనద్వారా, రాజా-జిక్కిగారలు వియోగబాధను రాగయుతంగా విలపిస్తూ వెల్లడిజేశారు. శ్రీ శివాజీగణేశన్‌కి శ్రీ పిఠాపురం పాడిన "చిక్కావె చిలవదానా" పాట వింటే చిక్కని చక్కని చిన్నది దక్కినంతపనై ఝల్లుమని ఉల్లం ఉరకలేస్తుంది.

ఎం. ఏ. వి వారి "మాంగల్యం" చిత్రంలో నేనూ మాధవపెద్దీ గొడవచేస్తూ పాడిన "అనగనగా ఒకపిలగాడూ, ఆతగాడికి ఒక చెలికాడు" అనే యుగళగీతికి, శ్రీ కాంతారావుగారూ, వారు వేసిన పురాణపురుషుల అవతారాలూ (రామకృష్ణ) కలిసి అద్భుతంగా అభినయిస్తూ చెలిమిలోకల కలిమినీ బలిమినీ విశదీకరించారు ఒకరి నొకరు వేళాకోళం చేసుకుంటూనే. "ఓహో జాబిలి ఇదిగో నా చెలి" అని నేను శ్రీమతి జానకితో

కలిసి ఆలపించిన ద్వంద్వగీతి. జానకిగారు తీయగా గానంపలిపి తెలిపిన "వలపుచేయు చిలిపితనాలు'' హాయిగొలుపుతాయి.

"అలుమగలు" చిత్రంలో ఆత్రేయ సాహిత్యరచనా మహాదేవన్ సంగీతరచనా గ్గీతులలో క్రొత్త చవులూరించాయి. సుశీలా ఘంటసాలల "సంసారం మహాసాగరం" గభీర గహ్వారం.

నిజం చెప్పాలంటే మహాదేవన్ కీర్తి తెలుగు రంగంలో ముందడుగిడింది - "ముందడుగు" చిత్ర సంగీతంద్వారానే. నాయకిజానకిగారికిగాయికిజానకిగారాలపించిన "సంబరమే బలే బలే" "ఆనందంఎందుకో" విన్నవారి సంబరం అంబరం అందుకుంది. "కోడెకారు చిన్నవాడ" అన్న జానకీ సత్యాల ద్విగళగానం వాడవాడలా ప్రతీ రసికుణ్ణీ వెళ్ళిన చోటల్లా వెన్నంటి తరిమింది.

"ఎదురీత"లో సంగీతం భలేమోత. కృష్ణకుమారీ కాంతరావులకు జానకి శ్రీనివాసుల ప్రణయగీతం "ఒకేమాట అడగనా చెలీ - ఒకే ఖమలుచెప్పనామరి" యువ ప్రేమికుల యెడదల ప్రశ్నలకు జవాబిస్తుంది. శ్రీ ఆత్రేయ "ధనంతోనే జగం వున్నది" అంటే కాదనే ధైర్యం ఎవరికున్నది? గిరిజా కాంతారావుల ఉపుద్యాన్పుకి నేను పాడిన శ్రీ ఆరుద్రగీతం "వున్నవారికన్న మనం ఎక్కువేలే" కలవారికీ లేనివారికీగల తారతమ్యాలను తేటతెల్లంగా తెలియ జేస్తుంది. "ఈ వేళ మనం వ్రాసుకున్న ప్రేమపత్రము" అని శ్రీ పిఠాపురం శ్రీమతి జమునారాణీ శ్రీ పద్మనాభం శ్రీమతి శారదలకు జల్సాగాపాడినపాట విరహంపుమంపు ఎండలో కాగి వేగిన ఎడదల పాలిటి ఆతపత్రము. శ్రీఆరుద్రగారి "పువ్వు పుట్టగానె తాను పరిమళించును" పాట పుట్టగానే ఫలించెను. ఆరుద్రగారే వ్రాసిన "ఎవరికెవరురా. బంధువులు ఎటు చూస్తే అటుమోసాలు" అని శ్రీ కాంతారావుగారికి నే నాలపించిన గేయం రాబందులవంటి బందుగులకు కషాయ ప్రాయం.

"నువ్వా-నేనా "చిత్ర సంగీతం "నువ్వా-నేనా" అని మాంచి రసపట్టుగాకుదిరింది. శ్రీ కాంతారావుగారికి శ్రీనివాస్ పాడిన "మేలు భళారే" కోరడా పట్టిన మారాజాకోటి దండాలు" అన్నవి మేలైన అప్పళాల్లా కరకరలాడే కమ్మని గీతాలు. "దేవి కాంతారావు"లకు శ్రీనివాస్సుశీలల" మెరిసే వెండి బంగారం" గీతంలోని శృంగారం ఇరవై రెండు క్యారట్ల మేలిమి బంగారం. సుశీలగారు శ్రీమతి దేవిక కాలపించిన "మసక మసక చీకటి"లో సంగీత సాహిత్యాల సంగమం అనుపమం. ఈ చిత్రంలో శ్రీ ఆరుద్రగారి కలం కురిసిన గీతాలలోని సాహిత్యం రసాలూరు రసాలం. "పి కొరకే నిను నేనువీడాలి" విని తీరాలి. శ్రీమతి రాజశ్రీకి శ్రీమతి సుశీల కలకంఠంతో ఆలపించిన "కుహూ కుహూ కోయిలమ్మా" వీనులకు పసందైన విందు.

జగపతీవారి "ఆత్మబలం" చిత్రంలో కె వి. ఎం. సంగీతం. ఆత్రేయ కలంబలం తోడుకాగా విజయవిహారం చేసింది. శ్రీ నాగేశ్వరరావు. శ్రీమతి సరోజాదేవి గార్లకు నాజెంగా. నాలుగు "రంఖు కంఠాల పాటలు" ఉన్నాయి.

"చిటపట చినుకుల'' పాటలో శ్రీ ఆత్రేయ తర్కనాశక్తి వర్ణనాతీతం.

"తెల్లవారనీకు ఈ రేయిని - తీరిపోనీకు ఈ తీయని హాయిని" అన్న సుశీలా. ఘంటసాలల ద్విగళగీతం భాగేశ్వరీరాగ రజంతో రంగరించిన అనురాగరసం. "వరుగులుతీసే వీ వయసునకు" అన్నపదం కదంతొక్కుతూ సాగి. తరుణవయస్కుల పొంగే పరువానికి పగ్గంవేయడానికి బదులు ఉసిగొలిపి ఉరకలేయిస్తుంది. సరోజ జగ్గయ్యలకు సుశీల ఘంటసాలలు పాడిన "ఎక్కడికి పోతావు చిన్నవాడా" పాట వింటున్నవారు కదలలేరు. కదలి వదలి వెళ్ళలేరు. వెళ్ళినా మరవలేరు. "రేలంగి గిరిజ"లకు "జమునా నాగేశ్వర్రావులు" పాడిన "ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు కొన్నాళ్ళ కిన్నాళ్ళ కినాడు తిరునాళ్ళు ఈ జంటకు" అనే గేయంలో కారణాంతరాలవల్ల చాలాకాలందాకా కలుసుకోలేక. కలవరించి కలవరించి కొసకు కలుసుకోగలిగిననాటి ప్రేమికుల స్వాశ్వాసనాశ్వాసం ధ్వనిస్తుంది. స్వర్ణలతా పిఠాపురాల "రంజు రంజు భలేరాంచిలుకా" మహా షోకైన చురుకైన పాట. "నాలుగుకళ్ళూ రెండైనాయి" అనే సుశీలగారి శోకగీతంలో" ఉన్న "మనసు నీ కర్పణజేసి-ఏమీ లేని దాననైనాను" అన్న పదాల భావం తెలిస్తే కరుణ నెరుగని కసాయివారి కరుకు మనసు కూడా తరుక్కుపోతుంది.

సారథీవారి "ఆత్మబంధువు"లో శారదా పద్మనాభాలకు జమునా శ్రీనివాసుల "దక్కెనులే నాకు నీసొగసు" బాణీ విని చెప్పకుండా వుండలేం కథాను. శ్రీ ఎన్. టి. ఆర్‌కి శ్రీ ఘంటసాలగారి కొసరాజు గేయం "చీరగట్టి సింగారించి" చక్కగా ముస్తాబైన చక్కనిచుక్క. సావిత్రి. రామారావుగార్లకు సుశీలా. ఘంటసాలలు పాడిన సి. నా. రె. గేయం "అనగనగా ఒకరాజు" పాటంటే ప్రజలందరికీ తీరనిమోజు. మరో సి. నా. రె. గీతం "చదువురానివాడవనీ" చదువురాని వారందరినీ ఓదార్చే సరస రచన. సీనియర్ సముద్రాలగారి "ఎవరో ఏవూరో. ఎవరు కన్నారో" పాటకి శ్రీ ఘంటసాలగారి గాత్రం. శ్రీ రామారావు గారి నటనాచాతుర్యం చేరి విన్న కన్నవారి చేతల్లా కన్నీరు కార్పించాయి.

బాబూమూవీస్‌వారి "మంచిమనసులు". "మూగమనసులు" శ్రీ మహాదేవన్ సంగీతాన్నీ గీతరచయితల సాహిత్యాన్నీ సరితూచిన బంగారు త్రాసులు. అందరూ ఒకరికొకరు తీసిపోకుండా కళాప్రతిభ చూపారు. జమునారాణీ పాడిన శ్రీ కొసరాజు రచించిన "ఎంత టక్కరివాడు" గీతానికి. వాసంతి తన నటన కతన మరీ వన్నె తెచ్చారు. శ్రీ ఆరుద్ర వ్రాయగా "ఏమండోయ్ శ్రీవారూ ఒక చిన్నమాట" అని శ్రీమతి సావిత్రికి సుశీలగారు పాడిన తేటిపాట సెలయేటి గలగలల కలవరం. సావిత్రీ నాగేశ్వరావులకు సుశీల ఘంటసాలలాలపించిన శ్రీ దాశరథి గీతం "నన్నువదలి నీవు పోలేవులే" వెలలేని వలపుల సంకెల. జానకి పాడిన "ఓహో ఓహో పావురమా" విని ఓహో ఓహో అని మెచ్చుకొని వారుండరు. శ్రీయుతులు నాగభూషణం. కె. ఎస్. రెడ్డి. శ్రీ మతులు జ్యోతీ వాసంతులు ఆంధ్రా భాంగ్రానృత్య

సన్ని వేశానికి జమునా ఘంటసాలలు వినిపించిన శ్రీ కొసరాజుగారి "మామ మామ మామా" వినగానే, లేచి నృత్యం చేయకుండా దీమాగా కూర్చోలేడే ప్రేక్షకుడుగాని. అంత లయవున్నదా పాటలో. శ్రీశ్రీ సుశీలా సావిత్రులు "ఆగవోయీ త్యాగం ముదియేనా" గీతంలో స్వరసాహిత్యాల రథం పట్టింది నూతన పథం. "శిలలపై శిల్పాలు చెక్కినారు" అనే శ్రీ ఆత్రేయ గారి పద శిల్పానికి శ్రీ మహాదేవన్ ఠీంప్లావ్‌లో మనోహరస్వర కల్పనచేశారు.

రాధా గోపీల "మూగమనసుల" మూక బాధనీ అమరగాధనీ మృదువుగా మధురంగా తెలియజేసింది శ్రీ మహదేవన్ సంగీతం. ప్రతీపాటా, క్రొంగొత్తబాటలో విరివిగా కురిసి మెరిసిన మాటల ముత్యాల్ని అందంగా అలంకరించుకుని రసికుల మనసుల్ని వెంటాడి వేటాడి దోచుకుంది. శ్రద్ధంగా దాచుకుంది.

"ఈనాటి ఈ బంధమేనాటిదో" ఘంటసాల సుశీలల కంఠస్వరమేళనంతో శ్రోతృవర్గంతో ఏనాటికీ విడని సంబంధం ఏర్పరచుకున్నది. అమాయకురాలైనా, అల్లరికల్లైన పల్లెపిల్లగా అద్భుతంగా అభినయించి ఆంధ్రప్రజల ఉల్లములను కొల్లగొన్న శ్రీమతి జమునకు సుశీలగారు పాడిన దాశరథీగీతం "గోదారీగట్టుపైని చెట్టుమీది పిట్ట మనసులో" విని, "ఏముందబ్బా అందులో" అని ఆలోచిస్తూ, ఆటవిడిచినా థియేటరులోనే కూచుండి పోయినవారనేకులు వున్నారు. ఆత్రేయగారి మరోపాట సుశీలా ఘంటసాలల నోటపలికిన సిలకలా కులికి ఒయ్యారాలొలక బోసింది.

జమున నాగేశ్వరరావ్‌లకు సుశీలా ఘంటసాలలు పాడిన శ్రీ కొసరాజుగారి "గౌరమ్మా నీ మొగుడెవరమ్మా"లోని నాదస్వరాల సునాదం తొంబ ప్రమాదం (ప్రమాదం అంటే అరవంలో అద్భుతం అని).

"ముద్దబంతిపూవులో మూగకళ్ళ ఊసులో ఎనక జనమ బాసలు" అనే ముత్యాల ముద్దుల మూటల మాటలతో శ్రీ ఆత్రేయ పొదిగిన పాటలో ఘంటారావాన్ననుసరించి సాగి వినవచ్చిన మురళీనాదం అంతర్యం నిజంగా ఎందరికి తెలుసు! తెలుసుకోగలిగితే అదే ఆనాటి బాసలను మూగభాషతో తెలియజేసే విలువైన గొలుసు. "ముక్కుమీద కోపం నీముఖానికే అందం" అన్న శ్రీమతి జమునకు జమునారాణిగారు జిల్పాగా పాడినగీతం అందరి ముందరి కాళ్ళకిబంధమే. శ్రీమతి సుశీలగారి "మానూ మాకును కానూ, మామూలు మనిసి నేనూ," వింటూ మనసులు నిలవక మనమంతా మానులా నిలబడిపోవాలిసిందే. శ్రీ అక్కినేనికి శ్రీ ఘంటసాల పహాడీ రాగంలో పక్వంగా పాడిన "పాడుతా తీయగా, చల్లగా"-నిదురకన్నెరుగని కనుదోయినైనత్రం జోకొట్టి కమ్మని కలల అలల డోలలూగిస్తుంది.

ఇలా, మనసైన ప్రతీచిత్రానికి మంచి సంగీతంతో మాన్యత తెచ్చియిస్తూ, మంచి మనసుగల, మూగమనసు మహదేవన్ -
సతతము జేయును గాపుత సంగీతసేవన్!
ఇతరులకందని త్రోవన్! ooo

జ్యోతి

చిత్రరఘుని

చైత్రయాత్ర

కన్నాంబ డాక్యుమెంటరీ చిత్రం

సుమారు మూడు దశాబ్దాలుగా తెలుగు, తమిళ సినిమా రంగంలో ఉత్తమ నటిగా తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంటూ, ఇటీవల కన్నుమూసిన శ్రీమతి పసుపులేటి కన్నాంబపై రెండురీళ్ళ డాక్యుమెంటరీ చిత్రం మద్రాసులో తయారవుతున్నది.

మే ఏడవతేదీ ఉదయంనుంచి సాయంకాలం అంత్యక్రియలు జరిగేవరకు అభిమానులు ఆ యా స్థలాలలో గుమిగూడిన విధం చూడగా కన్నాంబ వెనుక యెంతటి కీర్తి బలం వున్నదో ద్యోతకమైనది. ఎన్. ఎస్. కృష్ణన్ మరణించినప్పుడు యెందరు తమిళులు వచ్చారో కన్నాంబకూ అంత మంది జోహార్లు అర్పించారు. వారిలో అధికులు స్త్రీలు. "కన్నగి" కన్నాంబ చనిపోయారని వారిలో కొందరు విలపించారు.

["కన్నగి"సారథీవారి,"పత్ని" తమిళం వర్షను ఆ చిత్రంలో కన్నాంబ గొప్పగా నటించినట్లు చెబుతారు. కన్నాంబ మరణం మరునటిరోజు ఆ చిత్రాన్ని కొత్తచిత్రమంత ఆడంబరాలతో విడుదల చెయ్యగా టిక్కెట్లు దొరకలేదు. తెలుగు "పత్ని"ని శ్రీ గూడవల్లి రామబ్రహ్మం డైరెక్ట్ చేశారు. ఋష్యేంద్రమణి నాయిక].

జ్యోతి

దక్షిణ భారత సినీరంగంలోని పెద్దలూ, పిన్నలూ కన్నాంబ గృహమునకు వచ్చి అశ్రుతర్పణ చేశారు. వారిని పోలీసులు "క్యూ"లో పెట్టక తప్పింది కాదు. శ్మశాన వాటిక వరకు వారు నడచి వెళ్ళారు.

ఆరోజు దృశ్యాలను సినిమా తీయాలని అకస్మాత్తుగా కొందరికి తట్టింది. అప్పటికప్పుడు కెమెరా, ఫిల్మ్ ఎక్కడ లభిస్తుంది? కన్నాంబ బృందంతో చాలా యేళ్ళు పని చేసిన ఇంటూరి వెంకటేశ్వరరావు దూండీ వద్దకుహుటాహుటిగా వెళ్ళి కెమెరా తెచ్చారు.



600 అడుగుల నిడివి ఫిల్మ్ ఆయన వద్దనే లభ్యమైంది. అది అంతా షూట్ చేశారు.

మర్నాడు డెవలప్ చెయ్యగా వికరం 400 అడుగులు చక్కగా వచ్చింది. ఎడిట్ చేస్తే 300 లకు దిగుతుంది.

ఇక కన్నాంబకు చివరి కానుకగా మరి కొంత చేర్చి ఒక డాక్యుమెంటరీగా అందించేందుకు కడారు నాగభూషణం, వెంకటేశ్వరరావు, ఇంటూరి మొదలైన వారు నిర్ణయించారు. అందులో ఆమె జన్మ స్థలం, నాటకరంగ కృషి, గ్రామఫోను పాటల భాగాలు, వివిధ చిత్రాలలో(కన్నాంబ దాదాపు 110 తెలుగు చిత్రాలలోను 125 తమిళ చిత్రాలలోను, ఒక హిందీ చిత్రం "మనోహర"లోను నటించారు) నిర్వహించిన విభిన్న పాత్రల భాగాలు చూపిస్తారు. ఇంకొక నెలలో ఈచిత్రం ఒక రూపానికి రావచ్చునను కొంటున్నారు. మరి సినీ పరిశ్రమవారు కన్నాంబకు సమర్పించే చివరి సెల్యూలాయిడ్ కానుకయిది. ఆమెకూడా పోతూ పోతూ శ్రీ వెంకటేశ్వర స్వామికి ఒకకానుక. తనఫిలిం వ్యాపారంతో సంబంధించినవారికి ఒక విల్లు వ్రాసి యిచ్చారు.

తిరుపతిలో తన పేర ఒక 'కాటేజీ' నిర్మించేందుకు పదివేలరూపాయలచెక్కును ఆమె పంపివున్నారు. దాదాపు 34 సంవత్సరాల క్రితం అదే తిరుపతిలో పదిరూపాయలకు నోచుకోలేని గడ్డురోజులను ఆమె గడిపారు.

కన్నాంబ రాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీలో ప్రధాన భాగస్వామిని. ఆ కంపెనీ తరపున "ఆర్తి" హిందీ చిత్రాన్ని తెలుగులో తీస్తున్నారు. 14 రీళ్ళు పూర్తి అయినవి. అందులో ఆమె నటించడంలేదు. కాబట్టి ఆ సినిమాకు సంబంధించినంత వరకు ఆమె మృతివల్ల సమస్యలేదు. పోతే "భరణీ వారి వివాహ బంధం"లో వున్నారు. అందులో కన్నాంబ పోర్షను యింకా కొద్దిగా వుంది దాన్ని పూరించడం సమస్యే.

ఇక నాగయ్యగారికి ఆమెమృతి పెద్ద షాక్ వంటిదే. వారి "భక్తరామదాసు"లో కమలగా కన్నాంబ నటించింది. ఆమె పోర్షనుకు సంబంధించినంతవరకు ఔట్‌డోర్‌లో మూడుషాట్‌లు ఇన్‌డోర్‌లో చిన్న సెట్‌పని ఒకటీ, ప్యాచ్‌వర్కు మిగిలి వున్నాయి. మరి వీటిని 'డ్యూప్' పెట్టి తీయవలసి వుంటుంది.

తెలుగుతెర తొలితరానికి చెందినవారైనా కన్నాంబకూ అభిమానతారలూ, దర్శకులూ వున్నారు.

దుర్గాఖోటే ఆమెకు ఆదర్శతార. ఆమె నటించిన ప్రతి చిత్రం వీలైనన్నిసార్లు చూచేవారు. "ఆమెను ఈమె ఆరాధించారు. ఈమె నటనలో ఆమె ఛాయలు కన్పించక పోతాదికూడా.

దర్శకులలో హాలీవుడ్ రిటర్న్‌డ్ ఆర్. ఎస్. ప్రకాష్‌ను ఆమె యెక్కువగా అభిమానించేవారు. కారణం ఆమెను తమిళ రంగానికి తొలుత పరిచయం చేసినవారు ఆయనే ("కృష్ణన్ తూతూ"). అంతేకాక గొప్పగా నటించిన, పాడిన "చండిక"కు ఆయన దర్శకుడు. . ఆ చిత్రంలో "నేనే రాణీనైతే" అని రౌద్రంతో కన్నాంబ పాడిన మెరికలపాట యిప్పటికీ శ్రోతల కర్ణములలో ప్రతిధ్వనిస్తూ వుంటుంది.



"బభ్రువాహన"లో రేలంగి, రామారావు.

సినిమా కొత్తరోజులనుంచీ కన్నాంబకు తనకు తోచిన సూచనలు చెయ్యడం అలవాటు. ఆంధ్ర చలనచిత్ర పితామహుడు హెచ్. ఎమ్. రెడ్డి అంతటివారికే ఆమె సలహా యిచ్చారు.

"గృహలక్ష్మి" తీసే రోజులవి. మద్రాసులో ట్రామువెంట "దేవుడు లేడూ" "సత్యం జయించదూ" అంటూ కన్నాంబ పరుగిడవలసిన ఘట్టం. కెమెరాను ఎత్తులో వుంచి తనను చిత్రీకరించవలసిందని ఆమె కోరారు. హెచ్. ఎం. గారు 'హర్‌హైనెస్' మాటవిన్నారు. ఫలితం గొప్పది. రెడ్డిగారు ఎప్పుడూ ఆ 'షాట్' గురించి, కన్నాంబ చొరవగురించి చెబుతూవుండేవారు. రాజరాజేశ్వరీ చిత్రాలకు ఆమెపేరును నిర్మాత్రిగా టైటిల్సులో వెయ్యలేమకాని ఆమె దాదాపు అంతపనీ చేసేవారు. సెట్లకు విధిగా వచ్చేవారు. స్త్రీ పాత్రల యాక్టింగ్ విషయంలో సలహాయిచ్చేవారు.

తమిళ రంగంలో ప్రవేశించిన తొలి తెలుగు (స్త్రీ) తార కన్నాంబ. తెలుగు రంగంలో గ్లిసరిన్ లేకుండా ఇట్టే కంటినీరు తెప్పించుకొన్న తెలుగు తారకూడా ఈమే. డైలాగులిచ్చి "అమ్మా కళ్ళవెంట నీరు రావాలి" అని అంటే చాలు, చదువుతూ అంతపనీ చేసి వేసేవారు.

వంశ్చవాలిటీకి ఆమెని పెట్టింది పేరు. ఆమెరా బటి సు యో డియాలాలు సరి దిద్దవచ్చు సెట్‌పైకివచ్చిన మీదట ఆమెకు వేరేలోకం మంటూ లేదు. తన భూమికపైన తన నటనపైన ఏకాగ్రత ఒక్కటే లోకం.

జీవిత సంగ్రహం

కన్నాంబ 1913 సెప్టెంబర్ 20 వ తేదీన కడప [illegible] నాయుడుగారి కుటుంబంలో జన్మించా[illegible]. [illegible] డ్రి [illegible] ద్యోగి. కడ నుంచి [illegible]ల్లూ కు. [illegible]లూ [illegible] ంచి ఏలూరుకు. ఏలూ [illegible] ను [illegible] జ య వా డ కు మకాం [illegible] రు. 15 వ [illegible] ట నవలా నాటక సమాజం[illegible] చేరి స్టేజి జీవితం ప్రారంభించారు. విజయవాడలో వున్నప్పుడు ఆమె గాత్రానికి కొప్పరపు సుబ్బారావు అబ్బుర పడి హెచ్. ఎమ్. వి. గ్రామఫోను గాయకు రాలుగా బుక్ చేశారు. ఆమె పాడిన "కృష్ణం భజ రాధ" ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించింది స్టేజిపై క్రమంగా పేరు తెచ్చుకొని యశోదగా పారుపల్లి సుబ్బారావుతో, ద్రౌపదిగా యడవల్లి సూర్యనారాయణతో, కమలగా అరణి సత్యనారాయణతో, అన్నపూర్ణగా దొమ్మేటి సూర్యనారాయణతో, ఇంకా సావిత్రి, చంద్రమతి భూమికలను సమర్థంగా నిర్వహించి గాత్రానికి విగ్రహానికి స్టేజికి 'రేజ్' 'క్రేజ్' అయినారు. అయినారు. విజయవాడలో రాజరాజేశ్వరీ నాట్యమండలి స్థాపించారు.

విజయవాడలో పారేపల్లి శేషయ్యగారి సహకారంవల్ల సినిమారంగంలో ప్రవేశించారు. 1935 లో విడుదలైన "హరిశ్చంద్ర" (దర్శకుడు పి. పుల్లయ్య)లో చంద్రమతిగా నటించారు; తదాది పతివ్రత పాత్రలను, కరుణరస ప్రధాన పాత్రలను నిర్వహించి క్రమేణా రౌద్ర బీభత్సభూమికలను కూడా ధరించారు. ఏపాత్ర ధరించినా నటరాణిగా క్యారక్టర్ యాక్ట్రెస్‌గా గణుతికెక్కారు.

"పేదరైతు"లో స్వార్థయజమానురాలుగా "సతీసక్కుబాయి"లో అత్తగా, "తోడి కోడళ్ళు"లో సాఉత్తూ అన్నపూర్ణగా, "రాజమకుటం"లో పగబూనిన తల్లిగా "పరువు - ప్రతిష్ఠ"లో వాటి ప్రతీకిధిగా అభినయించి మెప్పు పొందారు. "ద్రౌపదీ వస్త్రాపహరణం"లో "శరణు దీనావనమో నమో" అంటూ కృష్ణుకై ద్రౌపది చేసిన ప్రార్థన, భారతదేశం మనదేకాదా పతితను మన కది" అన్న దేశభక్తిగీతాగానం (బేక్ రికార్డు) కన్నాంబ కంఠమాధుర్యాన్ని శాశ్వతం చేసినవి.

బి. ఎన్. రెడ్డి కొత్తచిత్రం

బి. ఎన్. రెడ్డి తిరిగి తదుపరి చిత్రం స్టోరీపై "కూర్చున్నారు." అంటే కథల పరిశీలనకు ఉపక్రమించారన్న మాట.

శ్రీ బి. ఎన్. ఈసారి వాహినీ బ్యానర్‌లో చిత్రం తీస్తారు.

సాంఘికాలు తీశాం, చారిత్రకాలు తీశాం, జానపదాలు తీశాం ఈసారి పౌరాణికం చూద్దాం అని బి. ఎన్. ఈమధ్య దీర్ఘంగా అనుకొన్నారు. కొంత ఆలోచన పిమ్మట మళ్ళీ చారిత్రకానికి వెడితే మంచిదేమో అనిపించింది. తుదకు సాంఘికం తీయడానికే నిర్ణయించారు. ఎం. ఎస్. రామారావు, పాలగుమ్మి పద్మరాజువంటి వారలను వెండితెరకు పరిచయంచేసి, కుమారి కె. ప్రసాదరావువంటివారి వెలుగు పెంచిన



జకర్తా చలన చిత్రోత్సవంలో బహుమతులు పొంది మద్రాసు తిరిగి వచ్చిన "నర్తనశాల" నిర్మాతలు శ్రీధరరావు, లక్ష్మీరాజ్యంగార్లకు స్వాగతమిస్తున్న దృశ్యం.

బి.ఎన్. రెడ్డితన కొత్తచిత్రంలోదాదాపుకొత్తవాళ్ళనేతీసుకోవాలని ఆలోచిస్తున్నట్లుకూడా తెలుస్తున్నది. అయితే యింకా తుదినిర్ణయం జరుగలేదు. ఏమైనా ఒక్కటిమటుకు ఖాయం. బి. ఎన్. తదుపరిచిత్రంలో చాలామంది కొత్త తారలుఉండగలరు. అంతేకాదు; సాంకేతిక శాఖలలోకూడాఆయనఒకవిప్లవం తేదలచారు.

పోతే సబ్జెక్టు విషయం. మన సంస్కృతీ సంప్రదాయాలు తప్పితే మరి దేనికీ ఆయన పోరు. సత్యం, అహింసలపై ఆయనకు ప్రగాఢాభిమానం వుంది. నైతిక పునరుజ్జీవనం పాడు ఒకసారి బి. ఎన్. తో ముచ్చటిస్తూ సత్యం, అహింస ప్రచారంచెయ్యడం కోసం భారతదేశం వచ్చామన్నారు.

వెంటనే బి. ఎన్. నుంచి సమాధానం వచ్చింది "అవి మా జీవానికిజీవం; రక్తంలో రక్తం. వాటి ప్రచారం కోసమే అయితే మీరింత దూరం రానవసరంలేదు" అని.

బి. ఎన్. తీయబోయే చిత్రంలోకూడా ఇంత ఘనమైన నీతి సూత్రం వుంటుందని "జ్యోతి"కి ప్రత్యేకవార్త.

నవ్వుల పరవళ్ళచిత్రం

పద్మశ్రీవారు ఈసారి మద్రాసులోనే తెలుగు చిత్రం తీయబోతున్నారు. ఇది

సంపూర్ణ హాస్యచిత్రం. నవ్వులు పకపక్క త్రొక్కే ఈ చిత్రానికి ముళ్ళపూడి వెంకట రమణ సంభాషణలు రచిస్తున్నారు. చిత్రం పేరు "పెళ్ళిచేసి చూడు" కాదు." ఇల్లుకట్టి చూడు"కాదు. "ఎలక్షన్‌లో పోటీచేసిచూడు" కాదు "ప్రేమించుచూడు." దర్శకుడు పి. పుల్లయ్య. నిర్మాత వి. వెంకటేశ్వర్లు.

జకార్తా బహుమతులు

జకార్తానుంచి తిరిగివచ్చిన "నర్తనశాల" నిర్మాత శ్రీ శ్రీధరరావు "జ్యోతి" ప్రతినిధితో ప్రత్యేకగోష్ఠి జరుపుతూ ఆఫ్రో ఏషియన్ ఫిలిం ఫెస్టివల్‌లో ఇద్దరు విలనులు ఉత్తమ బహుమతిపొందడం ఒక అద్భుత విషయమన్నారు. కీచకుడు రంగారావు. సంయుక్త అరబ్ రిపబ్లిక్ చిత్రంలోని ఒక విలనూ బెస్ట్ యాక్టర్ అవార్డు పొందారని ఒక జపాన్ స్త్రీతార. ఒక చైనీస్ స్త్రీతార బెస్ట్ యాక్ట్రెస్ అవార్డు పొందినారని చెప్పారు. సాంకేతిక శాఖలలో ఒక్కొక్క టెక్నిషియనుకు మాత్రమే అవార్డు ప్రకటించారని కళా దర్శకత్వానికి మొత్తం ఉత్సవంలో ఒక్క టి. వి. ఎస్. శర్మగారికి అవార్డు ప్రకటించారని. వీరి విజయాలు మొత్తం భారతదేశానికి గర్వకారణమన్నారు.

ఇండోనీషియలో భారత భాగవతాలుబాగా తెలుసునని. అచ్చటివారిలో చాలామందికి పంచ పాండవుల పేర్లు వున్నవని. ముస్లిములు అయినా హిందూ దేవతలను కొలుస్తారని వెల్లడించారు. ఇండొనీషియన్ భాషలో సంస్కృత పదాలు అనేకం వున్నవన్నారు. ఉదాహరణకు వనిత అంటే స్త్రీ అనే అర్థం ఇండొనీషియా భాషలో కూడా వున్నదన్నారు.

ఇండొనేషియా అధ్యక్షుడు సుకర్నో ఇంగ్లీషు అనర్గళంగా మాట్లాడుతారని.హిందీ బాగా వచ్చునని చెప్పారు.

భారతదేశంపట్ల ఇండొనీషియనులకు సోదర సద్భావాలే కన్పించినవని. తమకు ఇండొనీషియా ప్రభుత్వం, అతిథ్యమిచ్చిన ఉత్సవ నిర్వాహకులు సకల మర్యాదలిచ్చి సౌకర్యాలు కలుగ జేశారని శ్రీ శ్రీధరరావు చెప్పారు.

ఏప్రిల్ 29 వ తేదీన జకార్తలోని మగాబియో (పూర్వపు మెట్రోధియేటర్)లో "నర్తనశాల" మూడు ఆటలు వెయ్యగా అనేక వందలమంది టిక్కెట్లు దొరక్క వెళ్ళిపోయారన్నారు."నర్తనశాల"లో అన్ని పాత్రలకు సమర్థులను తీసుకొనడం ఇతివృత్తపుహొందాను నిలపడం ఇండొనీషియనులమెప్పు పొందినట్లు తెలుస్తున్నది.

జకార్తాలో రెండు ఫిలిం స్టుడియోలున్నవి. అయిత్తే మన ప్రతినిధివర్గం అచ్చటవున్న నాలుగురోజులలోనూ ఉత్సవ కార్యక్రమాలలోను ఇంకా అనేక విందులలోను పాల్గొనవలసి వచ్చినందున ఫిలిం స్టుడియోలను సందర్శించే వీలుపడలేదు. నిర్వాహకులు ఆ యాత్రను యేర్పాటు చెయ్యలేదుకూడా.

"నర్తనశాల"ను 27 దేశాల ప్రతినిధి వర్గాలకు ప్రత్యేకంగా 28 వ తేదీ ఉదయం ప్రదర్శించారు.

శ్రీ కమలాకర కామేశ్వరరావు డైరెక్ట్ చేసిన ఆచిత్రానికి సముద్రాల రాఘవాచార్య సాహిత్యం సమకూర్చారు. ఒక ప్రింటు యింకా జకార్తాలోనే వుంది.



"రాముడు భీముడు"లో జమున.

టెలివిజన్‌లో తెలుగుతారలు

నటి సావిత్రి ఈమధ్య కౌలాలంపూర్‌లో టెలివిజన్‌లోగోష్ఠి జరిపారు.

జకార్తా ఉత్సవం పూర్తిఅయినమీదట భారత ఫిలిం ప్రతినిధివర్గం సింగపూర్‌కు వచ్చింది. అచ్చటకు 300 మైళ్ళ దూరంలో వున్న కౌలాలంపూర్ కూడా వెళ్ళింది. తిరిగి సింగపూర్‌వచ్చి మే ఆరవతేదీ రాత్రి మద్రాసు చేరుకొన్నది.

సింగపూర్, కౌలాలంపూర్‌లలో టెలివిజన్ బాగా వాడుకలోవుంది. శ్రీ సుందరలాల్‌నహతా నాయకత్వానకల భారత ప్రతినిధివర్గం (శ్రీధరరావు, లక్ష్మీరాజ్యం, రంగారావు, రేలంగి, సావిత్రి) ఆ రెండు నగరాలలోను విమానాశ్రయంలో పొందిన ఘనస్వాగతం టెలివైజ్ చెయ్యబడింది. కౌలాలంపూర్‌లో నటి సావిత్రి తమిళంలో టెలివిజన్‌లో గోష్ఠిజరిపారుకూడా.

కౌలాలంపూర్‌లో సింగపూర్‌లోకంటె చాలా హెచ్చుగా తెలుగువారున్నారని, మన ఆంధ్రదేశంలోకంటెకూడా చాలా హెచ్చుగా ఆ రెండు నగరాలలో మన తారలపై మోజు వున్నదని శ్రీ శ్రీధరరావు "జ్యోతి" విలేఖరితో ముచ్చటిస్తూ పేర్కొన్నారు.

మన తారల చీరలు చూడగానే విదేశీయులు మనలను గుర్తుపట్టి గుమిగూడినారన్నారు.

కవులూ, కేంద్రప్రభుత్వం

శ్రీ బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షతనుకల కేంద్రప్రభుత్వపు అవార్డుల కమిటీ నిర్ణయాల ప్రకారం రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్‌నుంచి స్వయంగా అవార్డులు అందుకొనడం నిమిత్తమై "నర్తనశాల," "లవకుశ", "అమరశిల్పిజక్కన్న", "మూగమనసులు" ప్రతినిధులు ఆమధ్య ఢిల్లీకి (క్షేమంగా) వెళ్ళి (లాభంగా) తిరిగివచ్చారు.

ఈ సందర్భంగా "జ్యోతి" కి క్రింది విశేష వార్తలు అందినవి.

రాష్ట్రపతి రాధాకృష్ణన్ తమ బసకు తెలుగు చిత్రాలకు సంబంధించిన వారిని రప్పించి వారితో తేనీరు ఆరగించారు. ఒక పావుగంటకు మించి నటీనటులతో, టెక్నిషియనులతో, ముఖ్యంగా రామారావు, కామేశ్వరరావులతో ముచ్చటించారు.

దరిమిలా ఢిల్లీ ఆంధ్రసంఘం చేసిన సన్మానంలో డాక్టర్ గోపాలరెడ్డి మాట్లాడుతూ తెలుగు చిత్రం స్వర్ణపతకం సాధించడానికి నిరంతర కృషి సాగించాలన్నారు.

కమిటీలో తాను వుండడం వల్లనేమి ఇతరు లెవరో ఉన్నత స్థానంలో వుండడం వల్లనేమి "నర్తనశాల"కు అఖిల భారత ప్రథమ యోగ్యతా పత్రం వచ్చిందీ అనుకొంటే అంతకు మించిన పొరబాటు వుండదన్నారు. పోటీ చిత్రాలలో వాటి వాటి యోగ్యతలుబట్టి అవార్డులు నిష్పాక్షికంగా నిర్ణయించడం జరిగిందని, దక్షిణ భాషా చిత్రాల సంభాషణలకు ఆంగ్ల తర్జుమాలను కమిటీ మెంబర్లకు చాలా ముందుగా యిచ్చి జాగ్రత్త పడేటట్లు చేశామని సూచించారు.

దక్షిణ దేశపు చిత్రాలు సుదీర్ఘమని, ఎంటర్‌టెయిన్‌మెంట్‌కోసం చేర్చిన భాగాలను తొలగించి ఢిల్లీ పరీక్షకు పంపితే బాగా వుంటుందని అన్నారు.

అందుమీదట గుమ్మడి మాట్లాడుతూ ఈ తొలగింపులకు ఇదమిత్థమైన నియమ నిబంధనలువుంటే బాగుంటుందన్నారు.

శ్రీ గోపాలరెడ్డి సూచనపై "జ్యోతి" ప్రతినిధి మద్రాసు ఫిలింవర్గాలలో విచారించగా అటువంటి కోతలు అవార్డు కాంపిటీషన్ నియమాలకే విరుద్ధమన్నారు.

పోతే గోపాలరెడ్డిగారిని ఢిల్లీలో కొంతమంది కవిపట్ల, కథకునిపట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడడంపై ప్రశ్నించారు.

ఉత్తమకథకు ప్రభుత్వం బహుమతి ఏర్పాటుచేసి పరీక్షించిన 128 చిత్రాలలో ఒక్కదాని కథా "అవార్డార్హం" కాదని ప్రకటించారు శ్రీ గోపాలరెడ్డిగారిని "ఈ నిర్ణయం తగునా ?" అని ఢిల్లీలో అడుగగా "తగును" అనే నొక్కి చెప్పారు. స్టాండర్డు కథ ఒక్కటీ లేదనే వక్కాణించారు.

1954 లో ఓంప్రథమంగా ఉత్తమ చిత్రాలకు అవార్డులు ఏర్పాటుచేసినప్పుడు ఆచార్య పి. కె. అత్రే తీసిన "శ్యామ్‌చీ ఆయీ"కు స్వర్ణపతకం నిర్ణయించారు. అప్పుడు చిత్రానికంటె కథకు విలువయిచ్చామని చెప్పారు. కథకు చిత్రానికి, రచయితకు, దర్శకునికి అంతటి అవినాభావ సంబంధమన్నమాట.

కేంద్రప్రభుత్వంవారి కళ్ళకు కవులు ఆనక పోవడంగురించి "జ్యోతి" ప్రతినిధి శ్రీ పింగళి నాగేంద్రరావుతో ప్రస్తావించగా ఉత్తమకథకు బహుమతి వుండేది లేక పోయేది దర్శకునితోపాటు సంభాషణ కర్తకు అవార్డు ఇవ్వడం అవసరమన్నారు. కవి పునాదివంటివారని, పునాది కన్పించక భవనంమాత్రమే కన్పించినట్లు కవి కన్పించక తారలుమాత్రమే కన్పిస్తారని, పునాదే లేనప్పుడు భవనమే లేనట్లు, కవే లేనప్పుడు చిత్రమే ఉండదని, తారలే వుండరని వక్కాణించారు. కవిని గుర్తించి సత్కరించడం సబబు అని అన్నారు. కవి, దర్శకుడు జంటకవులన్నారు. అవార్డులకయినా సరే వారిని విడదీయజాలరన్నారు. కవి కల్పించే సన్నివేశంతో, కవియిచ్చే వాక్కుతో రాణించేవారే దర్శకులు, తారలు అంటూ కవిని పాతాళంలో వుంచడం కేంద్రప్రభుత్వపు సభ్యతను, సంస్కృతిని చూపడంలేదన్నారు.

మద్రాసు సినీ సాహితీ వర్గాలు ఈ అభిప్రాయాన్ని బలపరచినవి.

నాగేశ్వరరావుకోసం మలేషియా నిరీక్షణ

మే మూడవ వారంతో అమెరికాలో నాగేశ్వరరావు పర్యటన పూర్తిఅయింది. ఇక ఆయన యూరోపు సందర్శిస్తున్నారు. అచ్చటినుంచి ప్రాచ్యఖండానికివచ్చి మలేషియాకూడా సందర్శిస్తారు. కౌలాలంపూర్‌లోని ఆంధ్రులు, ఇతర దాక్షిణాత్యులు బ్రహ్మాండమైన స్వాగత మివ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు. జూన్ రెండవ వారంలో నాగేశ్వరరావు కౌలాలంపూర్‌లో వుంటారు. ఇటీవల "నర్తనశాల" యూనిట్ కౌలాలంపూర్ వెళ్ళినప్పుడు అచ్చటి తెలుగువారు కలుసుకొని నాగేశ్వరరావుకు సన్మానం చేసే సందర్భంలో అమెరికా సమాచార శాఖతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నామన్నారు.

మే నెల తొలి రోజులు అక్కినేని సినీనట జీవితంలో సువర్ణ ఘట్టం. ప్రపంచ ప్రధాన సినీకేంద్రమైన హాలీవుడ్ కు

(లాస్ ఏంజెలెస్, కాలిఫోర్నియా) ఆయన సందర్శించారు. ట్వెంటియత్ సెంచరీఫాక్స్ స్టుడియోస్, వాల్ట్ డి స్నీ ప్రొడక్షన్స్, యూనివర్సల్ స్టుడియోస్, మెట్రోగోల్డ్ విన్ మేయర్ స్టుడియోస్ మొదలైన చలన చిత్రకేంద్రములను సందర్శించారు. అచ్చటి సినిమా నట, సాంకేతిక శిక్షణ పాఠశాలలను తిలకించారు. లాస్ ఏంజెలెస్ శివారు అయిన ఎనాహైమ్‌లోని "ప్రపంచ అష్టమ అద్భుతం" డిస్నీలాండ్ చూచారు. అచ్చటి సాంకేతికులు నాగేశ్వరరావుకు కార్టూన్ చిత్ర నమూనాలు బహూకరించారు.

మే ప్రథమార్థంలో నాగేశ్వరరావుకు తెలుగు భోజనం సుష్టుగాలభించింది. ఒక్క గోంగూర వినా అన్నీ సమకూరినవి. ఆయనకు అంతకంటే ప్రియతమమైనవి కజ్జికాయలు. సియటిల్‌లోని తెలుగువారు అక్కినేనికి అవి ఆప్యాయంగాచేసిపెట్టారు. అచ్చటి నాటకశాలలకు నాగేశ్వరరావు 100 నయాపైసల తెలుగు డ్రెస్సు - మల్లెపువ్వు వంటి పొందూరు ఖద్దరు పంచె, లాల్చీ, కండువ - ధరించి వెళ్లారు.

నాగేశ్వరరావు పిరాడంబరం అమెరికనులను ముగ్ధులను చేసినట్లు మద్రాసులోని అమెరికా సమాచారశాఖనుంచి "జ్యోతి" ప్రతినిధికి తెలియవచ్చింది.

జూన్ 24 వ తేదీ ప్రాంతాల నాగేశ్వరరావు భారతదేశం చేరబోతున్నారు. ఆయన ఆరోజున మద్రాసులోనే అడుగుపెడతారు.

అమెరికాలో అక్కినేని ఆంగ్లంలో ధారాళంగానే గోష్ఠులు జరిపారు. ఔలివిజన్‌లో మాట్లాడారు నాటక సంగీత దృశ్య కళల రంగాలలో అమెరికాలో నూతన శకమారంభమైనందుకు అమితానందం వ్యక్త పరిచారు.

"హరిశ్చంద్ర" పాటలు


విజయాప్రొడక్షన్స్‌వారి "హరిశ్చంద్ర"లో ఆరుపాటలకు స్వరకల్పన జరిగింది. జూన్‌లో రికార్డింగ్ ప్రారంభిస్తారు సంగీత దర్శకుడు పెండ్యాల. జులైలో షూటింగ్ ప్రారంభం కావచ్చునని తెలుస్తున్నది. శ్రీ కె. వి. రెడ్డి దర్శకత్వం వహించే ఈ "హరిశ్చంద్ర"లో పింగళి కవి కొత్త అంశాలు చాలా చేర్చారు. రామారావు, రంగారావు, రేలంగి, రమణారెడ్డి, ముక్కామల ఈ చిత్రంలో నటించడం ఖాయం. జయంతీ సంస్థలో శ్రీ కె. వి. రెడ్డికి దర్శకత్వ శాఖలో కుడిభుజంగావున్న శ్రీ ఎస్. శ్రీనివాసరావు ఈ విజయ చిత్రంలోకూడా ఆ బాధ్యత వహిస్తారు.

మైసూర్‌లో "పాండవ వనవాసం"

మాధవీ పిక్చర్స్‌వారు "పాండవ వనవాసం" చిత్ర నిర్మాణ సందర్భంలో లొకేషన్లు నిర్ణయించడం నిమిత్తం మైసూర్ రాష్ట్రి ప్రాంతములకు వెళ్ళారు. అచ్చట పరిశీలనలు జరిపిన మీదట దర్శకులు శ్రీ కమలాకర కామేశ్వరరావు, కవి సముద్రాల రాఘవాచార్య బెంగుళూరు వచ్చి పేపర్ వర్కు పూర్తిచేస్తున్నారు. జూన్‌లో షూటింగ్ ప్రారంభం కాగల ఈచిత్రంలో భీమసేనుడుగా రామారావు, దుర్యోధనుడుగా ఎస్.వి. రంగారావు, అర్జునుడుగా బాలయ్య, ద్రౌపదిగా సావిత్రి నటిస్తారు.

"ఉరుము కుమారులు"

మన మింతవరకు ఉత్తరకుమారులను చూచాము. ఇకముందు "ఉరుము కుమారు



లు"ను చూడబోతున్నాము. "సన్స్ ఆఫ్ థండర్" పేరిట మద్రాసులో విడుదలైన ఇటాలియన్-ఆంగ్ల డబ్బింగ్ చిత్రానికి కుడి ఎడమలలోపోతూ తెలుగుచిత్రం తీసేందుకు ఒక శతదినోత్సవ చిత్రసంస్థ నిర్ణయించింది. శ్రీ విఠలాచార్యను దర్శకత్వం వహించవలసిందని ఆ సంస్థ అభ్యర్థించింది.

శ్రీ విఠలాచార్య "కార్సికన్ బ్రదర్స్" ఆధారంగా తెలుగులో తీస్తున్న రామారావు ద్విపాత్రాభినయ చిత్రానికి "అగ్గిపిడుగు" అని నామకరణంచేశారు.

ఐదు కాల్‌షీట్‌లతో "దాగుడుమూతలు"

డి. బి. ఎన్ వారి "దాగుడుమూతలు" ఐదు కాల్‌షీట్‌లను మాత్రం దాటవలసివున్నది. రామారావు, సరోజలపై స్టూడియో సెట్‌లో నృత్య గీత మొకటి చిత్రీకరించవలసివున్నది. ఒక మిల్లు ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్‌పని కొరవపడివుంది. పోతే న్యూటోన్ స్టూడియోస్‌లో ఒక స్ట్రీట్ సెట్‌పై పనిజరగవలసివున్నది. జూన్‌కు అంతాపూర్తిఅయి కొత్త కాలేజికుర్రవాళ్ళకు గిలిగింతలుపెట్టుతుంది. రచన: ముళ్ళపూడి. దర్శకుడు: ఆదుర్తి. నిర్మాత: డి. బి. నారాయణ.

శ్రీరామా పిక్చర్స్

"దేశద్రోహులు" నిర్మాత శ్రీ బోళ్ళ సుబ్బారావు శ్రీరామా పిక్చర్స్ బ్యానర్‌లో ఈసారి భక్తిరస ప్రధానమైన జానపదం తీయదలచారు. రెండు మూడు నెలల్లో స్క్రిప్టుపని పూర్తిచేసి సెట్స్‌కు వెళ్ళేందుకు సకలం సిద్ధంచేసుకొంటున్నారు.

హిందీ చిత్రరంగ బాలశాలి అజిత్ ("షికారి", "నయాదౌర్" ఫేమ్) వరంగల్లు విద్యార్థి. వరంగల్లు కళాశాలలో యిప్పటికీ ఆయన ఫొటోవుంది. హైదరాబాద్‌లో ఫిలిం స్టుడియో స్థాపించేందుకు ఆయన దరఖాస్తు పెట్టుకొన్నారని, స్టుడియో నిర్మాణానికి యితర హంగులుకూడా చేర్చుకొంటున్నారని తెలుస్తున్నది. స్టుడియో నిర్మాణానికై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చేరిన దాదాపు 80 దరఖాస్తులలో ముందు ఎల్.వి. ప్రసాద్ గారిది ఆమోదముద్ర పొందగలదని తెలుస్తున్నది. ఆయన 15 లక్షల వ్యయంతో కలర్ స్టుడియోయే నిర్మించదలచారట. కాగా శాంతారామ్, సొహ్రాబ్ మోడికూడా హైదరాబాద్‌లో స్టుడియో నిర్మాణానికి యత్నిస్తున్నారు. ఇప్పటి శ్రీ సారథి స్టుడియోస్‌లో కొత్త (మూడవ) ఫ్లోర్ త్వరలోనే సిద్ధం కాగలదు.

'తేనెమనసులు' కొత్తతారాగణం


బాబూమూవీస్‌వారి నవశక చిత్రం "తేనెమనసులు"లో నటించేందుకు దరఖాస్తులుపెట్టుకొన్న 4000 మంది అర్థిదారులలో క్రిందివారిని ఎన్నుకొన్నారు:

జి. కృష్ణమూర్తి (తెనాలి), సి. సంధ్యారాణి (విజయవాడ), రామమోహనరావు (హైదరాబాద్), సుకన్య (రాజమండ్రి), పి. వెంకటేశ్వరరావు, ఎం. వి. చలపతిరావు, కోనేశ్వరరావు (విజయవాడ), పుష్పకుమారి (గుడివాడ), వాణీబాల (బందరు), జి. ఎన్. ఆర్. మూర్తి, బేబీ రోజారాణి.

దీనితర్వాత బాబూమూవీస్‌వారు "విశాల నేత్రాలు" నిర్మాణం ప్రారంభిస్తారు. పేపర్ వర్కు ప్రారంభమైంది.







అడగక యిచ్చిన మనసే ముద్దు
అందీఅందని అందమె ముద్దు
విరిసీ విరియని పువ్వే ముద్దు
తెలిసీ తెలియని మమతే ముద్దు॥

చకచకలాడే పిరుదులు దాటే
జడనుచూస్తే చలాకి ముద్దు
కలకాలం తలదాచుకొమ్మనే
ఎడదనుచూస్తే ఏదో ముద్దు

నడకలతో నాట్యంచేసే
నడుముచూస్తే పిడికెడు ముద్దు
పొగడి పొగడి ఉలిపించే నీ
చిలిపిపలుకులు చిటికెడు ముద్దు॥

పచ్చనిచేలే కంటికి ముద్దు
నెచ్చెలినవ్వే జంటకు ముద్దు
చెట్టూచేమ జగతికి ముద్దు
నువ్వూనేనూ ముద్దుకుముద్దు॥

డి. బి. ఎన్. వారి
"దాగుడుమూతలు"లో

ఒక సంగీత
సన్నివేశం



మద్రాసు ఫిలిం పరిశ్రమ : జయదేవ్ అభిప్రాయం

నవశక్తిఫిలిమ్స్ నిర్మాత శ్రీ కానూరి జయదేవ్ మే 17 వ తేదీన మద్రాసులోని కాస్మాపాలిటన్ క్లబ్‌లో ఫిలింజర్నలిస్టులతో మాట్లాడుతూ మద్రాసులో ఫిలిం నిర్మాణానికి లేని కొన్నివసతులను హైదరాబాద్ కల్పిస్తున్నందుననే కొందరు నిర్మాతలు, నటులు, తదితరులు హైదరాబాద్ వెళుతున్నారని, ఒక మేటి నటుడు, ఒక మేటి నిర్మాత హైదరాబాద్‌కు వెళ్ళిపోయినంతమాత్రాన మద్రాసులోని తెలుగు ఫిలింపరిశ్రమ దెబ్బ తింటుందని భావించడం సబబుకాదని అన్నారు. ఏప్రిల్ 20 వ తేదీన మద్రాసులో ఫిలింపరిశ్రమవారు ఆంధ్ర ముఖ్యమంత్రికి స్వాగతమివ్వడానికై ఉదహరించిన 112 ఫిలిం కంపెనీలలో తమ సంస్థ (నవశక్తి) పేరుకూడా పేర్కొనబడిందని, తమకు మాటవరుసకైనా చెప్పకుండా ఎవరో ఆ పని చేశారని, ఆ ఆహ్వానపత్రికకు జతగా "మద్రాసు ఫిలింపరిశ్రమ సభ్యులు" పేరిట ముఖ్యమంత్రికి ఒక అవాంఛనీయ వినతిపత్రంకూడా అందజేసినందువల్ల ఆ రెండింటితో తమ సంస్థకు ఏటువంటి సంబంధం లేదని ఇందుమూలంగా చెప్పుకోవలసివస్తున్నదన్నారు.

'డాక్టర్ చక్రవర్తి' సెన్సారింగ్


అన్నపూర్ణవారి "డాక్టర్ చక్రవర్తి" మే మూడవవారంలో సెన్సార్ అయింది. జూన్ మొదటివారంలో విడుదల అవుతుంది. నిర్మాత : డి. మధుసూధనరావు. దర్శకుడు: అదుర్తి.

మెరీనాతీరంనుంచి తుంగభద్రకు

ఛాయాచిత్రావాహ ఈ మధ్య మద్రాసు మెరీనాలో రామారావు, జమునలపై ఒక పాట చిత్రీకరించారు. వారి రెండు పాటలను ఇతర స్వల్ప సన్నివేశాలను మే మూడవ వారంలో అదేజంటపైన స్పేటవద్దకల తుంగభద్రతీరంలోచిత్రీకరించారు. సహ నిర్మాత, సంగీత దర్శకుడు అయిన టి. వి. చలపతిరావు "జ్యోతి" ప్రతినిధితో ముచ్చటిస్తూ ఇంతవరకూ ఎవ్వరూ తుంగభద్ర సౌందర్యాన్ని కొల్లగొట్టలేదని, తమకే తొలి అవకాశం దొరికిందని, అన్నారు. తలచుకొంటే జూన్ మాసాంతానికి చిత్రం సిద్ధం చెయ్యగలముకాని వ్యాపార సరళి దృష్ట్యాజూలై మాసాంతానికి సర్వసిద్ధం చేసి ఆగస్టుకు విడుదల చెయ్యగలమన్నారు. పుట్టుకకంటె పెరిగే వాతావరణమే జీవికి జీవం అనే సూత్రం ఈచిత్రం ఇతివృత్తానికిజీవం. దర్శకుడు ప్రత్యగాత్మ. నిర్మాత కె. సుబ్బరాజు. సుశీల, ఘంటసాల, ఎస్. జానకి, మాధవపెద్ది, జయదేవ్‌ల పాటలు కల ఈ చిత్రానికి ఎస్. రాజేశ్వరరావు స్వరకల్పన చేశారు.

వ్యంగ్య ప్రధాన చిత్రం

గొగోల్ ప్రసిద్ధ నాటకం (ఇన్‌స్పెక్టర్ జనరల్) ప్రాతిపదికగా రామయ్య తమిళంలో రచించిన నాటకం ఆధారం చేసుకొని సుగంధిపిక్చర్స్ (హైదరాబాద్) శ్రీసారథి స్టుడియోస్‌లో "గ్రామదేవతలు" అనేవ్యంగ్య ప్రధాన చిత్రం నిర్మిస్తున్నారు. మే ఎనిమిదిన ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం జరిపారు. శ్రీ రేలంగి వెంకట్రామయ్య క్లాప్ కొట్టారు. సి. ఎస్.



హైదరాబాదులో "మూగమనసులు" శతదినోత్సవం సందర్భంలో డాక్టర్ చెన్నారెడ్డి దగ్గరనుంచి బహుమతిని అందుకొంటున్న శ్రీ ఆదుర్తి సుబ్బారావు. మధ్యనున్నవారు శ్రీ కాట్రగడ్డ శ్రీనివాసరావు, శ్రీ సి. సుందరం

రావు డైరెక్టు చేస్తున్న ఈ చిత్రంలో జగ్గయ్య, రేలంగి, చలం, ధూళిపాళ, రాజబాబు, అల్లు రామలింగయ్య, ప్రసాద్, లంక సత్యం, రాజసులోచన, నూతన నటి ఉషాకుమారి నటిస్తున్నారు. సంగీతం : పెండ్యాల, ఛాయ: వెంకట్, సంభాషణలు: పద్మరాజు.

వందరోజుల గోదావరిపరవళ్ళు

గోదావరి గట్టుపై, పిట్టలపై బాబూమూవీస్‌వారు తీసిన "మూగమనసులు" మే రెండవవారంలో 19 కేంద్రాలలో శతదినోత్సవం జరుపుకొన్నది. అయితే అసలు పండుగ రెండచోట్ల మాత్రమే జరిగింది. చిత్రంలో అధికభాగం తీసిన అమలాపురం కమలేశ్వరటాకీస్‌లోను, హైదరాబాద్‌లోని బసంత్ థియేటర్‌లోను 12, 14 తేదీలలో నూరు రోజుల పండుగ జరిపారు. సావిత్రి, జమున, సూర్యకాంతం, గుమ్మడి, పద్మనాభం, అల్లు రామలింగయ్య, నిర్మాత : సుందరం మొదలైనవారు ఈ వుత్సవాలలో పాల్గొన్నారు. హైదరాబాద్ ఉత్సవంలో మంత్రి శ్రీ చెన్నారెడ్డి ప్రసంగిస్తూ సినిమా నిర్మాణ కేంద్రంగా హైదరాబాద్ రూపొందించే సుదినము, మొత్తం ఆసియా గర్వించగల కలర్‌స్టూడియో హైదరాబాద్‌లో వెలసే మంచిరోజు చాలా చేరువలో వున్నదన్నారు.

రమ్యమైనచిత్రం "రాముడు-భీముడు"

సుశీల (శాంతకుమారి)యొక్క తమ్ముడు కాని తమ్ముడు భీముడు (రామారావు ది ఫస్ట్) తమ్ముడైన రాముడుగా (రామారావు ది సెకండ్) భోగాలూ, బాధలూ అనుభవించి, సుశీల, రాముళ్ళ సమస్యలు పరిష్కరించి సుశీలకే కాక రాముడుకే తమ్ముడు, నిజమైన తమ్ముడు అని నిరూపించిన చిత్ర విచిత్రపు మెలికల మలుపుల గాథ సురేష్ ప్రొడక్షన్స్‌వారి "రాముడు - భీముడు" చిత్రం.

ఒకే పోలికలు కల ఇద్దరు వ్యక్తులు, వారికి సంబంధించిన యిద్దరు అమ్మాయిలు, వాళ్ళ చుట్టూ తల్లులూ, తండ్రులూ అనగానే కథ చిక్కుదారంగా వుంటుంది. కాని ఈచిత్రం కథకుడు, సంభాషణకర్త శ్రీ డి. వి. నరసరాజు అరటిపండు చేతిలో వలిచి పెట్టినట్లు స్క్రిప్టును జాగ్రత్తగా సూటిగా సిద్ధంచేసినందువల్ల చిక్కుదారం గాలిపడగ దారంలా సూటి అయినది. ఆ దారంతో ఆగాలిపటాన్ని ఆనందపుటాకాశంలో దర్శకుడు చాణక్య, యువనిర్మాత రామానాయుడు ఎగురవేయగలిగారు. ఆ రెండు రెక్కల గాలిపటమే రామారావు రెండు భూమికలూ అయితే దాని తోక, కుచ్చులు, బద్దలు పాత్రలూ, పాత్రధారులూ. బ్యాలెన్స్ తప్పినప్పుడు పటం డింకీలు కొట్టినట్లు సుశీల క్రూర భర్త పానకాలు (రాజనాల) 'అన్ బ్యాలెన్స్‌డ్' చర్యలవల్ల కథాగతిలో రసవత్తరమైన, ప్రమాద భరితమైన పరిణామాలు కానవస్తవి.


అసలుచిత్రం చప్పట్లతో ప్రారంభమౌతుంది. రామారావు తొలి ద్విపాత్రాభినయమని చెబుతుంది, ఆ చప్పట్లు ఆయన నటనా విశిష్టతకు, మొత్తం చిత్రం సాంకేతిక, అభినయ ప్రమాణానికి వర్తిస్తాయి. రాముడుగా వేసినా, భీముడుగా వేసినా పానకాలు భవంతిలో వున్నప్పుడు రామారావు నటన చాలా సహజంగా, విశిష్టంగా వుంది. రాముడు - భీముడు అక్కగా శాంతకుమారి అతి సహజమైన పాత్రను మనకళ్ళయెదుట నిలిపారు. ఆరుద్ర, శ్రీ శ్రీ, సినారె, కొసరాజు గేయరచన, పెండ్యాల సంగీతం, రాజేంద్రకుమార్ కళ, అన్నయ్య ఛాయాగ్రహణం ప్రసాద్ ప్రొడక్షన్స్ టెక్నిషియన్ స్పెషల్ఎఫెక్ట్స్, మార్తాండ్ కూర్పు ఆనందదాయకంగా, అహ్లాదకరంగా చిత్రంతయారవడానికి తోడ్పడినవి. రంగారావు, జమున, రేలంగి, విజయలక్ష్మి, రమణారెడ్డి, గిరిజ, సూర్యకాంతం, ఋష్యేంద్రమణి, హేమలత, బాబు మొదలైనవారు తారాగణంలో కలరు.

ఒక కొత్తరకం చిత్రాన్ని భారీయెత్తులో సమర్పించినందుకు నిర్మాతలు అభినందనీయులు.

కొత్త చిత్రాలు

మే నెలలో విజయభట్ మూవీస్‌వారి "కల్పగం", గౌరీ ప్రొడక్షన్స్‌వారి జానపదం, మరొక సంస్థ "మంగమ్మశపథం" నిర్మాణదశలో పడినవి.

ఎస్. ఆర్. మూవీస్‌వారి "ప్రమీలార్జునీయం", ఇంకా "బభ్రువాహన", "వాడే అదజన్మే", "శ్రీ సత్యనారాయణ వ్రత మహత్మ్యం", "అగ్గిపిడుగు" మొదలైన చిత్రాల షూటింగ్ జోరుగాసాగింది. ooo



Wrapper Printed at Neo Art Press, Madras - 2